శ్రీలలిత

తృతీయ భాగము

(201 నుండి 300 నామములకు వివరణము)

3

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2008 గురుపూర్ణిమ
ప్రతులు : 1,000

వెల : రూ॥ **40-00**

ప్రాప్తిస్థానము :

జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్',
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.
e-mail : dhanishta@rediffmail.com

ముద్రణ :
♒ ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 0891-2747320.

ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ", డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచుచున్నారు.

శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "*పరహితము పరమధర్మ*" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

- ధనిష్ఠా ఫౌండేషన్

తొలిపలుకు

"శ్రీలలిత" అను శీర్షికగా మాస్టర్ పార్వతీకుమార్‌గారు లలితా సహస్రనామములకు వ్యాఖ్యానము వ్రాయుచున్నారు. అవి ప్రతి మాసము 'నావాణి' దర్శన మాస పత్రికయందు ప్రచురింపబడుచున్నవి. పాఠకుల కోరికపై మొదటి 108 నామములను 'ప్రథమ భాగము'గ, దాని తదుపరి 109వ నామము నుండి 200వ నామము వరకు 'ద్వితీయ భాగము'గ "ధనిష్ఠ" ప్రచురించినది. తదాపి 201వ నామము నుండి 300వ నామము వరకు 'తృతీయ భాగము'గ ప్రస్తుతము అందించుచున్నాము.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి వివరణము ఎల్లవేళల సత్సాధకుల నుద్దేశించియే యుండును. వారి భాష కూడ చాల సరళము. గంభీరమగు విషయములను పామరులకు సహితము అందించగల స్పష్టత ఆయన భాషణమందు, రచనలయందు గోచరించును. వారినుండి వెలువడిన విజ్ఞానాంశ మేదైననూ ఆచరణకు స్ఫూర్తి కలిగించునట్లుగ నుండును.

ఆవేశములేని ఆచరణ వారి యందు, వారి భాషణయందు నిత్యము గోచరించు చుండును. ఆచరణయే ఇహపరములకు పరిష్కారమని వారి బోధనలు ప్రస్ఫుటము చేయుచుండును.

అందులకే ఈ ముద్రణము.

- ధనిష్ఠ

పరిచయము

లలితాదేవి, శ్రీదేవి, దుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి, రాజరాజేశ్వరి, త్రిపురసుందరి, ఇవియన్నియు జగదంబ నామములే. విశ్వ చైతన్యమే జగదంబ. ఆమె నుండియే త్రిగుణములు, పంచభూతముల సృష్టి ఏర్పడుచున్నది. ఇవియే ఆమె అష్ట ప్రకృతులు. అందలి చైతన్యమామెయే. అష్ట ప్రకృతులకు మూలము కనుక ఆమెయే మూల ప్రకృతి. సృష్టికి మూలాధారము ఆమెయే. అవ్యక్త స్థితియందు సత్యముగను, వ్యక్త స్థితియందు మహాచైతన్యముగను విరాజిల్లునదియే శ్రీమాత.

సమస్త దేవతామూర్తులు, గ్రహగోళములు, సర్వజీవకోటి శ్రీలలిత నుండి ఏర్పడినవే. ఆమె లీలావిలాసము, సృష్టివైభవము సహస్ర నామములతో కొనియాడబడినది. వర్ణన కతీతమైనను ఆమెను వర్ణించు ప్రయత్నము, ఆ మహా చైతన్యమున స్థితి గొనుటకు వినియోగ పడును. అందులకే పారాయణము.

అవగాహనతో కూడిన పారాయణము చేయుట వలన రుచి తెలియును. రుచియనగ వెలుగు. రుచియనగ అనుభూతి కూడ. అట్టి దర్శనము అందరికి దక్కవలెనని, అనుభూతి అందరికిని కలుగవలెనని ఋషుల ఆకాంక్ష. అవగాహన అనుభూతికి మార్గము చూపును గనుక వ్యాఖ్యానములు సరళముగనున్నచో అవగాహన సులభము. అందులకే ఈ వ్యాఖ్యానము. సామాన్యు లకు వినియోగపడినచో ఈ ప్రయత్నము సఫలము.

- పార్వతీకుమార్

విషయసూచిక

201.	సద్గతిప్రదా	....	15
202.	సర్వేశ్వరీ	....	17
203.	సర్వమయీ	....	19
204.	సర్వమంత్ర స్వరూపిణీ	....	21
205.	సర్వ యంత్రాత్మికా	....	22
206.	సర్వతంత్రరూపా	....	23
207.	మనోన్మనీ	....	25
208.	మహేశ్వరీ	....	28
209.	మహాదేవీ	....	30
210.	మహాలక్ష్మీ	....	32
211.	మృడప్రియా	....	34
212.	మహారూపా	....	36
213.	మహాపూజ్యా	....	37
214.	మహాపాతకనాశినీ	....	38
215.	మహామాయా	....	39
216.	మహాసత్త్వా	....	41
217.	మహాశక్తి	....	43
218.	మహారతిః	....	44
219.	మహాభోగా	....	46
220.	మహైశ్వర్యా	....	48
221.	మహావీర్యా	....	49
222.	మహాబలా	....	50

223.	మహాబుద్ధి	....	52
224.	మహాసిద్ధి	....	54
225.	మహాయోగేశ్వరేశ్వరీ	....	57
226.	మహాతంత్రా		
227.	మహామంత్రా	....	58
228.	మహాయంత్రా		
229.	మహాసనా	....	61
230.	మహాయాగ క్రమారాధ్యా	....	62
231.	మహాభైరవ పూజితా	....	63
232.	మహేశ్వర మహాకల్ప మహాతాండవ సాక్షిణీ	....	65
233.	మహాకామేశమహిషీ	....	66
234.	మహాత్రిపురసుందరీ	....	67
235.	చతుష్షష్ట్యుపచారాఢ్యా	....	69
236.	చతుష్షష్టి కళామయీ	....	71
237.	మహాచతుష్షష్టి కోటి యోగినీ గణసేవితా	....	73
238.	మనువిద్యా	....	75
239.	చంద్రవిద్యా	....	78
240.	చంద్రమండల మధ్యగా	....	80
241.	చారురూపా	....	82
242.	చారుహాసా	....	85
243.	చారుచంద్ర కళాధరా	....	87
244.	చరాచర జగన్నాథా	....	89
245.	చక్రరాజనికేతనా	....	91
246.	పార్వతీ	....	93
247.	పద్మనయనా	....	95

248.	పద్మరాగ సమప్రభా	....	96
249.	పంచప్రేతాసనాసీనా	....	97
250.	పంచబ్రహ్మ స్వరూపిణీ	....	99
251.	చిన్మయీ	....	102
252.	పరమానందా	....	105
253.	విజ్ఞానఘనరూపిణీ	....	107
254.	ధ్యాన ధ్యాతృ ధ్యేయరూపా	....	108
255.	ధర్మాధర్మ వివర్జితా	....	110
256.	విశ్వరూపా	....	113
257.	జాగరిణీ	....	115
258 నుండి 263	స్వపంతీ, తైజసాత్మికా, సుప్తా, ప్రాజ్ఞాత్మికా, తుర్యా, సర్వావస్థా వివర్జితా	....	117
264.	సృష్టికర్త్రీ	....	120
265.	బ్రహ్మరూపా	....	121
266.	గోప్త్రీ	....	122
267.	గోవిందరూపిణీ	....	123
268 నుండి 270.	సంహారిణీ రుద్రరూపా తిరోధానకరి	....	124
271.	ఈశ్వరీ	....	126
272.	సదాశివా	....	128
273.	అనుగ్రహదా	....	130
274.	పంచకృత్య పరాయణా	....	132
275.	భానుమండల మధ్యస్థా	....	134

276.	భైరవీ	....	136
277.	భగమాలినీ	....	138
278.	పద్మాసనా	....	140
279.	భగవతీ	....	143
280.	పద్మనాభ సహోదరీ	....	144
281.	ఉన్మేషనిమిషోత్పన్న విపన్న భువనావళిః	....	145
282.	సహస్రశీర్షవదనా	....	147
283.	సహస్రాక్షీ	....	150
284.	సహస్రపాత్	....	150
285.	ఆబ్రహ్మకీటజననీ	....	153
286.	వర్ణాశ్రమవిధాయినీ	....	154
287.	నిజాజ్ఞారూపనిగమా	....	157
288.	పుణ్యాపుణ్య ఫలప్రదా	....	159
289.	శ్రుతిసీమంత సిందూరీకృత పాదాబ్జధూళికా	....	161
290.	సకలాగమ సందోహ శుక్తిసంపుట మౌక్తికా	....	163
291.	పురుషార్థప్రదా	....	165
292.	పూర్ణా	....	167
293.	భోగినీ	....	169
294.	భువనేశ్వరీ	....	171
295.	అంబికా	....	172
296.	అనాదినిధనా	....	174
297.	హరిబ్రహ్మేంద్రసేవితా	....	178
298.	నారాయణీ	....	179
299.	నాదరూపా	....	181
300.	నామరూప వివర్జితా	....	183

శ్రీలలిత - 3

తృతీయ భాగము

శ్రీలలిత

ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః ।

201. 'సద్గతిప్రదా'

సద్గతిని ప్రసాదించునది శ్రీదేవి అని అర్థము.

సత్యమునకు దారి చూపుట శ్రీదేవి ఆశయము. దానిని ప్రసాదించుట ఆమె అనుగ్రహము. సత్యమును చేరుటయే జీవుల గమ్యము. జన్మ పరంపర లన్నియూ జీవులను సత్యము వైపునకే నడిపించును. రకరకముల అనుభవములను పొందుచూ, సమగ్రత్వము చెందుచూ, జీవుడు పరిణామమున ముందుకు సాగుచు నుండును. నిరుపమానమైన ఓర్పుతో ప్రేమతో కరుణతో శ్రీదేవి జన్మ పరంపరల నొసగుచూ జీవులను సద్గతివైపు నడిపించు చుండును. "జీవులు దేనిని అభిలషించుచునైననూ చివరకు నన్నే చేరుచున్నారు. దేని నన్వేషించు వారైననూ నన్ను గూర్చియే అన్వేషించు చున్నారు. వారి ఆనందాన్వేషణము నన్ను చేరుటకే." ఇట్లు చేరుటకు దేహము లావశ్యకములు. జన్మ పరంపర లావశ్యకము. ప్రకృతి రూపమున శ్రీదేవి ఇట్టి జన్మల ననుగ్రహించుచూ అనుభవమును, అనుభూతిని కలిగించుచూ జీవులను సత్యము వైపునకు నిరంతరము నడిపించుచునే యున్నది. అజ్ఞానవశులైన వారు కూడ సత్యపథముననే నడుచుచున్నారని తెలియుట సమగ్ర జ్ఞానము. అనుభవ లేమియే

అజ్ఞానము కాని అది దుష్టత్వము కాదు. అజ్ఞాని, జ్ఞాని కూడ వారి వారి అనుభవముల ననుసరించుచూ క్రమముగ దైవమును చేరుటయే సృష్టి కథ. మాతృభావము కలిగినవారే తెలిసిన వారిని, తెలియని వారిని కూడా ఒకే ప్రేమతో నడిపింతురు. అట్టి కరుణామయి శ్రీదేవి అని తెలియవలెను.

202. 'సర్వేశ్వరీ'

సకలమునకు ఈశ్వరి శ్రీదేవి అని అర్థము.

సృష్టి యందు సర్వమూ శ్రీదేవి అధీనముననే యున్నది.

సృష్టి చైతన్యము శ్రీదేవియే. అన్ని జీవరాశులయందు ఆమె చైతన్యమే విరాజిల్లుతూ నున్నది. త్రిగుణములుగాని పంచభూతములు గాని తమకు తాముగా ఏమియూ నిర్వర్తింపజాలవు. అట్లే జీవులు కూడ తమకు తాముగా ఏమియూ నిర్వర్తింపజాలరు. జీవులయందు ఇచ్ఛగాని, జ్ఞానముకాని, క్రియాశక్తిగాని పనిచేయుటకు వారి యందున్న చైతన్యమే ఆధారము. చేతన లేనప్పుడు జీవునికి తనకు తా నున్నాడని కూడ తెలియదు. అందరి యందు, అన్నిటి యందు తానుండి, ఆయా ధర్మములను నిర్వర్తించు శక్తిగా శ్రీదేవియే యున్నది. ఇది ఆమె ఈశ్వరత్వము. ఉప్పు ఉప్పుగా నుండుట, వేప చేదుగ నుండుట, నిమ్మ పులుపుగ నుండుట, తేనె తీపిగ నుండుట యందు కూడ శ్రీదేవి అస్థిత్వము దర్శింప వచ్చును. ఇట్లందరి జీవుల సమస్త చేష్టలకు ఆధారముగా నున్నది శ్రీదేవి.

సృష్టి యందు సమస్తమునకు ఆమె ఈశ్వరి. ఆమెకు ఈశ్వరు డాయన. ఆయన (ఈశ్వరుడు) కూడ కనుపింపవలె నన్నచో ఆమెయే ఆధారము. ఆమె లేని ఆయన జగత్తునకు లేడు. ఆయన లేక ఆమె ఏమియూ చేయలేదు. నిజమునకు ఆమె ఆయన ఒకటియే.

కనిపించునపు డామె యగును, సంకల్పించినపుడు ఆయన యగును. ఏమీ సంకల్పించని స్థితిలో కేవలము తానుగ నుండును, ఆ తాను ఆమె కాదు, ఆయన కాదు. రెండునూ ఏకము చెందిన స్థితి. ఆ ఏకత్వము నుండి తాను అస్థిత్వము (ఆయన)గను, చేతన (ఆమె)గను ఏర్పడుదురు. ఇవి రెండును అవిభాజకములు. అందు వలననే సర్వేశ్వరి, సర్వేశ్వరుడని సంబోధింతురు. సత్, చిత్‌లు లేనిచో ఏమియూ లేదు. కావున వారిదే ఈశ్వరత్వము. ఈశ్వరత్వ మనగా అన్నిటి యందునూ అస్థిత్వముగను, చైతన్యముగను వశించి స్వామిత్వమును నెరపుట.

203. 'సర్వమయీ'

సర్వమూ తానై యున్నది శ్రీదేవి అని అర్థము. పై నామమున తెలిపిన ఈశత్వము హద్దు లేనిదై సృష్టి యంతయూ వ్యాపించి యుండును. సృష్టి రూపము ఆమె రూపమే. అందలి కోటానుకోట్ల జీవుల రూపము కూడ ఆమెయే. అందు వర్తించు పంచభూతములు ఆమెనుండి పుట్టినవే. ఆయా జీవుల స్వభావము లన్నియూ వారి యందలి త్రిగుణములు సంమిశ్రమమై యుండగ అట్టి త్రిగుణము లామె నుండి పుట్టినవే. ఆ జీవుల అస్థిత్వము కూడ ఆమెయే. ఇట్లు అంతయూ ఆమెయే అయి వుండగ అట్టి అద్భుత దర్శనము కలిగి నపుడు సర్వమయీ అను నామము సత్యమై నిలచును.

ప్రత్తి ఆధారముగ అనేకానేక వస్త్రములు, దుస్తులు, ఇతర వస్తువులు ఏర్పడుచున్నవి. ఈ వివిధత్వము కలిగిన సమస్త వస్తువులకు ప్రత్తియే ఆధారము కదా! ప్రత్తియే లేనిచో దుస్తులేమియు లేవు. ప్రత్తియే ఇట్లు రూపాంతరము చెందినది. ఇది తెలియుట సులభము కాని సత్యలోకము నుండి భూలోకము వఱకూ చైతన్యమే త్రిగుణములుగను, జీవులుగను, జీవ రూపములుగను అల్లుకొని యున్నదని తెలియుటకు శ్రద్ధ కావలెను. దర్శన మగుటకు భక్తి కావలెను. భావన చేయుటకు ఓర్పు కావలెను. స్వభావము నిర్మలము కావలెను. అపుడే సర్వమయీ తత్త్వము తెలియనగును.

భువన మంతయూ రెండు వందల ఇరువది నాలుగు (224) లోకములుగ తంత్రము తెలుపుచున్నది. దీనిని 'భువనాధ్వము' అందురు. అట్లే శబ్దము 52 అక్షరములుగను, వర్ణములుగను తెలుపబడుచున్నది. దీనిని 'అక్షరాధ్వము' అందురు. మూలవిద్య నుండి పుట్టిన ఏడు కోట్ల మహా మంత్రములు శ్రీదేవి రక్తముగ తెలుపబడినది. దీనిని 'మంత్రాధ్వము' అందురు. ఈ మంత్రముల గుంపులను శ్రీదేవి మాంస రూపముగ తెలుపుదురు. దీనిని 'పదాధ్వము' అందురు. పంచభూతములు, పంచేంద్రియములు, పంచతన్మాత్రలు, పంచ ప్రాణములు, పంచాంగములు, జీవుడు, దేవతల ఉచ్చారణముగ శబ్దము నుండి ఏర్పడినవి. దీనిని 'తత్త్వాధ్వము' అందురు.

ఇట్లు పంచాధ్వములుగ శ్రీదేవియే వ్యాప్తి చెంది యుండుటచేత సర్వమునూ ఆమెయే అని తెలియనగును. సర్వమయీ అనగా ఐదు మార్గములుగ శివ స్వరూపమును తెలుపుట.

204. 'సర్వమంత్ర స్వరూపిణీ'

సర్వమంత్రముల రూపము శ్రీదేవియే అని అర్థము.

మంత్ర మనగా మననము చేయుకొలదీ రక్షించునది అని అర్థము. మంత్రము శబ్ద స్వరూపము. శబ్దము శ్రీదేవి స్వరూపమే. ఏ దేవతా రూపమైననూ శ్రీదేవి వలననే ఏర్పడినది. నామము శబ్దమునుండి ఏర్పడినదే. నామ రూపములతో కలది మంత్రదేవత. అట్టి దేవతకు ఆధారము శ్రీదేవియే. మన వాఙ్మయమున ఏడుకోట్ల మంత్రములు గలవని తెలుపబడినది. అన్ని మంత్రములూ శ్రీదేవి రూపములే అని తెలియవలెను. బంగారు ఆభరణములు ఎన్ని యున్ననూ వానికి మూలము బంగారమే కదా! అట్లే మంత్ర రూపములు, మంత్రములు ఎన్ని యున్ననూ అవి అన్నియూ శ్రీదేవి రూపములే.

ప్రకృతియైన శ్రీదేవి నుండి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇంద్రాది అష్ట దిక్పాలకులు, నవగ్రహములు, ఆదిత్యులు, రుద్రులు, వసువులు, పంచభూతములు, జీవులు ఏర్పడినవి. వీనియందు దేని నారాధించిననూ దానికి మూలము శ్రీదేవియే. శ్రీదేవి ఆరాధనము ఈ విధముగ అన్ని ఆరాధనములకు మూలమై యున్నది.

205. 'సర్వ యంత్రాత్మికా'

అన్ని యంత్రముల మూలము శ్రీదేవి అని అర్థము.

యంత్రములు సృష్టి వ్యూహములు. అవి వరుసగా బిందువు, వృత్తము, త్రిభుజము, చతుర్భుజము, పంచభుజము, షష్ఠభుజము, అష్టభుజము ఆదిగా ఏర్పడుచుండును. ఈ వ్యూహముల నుండియే శ్రీదేవి సమస్త సృష్టిగ ప్రకాశించును. యంత్రముల రూపములు కూడ పై తెలిపిన ఆకారములతో యుండును. ఈ యంత్ర వ్యూహము లన్నియూ కూడ శ్రీదేవి నుండియే దిగివచ్చినవి. మంత్రము లాధారముగ యంత్రము లేర్పడును. యంత్రము లాధారముగ మంత్రములు సిద్ధించును (అవతరించును). ఈ యంత్రములకు ఆత్మగ శ్రీదేవియే యున్నది. కావున ఆమె యంత్రాత్మికా. శబ్దముల ద్వారా యంత్రముల నుండి అవతరించి రూపు కట్టుకొనునది కూడ శ్రీదేవియే. అందువలన ఆమె మంత్ర స్వరూపిణి. మంత్రము రూపముగను, యంత్రము ఆత్మగను కూడ విరాజిల్లు చున్నది.

206. 'సర్వతంత్రరూపా'

సర్వ తంత్రముల స్వరూపము కూడ శ్రీదేవియే అని అర్థము.

తంత్రమనగా శాస్త్రీయ విధానము. శాస్త్రీయ మనగా శాస్త్ర విధాన జ్ఞానము. ఏది ఎట్లు చేయవలెనో, అట్లు చేసిననే అది సిద్ధించును. అట్లు చేయనిచో సిద్ధింపదు. దీనినే శాస్త్ర విధి యందురు. ఏ పనికైనను శాస్త్ర విధాన మున్నది. ఇది తెలియుట జ్ఞానము. తెలిసి చేసినచో కృతకృత్యులగుదురు. తెలియక చేసినచో వైఫల్య ముండును.

పై విధమగు శాస్త్ర విధి తంత్రము. తెలిసి చేయుట ఒక పద్ధతి. చేయుచూ తెలుసుకొనుట మరియొక పద్ధతి. మంత్రమును ఎట్లు మననము చేయవలెనో తెలియవలెను. యంత్రమును ఎట్లు పూజింపవలెనో తెలియవలెను. ఇట్లు తెలిసి ఆరాధించుటను తంత్ర మందురు. యంత్రములను శాస్త్ర విధిగ ఆరాధించినచో మంత్రము సిద్ధించి తద్దేవతా స్వరూపము ప్రత్యక్షమగును. తోచినట్లు చేయుట వలన సిద్ధి కలుగదు.

ఋషులు మంత్రములను, యంత్రములను గ్రహించి అనేకానేక దేవతా శక్తులను సిద్ధింప చేసుకొనినారు. సద్గురువు సాన్నిధ్యమున సకల దేవతలు కొలువై యుందురని తెలుపుటలోని రహస్య మిదియే. వారు విధి విధానముగ ఆరాధనము గావించి వివిధములగు దేవతలను సిద్ధింప జేసిరి. శ్రీ రామకృష్ణ పరమహంస సర్వమత వ్యవస్థాపకులను కూడ ఆయా మార్గముల ఆరాధించి

సిద్ధింప చేసుకొనెను. ఋషులు, సద్గురువులు మంత్ర యంత్ర స్వరూపములను కూలంకషముగ గ్రహించి తంత్రముల నందించి నారు. నిర్దిష్టమగు ఈ తంత్ర శాస్త్రము తెలిసినవారు వైజ్ఞానికముగ దేవతలను సిద్ధింపజేసికొను శక్తి కలవారై యుందురు. వారే పూర్వము మంత్ర యంత్రముల ద్వారా వర్షములను కురిపించుట, దేవతలను అవతరింపజేయుట గావించిరి. ఆకాశమున పయనించుట, కొండ లను మోయుట, నదీ గమనములను మార్చుట కూడ చేసిరి.

తంత్రమునకు నిష్ఠ, నియమము, ఏకాగ్రత, దీక్ష, మనోబలము, మనోనిర్మలము ఇత్యాది గుణములు ముఖ్యము.

సర్వ తంత్ర స్వరూపిణియైన శ్రీదేవి ఈ తంత్ర శాస్త్రముల కధిదేవత. ఆమె అధ్యక్షతనే మంత్రము, యంత్రము, తంత్రము యున్నవి. మంత్రమును యంత్రముపై తంత్ర పూర్వకముగ ప్రయోగించుట సిద్ధి నీయగలదు. ఈ తంత్ర జ్ఞాన మంతయూ శ్రీదేవి అనుగ్రహము కలవారికి శీఘ్రముగ సిద్ధించును. కాళిదాసు, తెనాలి రామకృష్ణుడు అట్టివారు. ఇటీవలి కాలమున శ్రీ రామకృష్ణ పరమ హంస అమ్మ అనుగ్రహమున సర్వతంత్రముల నెరిగెను. రామకృష్ణునికి తంత్రము నేర్పుటకై వచ్చిన తంత్రవేత్తలు అతడప్పటికే ఎరిగిన తంత్రమునకు దిగ్భ్రాంతి చెందిరి.

భక్తి పూర్వకముగ శ్రీదేవి నారాధించు వారికి సర్వమూ హస్తగత మగును. మంత్రము, తంత్రము, యంత్రము వారి కధీనమై యుండును.

207. 'మనోన్మనీ'

మనస్సునకు అచంచలమగు స్థితిని ప్రసాదించునది శ్రీదేవి అని అర్థము.

మనస్సు సహజముగ చంచల; అనేకానేక భావములకు ఆటపట్టు. మనస్సును పట్టుట సులభము కాదు. పట్టిననూ పాద రసమువలె జారిపోవునది మనస్సు. ఇట్టి మనస్సు బాగుగ ఆకర్షింప బడినచో ఆకర్షిత విషయమందు లగ్నమై యుండును. మనస్సును ఆకర్షించు విషయములలో అందము ప్రధానమైనది. అందమైన వస్తువునుగాని, ప్రదేశమునుగాని, వ్యక్తినిగాని, జంతువును గాని చూచినపుడు మనస్సు ఆకర్షిత మగును. తెల్లని పావురము, తెల్లని గుఱ్ఱములు, తెల్లని కుక్క, తెల్లని మబ్బు, ఇత్యాదివి చూచినపుడు మనసు అప్రయత్నముగ ఆకర్షింపబడును. అట్లే అందమైన వ్యక్తులను చూచినపుడు కూడ ఆకర్షింపబడును. సృష్టి యందలి ఈ ఆకర్షణ మనస్సును ఉన్మీలనము చేయును. ఇట్లు ఉన్మీలనము చేయగల శక్తి ఉన్మని. శ్రీదేవి అందమే సృష్టి యందు భాసించు చున్నది. అందు వలననే జీవులు అందమునకు ఆకర్షింపబడుదురు. ఆమె అందము నకు మూలము. ఆనందమునకు కూడ మూలము. శ్రీదేవి అందము మొదటి 52 నామములలో తెలుపబడినది. శ్రీదేవి కన్న అందమైనది సృష్టిలో ఏమియునూ లేదు. ఆమె రూపమునందు మనస్సు లగ్న మైనచో మనస్సు హరింపబడి ఆనందముతో నిండును. తన్మయ

స్థితి కలుగును. అనగా తాను లేని స్థితి కలుగును. అపుడచట నుండునది ఆనందమే. మనస్సు హరింపబడుటకు అత్యంత అందమగు రూపము నారాధించుట మన సంప్రదాయమున నున్నది. అందమైన రూపమునకు అలంకారములు గావించి ఆరాధించుట మన విధానము. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీ మహావిష్ణువు, శ్రీ లలిత ఇత్యాది రూపములు అమిత ఆకర్షణీయములు. వీని ఆరాధనమున ఆరాధించువారు, ఆరాధనము, ఆరాధింపబడు అందమున లయ మగుదురు. అపుడు భక్తి పారవశ్యము కలుగుట, తన్మయత్వము కలుగుట జరుగును. శ్రీ రామకృష్ణ పరమహంస ఆరాధనము తరచుగ ఈ స్థితిని చేరుకొనెడిది. దీనిని 'ఉన్మనీ' స్థితి అందురు.

మన శరీరమున భ్రూమధ్యము నుండి ఎగువగ ఎనిమిదవ స్థానమును ఉన్మనీ స్థాన మందురు. అటుపైన నుండునది బ్రహ్మ రంధ్రమే. ఉన్మనీ స్థానమునందే కారణములకు కారణము కలదు. ఈ స్థితి చేరినవారే కారణ శరీరమును కూడ విసర్జించి బ్రహ్మత్వమును పొందగలరు.

ఉన్మనీ స్థితియందు, వ్యక్తిగత ఎఱుక యుండదు. కల యుండదు, కాల ముండదు, దేవత యుండదు, ఆరాధకు డుండడు, కేవల ముండుటయే యుండును. దీనినే పరిపూర్ణత్వ మందురు. పరిపూర్ణ స్వాతంత్ర్యము అందురు. పరము, శుద్ధము, సత్యము, శివము, సుందరము అని ఇతర నామములు. నిరంజనము, నిస్సంకల్పము అని కూడ అందురు.

ఉన్మనీ ముద్ర యోగమున తెలుపబడినది. ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఊర్ధ్వగతి చెంది ఉదాన వాయువున స్థిరపడి కన్నులు ఉన్మేషములై స్థిరపడి యుండుట ఉన్మనీ ముద్ర. క్రియా యోగమున బాబాజీ ముఖ చిత్రము ఈ ముద్రనే ప్రకటించును. ఈ స్థితిని చేరిన వారికి తెలియని విషయ ముండదు. వారు సర్వ విదులు.

శ్రీదేవి ఆరాధనము ఇట్టి తన్మయ స్థితిని కలిగించ గలదని మనోన్మనీ నామము తెలుపుచున్నది. ఇదే శివపరముగ, విష్ణుపరముగ మనోన్మనాయ అని తెలుపుదురు.

208. 'మహేశ్వరీ'

ఓంకారమున కతీతమైనది; గుణముల కతీతమైనది శ్రీదేవి అని అర్థము.

జీవులు ఈశ్వరత్వము చెందగలరు. అనగా స్వాలంబనము పొందగలరు. స్వతంత్రతను పొందగలరు. కాని జీవులకు ఈశ్వరత్వ మనుగ్రహించు తత్త్వము మహేశ్వర తత్త్వము. వేదమునందు, వేదాంతమునందు ప్రతిపాదింపబడినది ఓంకారము. అట్టి ఓంకారము నకు కూడ పరమైనది మహేశ్వర తత్త్వము. మహేశ్వర పదమునకు త్రిగుణాతీత తత్త్వమని అర్థము. త్రిగుణములు మహేశ్వరి తత్త్వము నుండే పుట్టుచున్నవి. ఓంకారము దాని ప్రథమ రూపము. గుణములు దాని శక్తులు. ఓంకార మందలి అకారము సత్త్వగుణముగ ఆ తత్త్వమే దిగివచ్చును. "అకార మెరిగినవారే నన్నెరిగిన వారు." అని శ్రీకృష్ణుడు బోధించెను. అకారము అక్షరములలో ప్రథమమైనది. అమ్మ అను పదము అకారము నుండియే పుట్టినది. అది తెనుఁగు భాష ప్రత్యేకత. అకారము నుండి ఓంకారము, ఓంకారము నుండి మహేశ్వరత్వము సోపానములుగ గ్రహించవలెను. మహేశ్వరీ దేవి గుణములకు కూడ అందనిది.

ఎవడు సత్యమగు బ్రహ్మచర్యముతో, మనశ్శుద్ధితో మహేశ్వర లింగమును పూజించునో అతడు మహేశ్వర అనుగ్రహమున

ఈశ్వరత్వమును పొందును. 24 తత్త్వములతో కూడిన సృష్టికి కాలమే ఈశ్వరుడు. అట్టి కాలమునకు కూడ ఈశ్వరుడు మహేశ్వరుడు. మహేశ్వరునే యోగేశ్వరుడని కూడ అందురు. ఈశ్వరునకు ఈశ్వరుడు మహేశ్వరుడు. యోగీశ్వరుల కీశ్వరుడు యోగేశ్వరుడు. ఇదియే పరమ పదము. శ్రీదేవి నిజస్థితి ఇది. కావున ఆమె మహేశ్వరి మరియు యోగేశ్వరి.

209. 'మహాదేవీ'

అనంతమగు వెలుగుతో కూడిన శరీరము కలది శ్రీదేవి అని అర్థము. అనంతముగ పూజింపదగిన వెలుగు శరీరము కలది శ్రీదేవి అని అర్థము.

శ్రీదేవి శరీర మనంతము. అనగా అంతము లేనిది. సృష్టియే ఆమె శరీరము. ఎన్ని సృష్టులు ఆమె నుండి జరుగుచున్నవో బ్రహ్మాదుల కైనను అంతు పట్టదు. కావున ఆమె శరీరము మొత్తము త్రిమూర్తులకు కూడ తెలియదని దేవీ పురాణము తెలుపుచున్నది. అట్టి శరీరము కలది కనుక ఆమె మహాదేవి. ఆమె వెలుగుకూడ అట్టిదియే కనుక మహాదేవి అని తెలియనగును. త్రిమూర్తులు సహితము ఆమె మొత్తము వెలుగును చూడజాలరు. ఇక దేవతల మాట ఏల? సర్వదేవతలకు ఆమె దేవి కనుక మహాదేవి.

ఆమె శరీరము కొలతలే తెలియలేము. అంతియే కాదు. ఆమెకు అంతము లేదు. అనగా స్థూలము, సూక్ష్మము, సూక్ష్మతరము, సూక్ష్మతమమూయై యుండును. అపారమగు ఆమె శరీరము ఎట్టి కొలతల చేతను కొలవబడనిది అని దేవీ పురాణము కీర్తించును. అట్టి మహత్వము కల దేవి మహతీదేవి లేక మహాదేవి. మహత్వ మనగా ప్రమాణముచే తెలియ దగనిది లేక పొంద దగనిది.

మహా అను పదమునకు ఆరాధన అని కూడ అర్థము కలదు.

ఆమె అనంతముగ పూజింపదగిన దేవి. రోహిణీదేవిని కూడ మహాదేవి అని పిలుతురు. సోమాత్మకుడైన మహాదేవుని భార్య రోహిణి, సృష్టి యందు అత్యంత సౌమ్యము, కోమలము, సుందరముగ రోహిణీ దేవి ప్రకాశించు చుండును. శ్రీకృష్ణుని శరీర సౌందర్యము, కోమ లత్వము ఋషులు కూడ వర్ణింపలేరైరి. దానికి కారణము అతడు మహాదేవి యగు రోహిణి నుండి దిగివచ్చుటయే. బ్రహ్మ నిష్ఠాగరిష్టులైన ఋషులు కూడ శ్రీకృష్ణుని జూచి మోహ పరవశులైరి. ఇది మహాదేవి రోహిణి మహత్తు. పున్నమి చంద్రుని కాంతికే జీవులు పరవశు లగుదురు. అట్టి చంద్రుని కోమలత, సౌమ్యత, సుందరతల కన్న ఎనిమిది రెట్లు ఎక్కువైనది రోహిణి అని వాయు పురాణము తెలుపుచున్నది.

ఇట్టి మహాదేవిని అనంతముగ పూజించుచునే యుండవలెను.

210. 'మహాలక్ష్మి'

శ్రీదేవి వైభవము అని అర్థము. శ్రీదేవి శక్తి స్వరూపిణిగ పార్వతిగను, వైభవరూపిణిగ లక్ష్మిగను, విద్యారూపిణిగ సరస్వతిగను ఆరాధింపబడుచున్నది. సృష్టి వైభవమే శ్రీమహాలక్ష్మి. మహాలుడను రాక్షసుని చంపినందున ఆమె మహాలస, మహాలక్ష్మి అని ప్రసిద్ధి చెందినది. ఆమె అత్యంత సౌందర్యవతి. సర్వమనోహరి కూడ. ఎప్పుడునూ పదమూడు సంవత్సరముల వయస్సుగల కన్యగ ఆమె గోచరించును. భూమిపైన మహాలక్ష్మి పడమటి సముద్ర తీరమున సహ్యాద్రి కొండచరియలలో వసించుచున్నదని పురాణములు తెలుపు చున్నవి. కరవీర పురమున కూడ వసించు చున్నదని పురాణములు తెలుపుచున్నవి. ప్రస్తుతమున ఈ కరవీరపురమును కోల్హాపూర్ అని పిలుచుచున్నారు.

లక్ష్మి అను పదమునకు సంకేతమని అర్థము కలదు. రూపము లన్నియూ సంకేతములే. ఇది ఉప్పు అని, ఇది పప్పు అని రూపమును బట్టే జీవులు గుర్తించు చుందురు. అట్లే ఇతడు ఇంద్రుడని, ఇతడు విష్ణువని రూపములనుబట్టే తెలియబడు చున్నది. కోటానుకోట్ల రూపములుగ సృష్టి వున్నప్పటికిని అందరి జీవులను, లోకములను గుర్తించుటకు రూపమే ఆధారము. రూపములన్నియూ గుణములను పట్టి ఏర్పడుచున్నవి. గుణములన్నియూ త్రిగుణముల నుండి పుట్టినవే.

త్రిగుణములు శ్రీమాత యందు పుట్టినవి. మహాలక్ష్మి యనగా శ్రీమాత రూప సంపద. నీరును నీరుగా గుర్తించుటకు, అట్లే అగ్ని, వాయువు, ఆకాశములను గుర్తించుటకు, లోకములను, అందలి జీవులను గుర్తించుటకు ఆవశ్యకత ఎంతయూ కలదు. పులిని – పిల్లిని, కుక్కను – నక్కనూ భేద మెరిగి జీవించుటలో సదుపాయమున్నది.

రూపమును బట్టి గుణమును కూడ అంచనా వేయవచ్చును. పులిని – పిల్లిని అట్లే అంచనా వేయుచున్నాము. మానవుల యందు కూడ వివిధ స్వభావములను (గుణములు) బట్టియే వారి రూపము లేర్పడుచున్నవి. వికృత రూపములు వికృత గుణములను సంకేతించు చుండును. రామ లక్ష్మణులను జూచిన హనుమంతుడు వెంటనే వారిని దివ్యపురుషులుగా గుర్తించెను. హనుమంతుని చూచిన శ్రీరాముడు అతనిని వెంటనే వేదవిదుడని గుర్తించెను. అట్లే విభీషణుని జూచిన హనుమంతుడు అతనిని సత్పురుషునిగ గుర్తించెను.

సృష్టి యందు లక్ష్మీరూపములు, అలక్ష్మీ రూపములు కలవు. వానిని తెలియుటకే సాముద్రిక శాస్త్రము. అలక్ష్మీ రూపముల యందు రజస్తమస్సులు అధికమై యుండును. లక్ష్మీప్రద రూపములందు సత్త్వగుణ మబ్బును. సత్వగుణ మధిక మగుచున్నకొలదీ ఆరాధించు వారి రూపము కూడ తదనుగుణమైన అందము, ఆకర్షణము కలిగి యుండును. కోతి రూపమున నుండిననూ హనుమంతుడు అందము గనే గోచరించును కదా! అట్లే గజముఖుడగు గణేశుడు. అట్లే ప్రమథ గణములు కూడ. ఇవి విశిష్టమగు లక్ష్మీ రూపములు.

211. 'మృడప్రియా'

మృడునకు ప్రియురాలు శ్రీమాత అని అర్థము.

మృడు డనగా శివుడు, పరమ శివుడు. మట్టి యందు కూడ నుండువాడు గనుక మృడు డనిరి. మృడ మనగా మట్టి. మట్టి, బంగారము అను భేదము మానవ మస్తిష్కమునకే గాని, సృష్టియందు మరెక్కడనూ లేదు. శివునకు మట్టియు బంగారము ఒక్కటియే. శివతత్త్వ మెరిగినవారికి కూడ నంతియే. శివతత్త్వము పరిపూర్ణముగ నెరిగినది శ్రీమాతయే. మట్టియందుండుటకు శివు డంగీకరించినపుడు మట్టిగ శ్రీమాత రూపము దాల్చినది. అందులకే శివునికి ప్రియురాలు. పరమ పవిత్రమగు దివ్య చైతన్యము నుండి మట్టి వఱకు కూడ రూపు దాల్చగలదు. "సమానత్వము, సమానత్వము" అనుచూ కేకలు పెట్టువారికి శివా శివుల సమానత్వము ఏమి తెలియగలదు?

అనాదిగ మట్టితో లింగముచేసి ఆరాధించుట వాడుకలో గలదు. స్ఫటిక లింగమని, రసలింగమని, నర్మద బాణమని, చిత్త భ్రమలు కలవారికి శివాశివు లందరు. పురాణ కథలలో ఏ దేవత ఆరాధన అయిననూ మట్టితోగాని, రాగితోగాని, వెండితోగాని, బంగారముతోగాని ప్రతిమను చేయుడని తెలుపబడినది. మట్టికే ప్రాధాన్యత. మట్టియందు కూడ మాత వున్నదని చూసిన వెంటనే గోచరించినపుడు శ్రీమాత అనుగ్రహము కలదని తెలియవలెను.

భౌతిక లోకమున దేహములన్నియూ మట్టితోనే చేయబడినవి. గోలోకము నుండి అవరోహణ క్రమములో భూలోకము ఎనిమిదవది. మట్టితో కూడిన దేహము నందున్న జీవులు ఎనిమిది లోకముల సుఖములను అనుభవించుటకు అవకాశము కలిగి యుందురు. దివ్యలోక వాసులగు దేవతలు కూడ పరిపూర్ణ సుఖానుభూతికి అపుడపుడు భౌతిక దేహమును దాల్చుదురని పురాణములు తెలుపు చున్నవి. ఉదాహరణకు మామిడిపండు భుజించవలెనన్నచో భౌతిక దేహము లేనివాడు భుజింపగలడా? ఇట్టి పరిపూర్ణ సుఖము నందించు టకే శ్రీమాత మట్టి రూపమును కూడ ప్రియముతో దాల్చును. ఆమె మృడప్రియ.

212. 'మహారూపా'

గొప్ప రూపము కలది, శ్రేష్ఠమైన రూపము గలది అని అర్థము.

శ్రీమాత పరతత్త్వమునకు ప్రథమ రూపము. అవ్యక్తమగు పరతత్త్వము రూపముగొనుట మూలప్రకృతి మూలముననే. అవ్యక్తము వ్యక్తమగుట శ్రీమాత కార్యమే కనుక ఆమెదే ప్రధాన రూపము. ఆమె కారణముగనే ప్రధాన పురుషుడేర్పడును. ఏ లోకమునందు గల రూపమైనను ఆమె కారణముగనే ఏర్పడుచున్నది. ఆమె విశ్వరూప.

సృష్టియందు ప్రధానముగ వ్యక్తమగునవి కాలము, ప్రకృతి. ఈ రెండునూ పరతత్త్వము నుండి వ్యక్తమగును. కాలమునకు రూపము లేదు, ప్రకృతికే రూపము కలదు. కావున ఆమెను మహారూప అని సంబోధింతురు. కాలమును మహాకాలుడని సంబోధింతురు.

213. 'మహాపూజ్యా'

విస్తారముగ పూజింపబడునది కనుక మహాపూజ్యా అను నామము కలిగినది. బ్రహ్మ, విష్ణువు, శివుడు, కుబేరుడు, విశ్వేదేవతలు, వాయువు, వసువు, వరుణుడు, అగ్ని, ఇంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, గ్రహములు, రాక్షసులు, పిశాచములు సైతము శ్రీమాతను నిత్యము పూజింతురు. శ్రీమాత అనుగ్రహముననే లోకపాలకులు శక్తిమంతులై వారి వారి కార్యములను చక్కబెట్టుచున్నారు. సృష్టి చైతన్యము ఆమెయే గనుక ఆమెను పూజించుట వలననే ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు వృద్ధి చెందగలవు. పూజించదగిన పూజ్యులందరూ కూడ శ్రీమాతను పూజింతురు గనుక ఆమె మహా పూజ్య.

శ్రీమాతను యంత్ర రూపమున, శిలా రూపమున, ఇంద్రనీల రూపమున, బంగారు రూపమున, వెండి రూపమున, ఇత్తడి రూపమున, కంచు రూపమున, లోహ రూపమున, సీసము రూపమున, స్ఫటిక రూపమున, మాణిక్య రూపమున, వజ్ర రూపమున, వైడూర్య రూపమున నేర్పరుచుకొని పూజించదగునని దేవీ భాగవతము తెలుపుచున్నది. ప్రతిమ ఏ పదార్థముతో చేయబడిన దైనను భక్తి ప్రధానమని తెలియవలెను. భక్తికే ఆమె వశ మగునని ముందు నామములలో తెలుపబడినది కదా!

214. 'మహాపాతకనాశినీ'

మహా పాతకములను కూడ నాశనము చేయునది శ్రీమాత అని అర్థము.

పాపములు తెలియక చేయుట యుండును. తెలిసి చేయుట కూడ నుండును. తెలియక చేయుట అజ్ఞానము వలన. తెలిసి చేయుట బలహీనత వలన. అట్టి భక్తులను రక్షించుటయే తన పనిగ పెట్టు కొన్నది శ్రీదేవి. సమస్త పాపములకు ప్రాయశ్చిత్తము పరాశక్తి పాద ధ్యానమే యని బ్రహ్మాండ పురాణము బోధించుచున్నది. భక్తితో ఆరాధించు బలహీనులను, అజ్ఞానులను శ్రీమాతయే ఉద్ధరించు కొనును. సామ దాన భేద దండోపాయములతో అసురులను సైతము ఉద్ధరించునది శ్రీమాత. ఆమె స్మరణము సర్వపాప హరణము.

లలితా స్వరూపుడైన శ్రీకృష్ణ దేవుడు కూడ భగవద్గీతయందిట్లు పలికినాడు. "ఎంత దురాచరుడైనప్పటికి నా భక్తుడు నశింపడు." కలియుగ వాసులకు ఈ వాక్యమే పట్టుకొమ్మ. కొండంత పాపమును నశింపజేయు దైవమే జీవులకు ఆధారము. దైవము యొక్క కరుణయే దీనికి కారణము.

215. 'మహామాయా'

దాటరాని మాయా స్వరూపము కలది శ్రీమాత అని అర్థము.

బ్రహ్మలు సైతము శ్రీమాత మాయ వలన మోహము చెందుదురు. దేవి యొక్క మాయ జ్ఞానులను సైతము బలాత్కారముగ ఆకర్షించి మోహమున ముంచగలదు. ఎట్టివారినైనను తన మాయచేత మోహము కలిగించి కలత పెట్టగలదు. పురాణములందు ఇట్టి కథ లెన్నియో కలవు. నారదాది దేవర్షులుసైతము దేవి మాయకు లోనైరి.

మాయ లేనిదే సృష్టియే లేదు. నిరాకార నిరంజన తత్త్వము వెలుగుగ మారుటయే మొదటి మాయ. అటుపై నేర్పడు లోకము లన్నియూ మాయవలననే. ప్రతి మానవుడు తానున్నానని భావించుట మాయ వలననే. నిజమునకు తానొకడు వ్యక్తిగ లేడు. వున్నానను కొనియే సమస్త కార్యములు చేయుచుండును. లోకపాలకులు కూడ అట్లే చేయుచున్నారు. ఇది యొక అద్భుతమగు విషయము. ఒకే తత్త్వము రూపాంతరములు చెందుచూ, గుణములను సంతరించు కొనుచూ అనేకానేకములుగ ఏర్పడుచున్నది. లేనిది వున్నట్లుగ, వున్నది లేనట్లుగ గోచరించుటకు మూల కారణము మాయయే.

మాయను దాటు ప్రయత్నము మానుకొని శ్రీమాతను ఆశ్రయించుట మేలు. ఈ మాయనే లీల అని కూడ పిలుతురు. సమస్తము దైవలీలగ గుర్తించువారు ధన్యులు. ఋషులు సహితము

అకస్మాత్తుగ జరుగు అనూహ్యామగు సంఘటనలను దైవీ లీలగ భావింతురు. ఈ భావన కలవారికి పరాభవము, అవమానము అను భావన లుండవు. దైవీ లీలలను జ్ఞప్తి యందుంచుకొని అణగి మణగి జీవించుచు ఆనందింతురు. ఎట్టి వారికైనను ఈ స్థితి తప్పదు. అదియే మహామాయా మాహాత్మ్యము.

216. 'మహాసత్త్వా'

మహత్తరమైన సత్వము గలది శ్రీమాత అని అర్థము. సత్త్వ మనగా ఉనికి, వుండుట. సృష్టి స్థితిగొని వుండుటకు మూలకారణము శ్రీమాతయే. ఆమె సంకల్పించినచో మొత్తము సృష్టి తిరోధానము చెందగలదు. పురోగమనము కూడ చెందగలదు. స్థితియందుండ గలదు. సమస్త సృష్టిని తన యందు లయము చేసుకొని తానే కేవలముగ నుండగలదు. అట్టి ఉనికి మహాసత్త్వము. పరాప్రకృతిగ పరమ పురుషునియందు స్థితిగొని యుండుట, సంకల్ప మాత్రమున సృష్టి నిర్మాణము గావించి బ్రహ్మ నుండి చీమ వఱకు అన్నిటి యందు ఉనికిగ నుండుట కూడ చేయును. ఆమె మన యందు వుండుట వలననే మనము వున్నామని భావించుచున్నాము. ఆమె లేని మనము లేము– మనము లేని ఆమె యున్నది. మన మున్నామని మనకు భ్రాంతి ఆమె మాయ నుండే కలుగుచున్నది. నిజమున కున్నది ఆమెయే. అల యందున్నది సముద్రమే కదా! సముద్రము లేక అల లేదు. కాని అలలేని సముద్ర ముండగలదు. అందుకని ఆమెయే మహాసత్త్వ.

మన ఉనికి రహస్యము మనకు తెలియుటయే నిజమగు జ్ఞానము. శ్రీమాతయే దీని ననుగ్రహించ గలదు. ఆమెను తెలిసినవాడే తెలిసినవాడు. ఆమె అనుగ్రహ పాత్రులగుటకు సాధకులు త్రిగుణము

లలో ప్రధానమైన సత్త్వగుణమున నిలువవలెను. శ్రీమాత సత్త్వ గుణమునకు కూడ అతీతమైనప్పటికిని ఆమెను చేరుమార్గము సత్త్వగుణమే. సత్త్వగుణము నిర్మలమగు నీరు వంటిది. రజస్తమో గుణములు కలతవారిన నీరు వంటివి; బురద నీరు వంటివి. సత్త్వగుణ లక్షణములు భగవద్గీతయందు 16వ అధ్యాయమున మొదటి మూడు శ్లోకములలో తెలుపబడినవి. వానిని శ్రీమాత ఆరాధనతో జోడించి అభ్యసించినచో సాధకుడు సత్సాధకుడు కాగలడు.

217. 'మహాశక్తి'

అమితమైన శక్తి గలది శ్రీదేవి అని అర్థము.

శ్రీదేవియే శక్తి. సృష్టియందేశక్తి యైనను ఆమె అంశయే. త్రిమూర్తుల శక్తి కూడ ఆమె శక్తియే. త్రిమూర్తుల వశముకాని సన్నివేశ మేర్పడినపుడు, ఆమె అవతరించుట జరుగును. దుర్గగా అవతరించి బలవంతులైన రాక్షసులను నిర్జించిన కథ లెన్నియో కలవు.

ఆమె శక్తి తిరుగులేనిది. ఒక ప్రదేశమున నున్న దీపము పరిసరముల కెట్లు వ్యాపించునో అట్లే శ్రీదేవి శక్తి సృష్టి అంతయూ వ్యాపించి యున్నది. శక్తిస్వరూపిణిగ శ్రీదేవి నారాధించినచో ఆరాధకునికి వలసిన శక్తి లభించును. శక్తిహీనులకు శ్రీదేవి ఆరాధనము ఒక చక్కని వరము. సత్త్వమార్గమున ఆరాధన సాగినచో సక్రమమగు శక్తి క్రమముగ ఆరాధకుని యందు ఉద్భవించగలదు. దేవీ పురాణమున గల భక్తుల కథలన్నియూ ఇట్టివే. ఎంత దుర్గమమైన, దుర్భేద్యమైన, దుర్లభమైన విషయములు కూడ శ్రీదేవి ఆరాధనమున భేదింపబడగలవు. ఓర్పు, సహనము, విశ్వాసములతో ఆరాధన సాగించుట ఉత్తమము.

218. 'మహారతిః'

అమితమైన రతి కలిగినది శ్రీమాత అని అర్థము.

మహేశ్వరుడు మహా యోగి. మహా తపస్వి. యోగులకు, తపస్వి జనులకు అతడే పరమగురువు. సృష్టియందు మొట్టమొదటగ తపస్సును ప్రారంభించినవా డతడే. సతతము పరతత్త్వమున లగ్నమై యున్న చేతస్కుడు మహాదేవుడు. అగ్ని శిఖవలె అతని చేతన మంతయూ ఊర్ధ్వమున కుండును. అతని చేతన సృష్టియందు ప్రసరింప చేయవలెనన్నచో ఊర్ధ్వమార్గమున నున్న చేతనను ఇతర దిక్కులకు ప్రసరింప చేయవలెను కదా! అట్టి సమర్థత సృష్టియం దెవ్వరికినీ లేదు. కాని శ్రీమాత కూడ తపస్వినియే యగుట చేత తన దీర్ఘకాల తపస్సు ద్వారా మహాదేవుని మెప్పించినది. మహాదేవుని సృష్టికామునిగ, మహాకామునిగ మరల్చినది. ఆమె కామేశ్వరియై మహాదేవునితో చేరి సర్వలోక సృష్టి నిర్మాణము గావించినది. ఆమెకు సహకరించుచు మట్టియందు కూడ నుండుటకు మహాదేవు డంగీకరించెను. ఎచ్చట శ్రీమాత యున్నదో, యుండునో అచ్చట శివుడు కూడ యుండును. ఎచ్చట శివుడుండునో అచ్చట శ్రీమాత కూడ యుండును. ఒకరు లేక ఒకరు వుండుట యను ప్రశ్నయే లేదు. పరమునందైనను పదార్థము నందైననూ ఇరువురునూ యుందురు. రతి అను పదమునకు ఇది పరాకాష్ఠ. అందులకే ఆమె మహారతి.

శ్రీదేవి తన భక్తుల యెడల కూడ అట్టి అనురక్తియే కలిగి యుండి వారిని వీడక రక్షించుచుండును. శ్రీదేవి భక్తులు కూడ ఆమె యందు కల ప్రీతిచే సృష్టియం దేవిషయమును పట్టించుకొనరు. ఇతర విషయములందు వారికి ప్రీతి యుండదు. సమస్తము నందును శ్రీమాత మాహాత్మ్యమును, వైభవమును దర్శించుచు ఆమెనే ఉపాసించుచూ అన్య చింతనలు లేక అభియుక్తులై యుందురు. వారికే మహారతి అను పదమునకు అర్థము తెలియును. రతి యనగా అనన్య మైన ఆసక్తియే గాని కేవలము పాశవిక కామము మాత్రమే కాదు.

219. 'మహాభోగా'

అనిర్వచనీయమైన, అమితమైన సుఖము, సౌకర్యము, భోగము, ధనము కలది శ్రీమాత అని అర్థము.

భోగమనగా మనస్సు, ఇంద్రియములు, శరీరము పొందు ఆనందము. వీనికి కావలసినది సుఖము, సౌఖ్యము. అందులకు వలసినది ధనము. పంచభూతములతో కూడిన సృష్టియందు పంచేంద్రియములద్వారా, శరీరముద్వారా సౌఖ్యమును పొందుట మానసిక కక్ష్యలో జీవుడు కోరు స్థితి. శరీరములేనిదే భోగము లేదు. శరీరమున్నను, ఇంద్రియములు లేనివారు భోగించలేరు. ఇంద్రియ స్పర్శయే భోగము. మంచి శబ్దము, చక్కని దృశ్యము, సువాసనలు, రుచికరమగు అన్నపానీయములు, శీతోష్ణస్పర్శ, ఇవి యింద్రియముల నుండి, పంచభూతములనుండి, పంచతన్మాత్రల నుండి లభించును. భోగములను దేహేంద్రియముల ద్వారా అనుభవించుటకు మనస్సుండ వలెను. మనో బుద్ధి కక్ష్యలోనికి దిగనిదే జీవునికీ భోగముండదు.

భోగమానందము కొఱకే. పిల్లలానందించుటకు తల్లిదండ్రులు రక రకములుగ ప్రయత్నించుదురు. అట్లే జీవులానందము కొఱకు శ్రీమాత సృష్టియందెన్నియో ఆకర్షణలు సృష్టించినది. జీవులు భోగించుచు ఆనందించు చుండగ తానునూ ఆనందించును. అందులకే ఆమె మహాభోగ. భోగము లేర్పరచుట, అనుభవించుటకు దేహాదుల

నేర్పరచుట, జీవులకు భోగానందము కలిగించుట, వారి రూపమున తాను కూడ భోగించుట చేయుచు నుండును.

భోగ జీవనమునకు శాస్త్రమునందెట్టి అభ్యంతరము తెలుపబడలేదు. ధర్మయుక్తమగు భోగము రాజయోగులు సహిత మనుభవింతురు. భోగము యోగమున కంతరాయము కాదు. యోగ భోగములు వైభవమే అని ఆచరించి చూపినవారు శ్రీకృష్ణుడు, జనకుడు ఆదిగా గల యోగులు. రోగమునకు దారితీయు భోగము, ధర్మ సమ్మతము గాని భోగము వర్జనీయములు. శ్రీమాత అందించు భోగము వైభవమునకే.

220. 'మహైశ్వర్యా'

ఈశ్వరత్వము, వైభవము కలది శ్రీమాత అని అర్థము.

ఆమె మహేశ్వరి. అతడు మహేశ్వరుడు. వారిపై స్వామిత్వము వహించు వారెవ్వరూ లేరు. వారే సమస్తమునకు స్వామిత్వము కలిగి యున్నారు. బ్రహ్మర్షులు, యోగీశ్వరులు, మహర్షులు, యోగులు, ఋషులు, జ్ఞానులు అట్టి ఈశ్వరత్వమునే వాంఛింతురు. అట్టివారికి కూడ శివ, శక్తులే స్వామిత్వము వహింతురు.

కేవలము ఈ శబ్దమే గాక మహత్తరమగు సంపద కలవారు శివా శివులు. వారి వైభవము, విభూతి ఇంత అని ఎవరూ తెలుపలేరు. శివుని విభూతికి సమానమైన సంపద సృష్టియందు లేదని పురాణములు తెలుపుచున్నవి. సామాన్యముగ విశిష్టమగు భోగు లుందురు, కాని వారు యోగుల కానవసరములేదు. అట్లే విశిష్ట మగు యోగు లుందురు, వారికి భోగవైభవ ముండక పోవచ్చును. యోగ భోగములు పరిపూర్ణముగ నున్నవారే ఐశ్వర్యవంతులు. అదియే పరిపూర్ణ ఆనందము నిచ్చును. అట్టి ఐశ్వర్యవంతులకు కూడ నాయకి శ్రీమాత. కావున ఆమె మహైశ్వర్య.

221. 'మహావీర్యా'

మహత్తరమగు వీర్యము కలది శ్రీలలిత అని అర్థము.

వీర్యమనగా తేజస్సు అని, సామర్థ్యమని, శుక్రమని అర్థము కలదు. సృష్టి నిర్మాణమునందు శ్రీమాత సామర్థ్యము తెలియును. ఊహింప నలవికాని విధముగ మహత్తరమగు సృష్టి గావించినది. కోటానుకోట్ల జీవులు, కోటానుకోట్ల అభిరుచులు, స్వభావములు, నడకలు ప్రకృతి వలె నెవరు ఊహించగలరు. ఏమైనను మేధస్సునకు సహితము అందని విషయము సృష్టి నిర్మాణము. శ్రీమాత సామర్థ్యము నకు ఆమె సృష్టి నిర్మాణమే తార్కాణము.

శ్రీమాత తేజస్సు కూడ అట్టిదే. ఆమె తేజస్సే సూర్య మండలమున, సవితృ మండలమున, ఆదిత్య మండలమున ప్రకాశించు చున్నది. ఆమె తేజస్సే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగ వెలుగుచు నున్నది. త్రిమూర్తుల యందు భాసించునది ఆమె తేజస్సే. అచేతన, సచేతన రూపము లన్నిటియందు ఆమె తేజస్సే ప్రకాశించు చున్నది.

అదే విధముగ శ్రీమాత సృజనాత్మక వీర్యము అన్ని జీవుల యందు భాసించి సృష్టిని పెంపొందించుచు నున్నది.

సామర్థ్యము, తేజస్సు, వీర్య సంపద, ఎచ్చోట కన్పడిననూ అది శ్రీమాత అస్థిత్వమే అని తెలియవలెను. అందులకే ఆమె మహావీర్య.

222. 'మహాబలా'

మహత్తరమగు బలము కలది శ్రీలలిత అని అర్థము.

బలమను పదమునకు చాల అర్థములు కలవు. గంధమందలి సువాసనలను బలమందురు. రసమును బలమందురు. రసమనగా రుచి. ఇంద్రియముల రుచి ఇంద్రియబలము. గ్రహణశక్తి, జ్ఞాపకశక్తి, సమయస్ఫూర్తి, బుద్ధిబలము, స్థిరత్వము, మనోబలము, ఆనందము, సంతోషము జీవుని బలము. ఇట్లు రసము అనేక రుచులద్వారా జీవునికి బలమిచ్చు చుండును. రుచి బలమైనది గనుకనే బలహీనులు వానికి లోబడుదురు. వానిని లోబరచుకొన్న జీవుడు బలవంతుడు. అతడే బలుడు.

బలమనగా రూపమని కూడ అర్థము కలదు. బలమగు రూపములు గలవారిని కూడ బలులందురు. బలరాముడు, భీముడు, ఘోటోత్కచుడు, కుంభకర్ణుడు బలమగు రూపములు కలవారు. రూప బలము కూడ బలమే. రూపమున అందము కూడ బలమే. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి వారిది రూపమున గల సౌందర్య బలము. అట్లే సీతాదేవి, ద్రౌపదీ దేవి కూడ.

బలమనగా జీవ బలమని కూడ అర్థము కలదు. ఎట్టి కష్ట నష్టములనైననూ నోర్చుచూ జీవించు జీవులుందురు. వారిది జీవ బలము. భరింపరాని కష్టనష్టములను కూడ భరించుట బలమే కదా!

ధర్మరాజు, నలుడు ఈ కోవకు చెందినవారు. వీరు జీవమునందు బలము కలవారు.

మహత్తరమైన సేనలు కలవారు కూడ బలవంతులే. అట్లే మహత్తరమగు సద్గుణములు కలవారు కూడ బలవంతులే.

రాక్షస రాజగు వైరోచనుడు దాన బలము కలిగి చక్రవర్తియై బలిచక్రవర్తిగ పేరు గాంచెను. నిజమునకు అతడు బలి అనియే తెలియబడును. గాని అతని నిజనామము కొందరికే తెలియును. దాన గుణమే బలముగ అతడు వ్యాప్తి చెంది భూమికి చక్రవర్తి అయ్యెను. బలి అని పేరు గాంచెను.

ఇట్లనేకానేక బలములు ఇన్ని విధములుగ ఇందరి యందు భాసించుటకు మూలకారణము శ్రీమాత బలమే. ఆమె మహాబల గావున బలమెచ్చట నున్ననూ, అది ఆమె అస్థిత్వమే అని తెలియ వలెను.

కాకియందు బలమున్నదని సామాన్యముగ మనము గ్రహించము. కాకులు చండుడను మహర్షి కుమారులు. వారు ఇరువది ఒక్కరు. వారు ప్రతిదినము బ్రాహ్మీకాలమున శ్రీదేవిని చిరకాలము పూజించిరి. ధ్యానించిరి. సమాధి స్థితిని పొందిరి. అపుడు శ్రీదేవి అనుగ్రహించి వారికి ప్రత్యక్షమైనది. ముక్తి నొసగినది. ఈ విధముగ వాయసములు, వారి సంతతి ముక్తజీవులైనారు. ఈ కారణముగనే ముక్తి నపేక్షించుచూ కాకులకు అన్నము పెట్టుట సంప్రదాయముగ వచ్చినది. ముక్తి నొసగు బలము కాకులయందు నిక్షిప్తము చేయుటలో శ్రీమాత బల మాహాత్మ్యము తెలియనగును.

223. 'మహాబుద్ధి'

ఏ బుద్ధి వలన అన్నియూ తెలియుచున్నవో ఆ బుద్ధి మహాబుద్ధి.

బుద్ధివలన సమస్తము అవగాహన అగుచున్నది. మంచి చెడు తెలియుచున్నది. జ్ఞానము కూడ బుద్ధివలననే ఏర్పడుచున్నది. బుద్ధి సహాయముననే జ్ఞాన సముపార్జనము, జయము, విజయము కలుగు చున్నవి. అంతర్లోకములు, బహిర్లోకములు కూడ బుద్ధి సహాయముననే సమన్వయింప బడుచున్నవి. చీమ, దోమ వంటి ప్రాణుల నుండి బ్రహ్మదేవుని వఱకు, బుద్ధి వలననే జీవనము సాగించుచున్నారు.

బుద్ధి లేనిదే సృష్టియే లేదు. ఏమి చేయవలెను? అను ప్రశ్నకు సమాధానము బుద్ధి వలననే తెలియును. ఎట్లు చేయవలెను? అను ప్రశ్నకు కూడ సమాధానము బుద్ధినుండే వచ్చును. అన్ని లోకములను, అందరిని నడిపించుచున్న బుద్ధి మహాబుద్ధి. మహాబుద్ధియే అందరి యందు పాత్రానుసారము నిక్షిప్తము చేయబడి యున్నది. నదిలో ముంచిన పాత్రలలో నది నీరున్నట్లే జీవుల మెదడులో బుద్ధి ప్రకాశించుచు నుండును. విద్యుత్తు బల్బులో విద్యుత్తువలె బుద్ధి ప్రకాశించు చుండును. పాత్రలోని నది నీరు, బల్బులోని విద్యుత్తు - పాత్రకు, బల్బునకు సంబంధించినవి కావు. బుద్ధి మనయందు పాత్రలో నదినీరు వలె, బల్బులో విద్యుత్తువలె, నిక్షిప్తము చేయబడి యున్నది. అదియే శ్రీదేవి సాన్నిధ్యము. ఆమె సాన్నిధ్యమును మనలో

పెంచుకొనుటకే గాయత్రీ మంత్రము. ఆమె మహా బుద్ధి. జీవుల యందు బుద్ధిగ, ఎఱుకగ, తెలివిగ ప్రకాశించుచుండును.

బుద్ధి వలన సమస్తము తెలియుచున్నది గాని బుద్ధి నందించిన బుద్ధిని తెలియలేము. బుద్ధి నందించిన బుద్ధి మహాబుద్ధి. దానివైపు బుద్ధిని మరల్చినచో తెలుసుకొనదగిన దేమియూ మిగులదు. అట్టి మహాబుద్ధియైన శ్రీదేవిని ఆరాధించువారు బుద్ధిమంతులు.

224. 'మహాసిద్ధి'

ఏడు సిద్ధులను అధిష్ఠించి యుండు ఎనిమిదవ సిద్ధియే శ్రీదేవి అని భావము.

షట్చక్రములను అధిష్ఠించి ఏడవదిగా సహస్రార మున్నది. సహస్రారమును కూడా అధిష్ఠించి అన్నిటి యందు సమానత్వమును చూపునది శ్రీమాత.

రస స్వరూపుడు భగవంతుడు తనయందు ప్రకాశించుట మొదటి సిద్ధి. ఇదియే భక్తిరసము. దేవాసుర తత్త్వములచే తిరస్కరింపబడ కుండుట రెండవ సిద్ధి. దేవాసురులు సృష్టి ప్రయోజనమునే కాపాడు చున్నారు. అసురులు స్థూలలోకమును రక్షించుదురు. కావున వారిని రక్షసులని కూడ అందురు. సురలు సూక్ష్మలోకములను నిర్వర్తింతురు. స్థూల సూక్ష్మలోకములలో ఆదరింపబడుట ఒక సిద్ధి. స్థూలమున ఆదరింపబడువారు సూక్ష్మమున అంతగ ఆదరింపబడరు. సూక్ష్మమున ఆదరింపబడువారు స్థూలమున అంతగ ఆదరింపబడరు. రెంటి యందు ఆదరింపబడుట ఒక సిద్ధి.

ఉత్తమత్వము, అధమత్వము అనెడి భావములకు లోబడక యుండుట, అధికులని, అధములని మనసు చేయు భావములకు లోబడకుండుట మూడవ సిద్ధి. ఈ భేదములు కొంతవఱకే సత్యములు. ఇట్టి వారికి తరతమ భేదము లుండవు. 'బ్రాహ్మణుడు, శూద్రుడు,

కుక్క, కుక్కమాంసము తినువాడు మొదలగు భావ భేదము లేనివాడు పండితుడు' అని కృష్ణుడు గీత యందు ప్రకటించుటలోని అంతరార్థ మిదియే.

అట్లే సుఖ దుఃఖముల యందు సమాన భావము కలిగి యుండుట నాలుగవ సిద్ధి. హరిశ్చంద్రాదులు ఈ కోవలోనికి చెందినవారే. కాంతి బలముల ఆధిక్యము పంచమ సిద్ధి. కాంతి బలముల యందు కూడ భేదము లున్నవి. శక్తి, జ్ఞానము, క్రియా శీలతల యందు భేదములు గోచరించవు. ఇవి అన్నియూ అమ్మ శక్తిలోని స్థితి భేదములే. శక్తివంతులకు, ఆత్మవంతులకు పరిణామమున భేదమున్నది. శక్తివంతుని శక్తి ప్రకటితము. ఆత్మవంతుని శక్తి అప్రకటితము. కాలమును, దేశమును, కర్తవ్యమునుబట్టి ఆత్మవంతుల నుండి శక్తి ప్రకటిత మగుచుండును. శక్తివంతుల శక్తి వారి నధిష్ఠించి యుండును. అవసరమగుచో ఆయుధము ప్రకటితమగుట, అవసర మగుచో జ్ఞానము, క్రియ ప్రకటింపబడుట ఆత్మవంతుల యందు కానవచ్చును. ఆత్మవంతుల యందు శక్తి యిమిడి యుండును. వారు శక్తికి లోబడి యుండరు. శక్తివంతులు శక్తికి లోబడి యుందురు. ఇట్టి వారికే భేద భావ మెక్కువగ నుండును. శక్తివంతుడగు రావణునకు రాముని యందు చులకన భావము కలదు. ఆత్మవంతుడగు రాము నకు అట్టి భావము లేదు. అతనికి గుహుడు, జటాయువు, సుగ్రీవుడు, వానరులు, శబరి, రావణుడు వంటి వారందరూ ఆత్మలే. వారి ప్రవర్తనను బట్టి వారితో ప్రతిస్పందించెను. శబరికి వాత్సల్యమూర్తివలె

గోచరించు రాముడు, రావణునికి ప్రళయకాల రుద్రునివలె గోచరించెను. మిత్రునివలె సుగ్రీవునకు గోచరించు రాముడు, దేవుని వలె హనుమంతునికి గోచరించెను. ఈ పంచమ సిద్ధి కలవారు ఎవరెట్లు చూచిన అట్లు గోచరింపబడుదురు. వెఱ్ఱి గొల్లలతో గొల్లవాని వలె నున్న శ్రీకృష్ణుడు మహాజ్ఞానులగు భీష్మాదులకు విశ్వరూపియై గోచరించును.

పరమాత్మతో నిత్యానుసంధానము కలిగియుండుట ఆరవ సిద్ధి. అనన్య చింతన, పర్యుపాసన, నిత్య అభియుక్తత అనుచు ఈ సిద్ధినే శ్రీకృష్ణుడు తొమ్మిదవ అధ్యాయమున తెలిపినాడు. వీరందరును ఋషి గణములవంటి వారు. ఋషులు ఎప్పుడునూ దైవాను సంధానులై యుందురు. దైవ ప్రణాళికను నిర్వర్తించుచు నుందురు. వారి చర్య లన్నియునూ దివ్య ప్రణాళికలోని భాగమే.

దైవేచ్ఛానుసారము ఆకాశ సంచారము చేయుట ఏడవ సిద్ధి. నారదుడు, తుంబురుడు, హనుమంతుడు, గరుత్మంతుడు యిట్టి విహారము చేయు సిద్ధులు.

అంతట అన్నిట సమాన ప్రేమభావము ఎనిమిదవ సిద్ధి. ఇదియే మహాసిద్ధి. శ్రీమాత అట్టిది. బ్రహ్మర్షుల నుండి మూర్ఖులు, దుష్టుల వరకు అందరియందు చూపునది ప్రేమతత్త్వమే. ఉద్ధరించు భావమే. ఇదియే మహాసిద్ధి.

225. 'మహాయోగేశ్వరేశ్వరీ'

యోగీశ్వరులకు కూడ ఈశ్వరత్వము వహించునది శ్రీమాత అని అర్థము. యోగులకు యోగియైన వానిని యోగీశ్వరు డందురు. యోగీశ్వరునకు కూడ ఈశ్వరి శ్రీమాత. శ్రీమాత, శ్రీకృష్ణుడు యోగీశ్వరి, యోగేశ్వరులు. యోగేశ్వరుడనగా యోగీశ్వరులకు ఈశ్వరుడు. దీని సోపానక్రమము ఈ విధముగ నున్నది.

యోగీ → యోగీశ్వరుడు → యోగీశ్వరేశ్వరుడు లేక యోగేశ్వరుడు.

శివుడు యోగేశ్వరులలో మొదటివాడు. సృష్టి ఆరంభముననే కర్తవ్యము పూర్తి గావించి తపస్సున స్థిరబడినవాడు. ఆది గురువు. అతనిని గూర్చి తపస్సు చేసి శ్రీమాత అతనిని చేరినది. వారిరువురును యోగేశ్వరీ యోగీశ్వరులు. వారి అవతరణమే శ్రీకృష్ణుడు. ఇది ఉత్తమోత్తమ చైతన్య స్థితి. అటుపైన అంతయూ పరమే.

226, 227, 228.

'మహాతంత్రా మహామంత్రా మహాయంత్రా'

సర్వతంత్రములకు, సర్వమంత్రములకు, సర్వయంత్రములకు మూలము శ్రీమాత అని అర్థము.

దేవీ తంత్రము, మంత్రము, యంత్రము కన్న మించిన యంత్రాదులు గాని, తంత్రాదులుగాని లేవు. మంత్రము లన్నియూ బీజాక్షర శబ్దముల కూర్పు. యంత్రములన్నియూ మంత్ర శక్తిని అవతరింప జేయుటకు వలసిన సాధనములు. తంత్రము లన్నియూ విధానములు. శాస్త్ర విధానముగ శబ్దములను ఉచ్చరించుచూ, యంత్రముల లోనికి ఆహ్వానించుచూ చేయు పూజా విధానము తంత్రము. శ్రీదేవి చైతన్యము శబ్ద రూపముగను, వర్ణ రూపముగను ప్రకటింపబడుచు రకరకములగు శక్తులను అవతరింపజేయును. యంత్రములోనికి వాని నాహ్వానము చేయుట వలన యంత్రములు శక్తివంతములై పరిసరములను ప్రభావితము చేయును. శాస్త్రోక్తమగు ఈ విధానమును తెనుగున తంతు అందురు. తంత్రము యొక్క వికృత పదమే తంతు. తంత్ర విధానమునకు నిష్ఠ, నియమము చాల ప్రధానము. తంత్ర విధానమున యంత్రములను పూజించు నపుడు తత్సంబంధిత చైతన్యము యంత్రమున ఆవరించును. అందువలన యంత్రములను పవిత్రముగ భావించవలెను. అవి దైవీ

స్వరూపములు. వానిని శుచియైన ప్రదేశమున నుంచుకొనుట, శుచిగ పూజ చేయుట, ఉపచారములు చేయుట, నైవేద్యములు పెట్టుట శాస్త్ర విధానముగ జరుగవలెను. అట్లు నిర్వర్తించిననే వాని ప్రభావము ఆశీర్వచనముగ అందును. యంత్రములను గృహములందు ఉంచు కొనుటకు చాల నిష్ఠ, నియమము లవసరము. నిత్యపూజ, నైవేద్యము కనీస నియమము. శుచి, శుభ్రత అత్యంత ప్రధానము. శాస్త్రోక్తముగ చెయ్యనిచో యంత్ర పూజలు వికటింప గలవు. ఉచ్చారణ, ఉపచారము విధి విధానముగ జరుపవలెను.

భగవద్గీత యందు శ్రీకృష్ణుడు శాస్త్ర విధానమే ప్రమాణమని తెలిపినాడు. ఈ విషయమున నిర్లక్ష్యము రజస్తమో గుణములను ప్రకోపింపజేసి, దుష్ఫలితములను దుఃఖములను కలిగింపగలవు. ఇది పెద్దల నాహ్వానించి అగౌరవించుట వంటిది. దైవీశక్తులు, మూర్తులు పెద్దలకన్న పెద్దవారగుటచే వారిని శ్రద్ధాభక్తులచే సంతుష్టులను గావించుకొనవలెను గాని అహంకార పూరితులై గొప్పలకు చేయరాదు.

యంత్రములకు సరళ రూపములే విగ్రహములు. విగ్రహముల ఆరాధనకూడ నియమనిష్ఠలతో సాగవలెను. విగ్రహారాధన విషయమున నియమ నిష్ఠలు కూడ సరళమే. భక్తి శ్రద్ధలు మాత్రము సమానమే. క్రియాహీనము, మంత్రహీనము అయినను భక్తిహీనము కానిచో విగ్రహారాధన కొంత అనుకూలించగలదు. ప్రస్తుతకాలమున శిక్షణ పొందక, అర్హతలను అందుకొనక చేయు యంత్ర తంత్ర పూజలు

రజస్తమో గుణములనే పెంపొందింప జేయు చున్నవి. కలియుగమున మానవులు షోడశోపచార పూజ క్లుప్తముగ నిత్యము నిర్వర్తించినచో చాలునని శ్రీకృష్ణుడు ఉద్ధవున కుపదేశించెను.

శ్రీదేవి మంత్రము ముందు నామములలో తెలుపబడినది. ఆమే షోడశి. ఈ మంత్రమును స్వీకరించుటకు శిష్యున కర్హత యుండవలెను. గురువు సిద్ధుడై యుండవలెను. సర్వమంత్రములకు మూల మంత్రమది. అట్లే శ్రీ యంత్రము సర్వ యంత్రములకు మూలము. తంత్రము సర్వస్వతంత్ర తంత్రము. అనగా ఇతర తంత్రముల వలె మరే తంత్రముపై ఆధారపడినది కాదు. శ్రీవిద్యతో సాటియైన విద్య శ్రీచక్రముతో సాటియైన యంత్రము కలదని చెప్పు వాడు మూఢబుద్ధి యని తంత్ర శాస్త్రము పేర్కొనును. శ్రీదేవి సాటి లేనిది. ఆమెయే మహామంత్రా, మహాయంత్రా, మహాతంత్రా మరియు సర్వమంత్రాత్మికా, సర్వ యంత్రాత్మకా, సర్వ తంత్రాత్మికా.

229. 'మహాసనా'

శ్రీదేవియే మహాసన అని అర్థము.

మహాసనా అనగా అన్నిటి యందు ఆసనము వహించునది. అన్నిటి యందు వసించునది. ఆమె లేని సృష్టియే లేదు. సృష్టి లేనపుడు కూడ ఆమె బీజప్రాయముగ పరతత్త్వముతో కూడి యుండును. అన్ని లోకముల యందు ఆమెయే ఆసనము గొని యున్నది. అన్ని జీవుల యందు ఆమెయే చేతనముగ నున్నది. అచేతనములలో కూడ చేతనమై యున్నది. ఉప్పు ఉప్పగ నుండుటకు, పంచదార తీపిగ నుండుటకును, వేప చేదుగ నుండుటకు ఆమె చేతనమే ఆధారము. అట్లే సకల లోకముల యందలి సకల భావములకు, స్వభావములకు ఆమెయే ఆధారము. ఆమె ఆసనము గొనుట వలననే అహంకారాది అష్ట ప్రకృతులు సృష్టిలో వివిధములుగ ప్రవర్తించు చున్నవి. ఆమె సింహాసనాసీన, సర్వాసనాసీన. త్రిమూర్తులు, సప్త ఋషులు కూడ ఆమెయందే వసించి యున్నారు. వారి యందు కూడ ఆమెయే ఆసనము గొని యున్నది.

230. 'మహాయాగ క్రమారాధ్యా'

అరువది నాలుగు (64) యోగినీ పూజలతో కూడిన మహాయాగ క్రమము ననుసరించి ఆరాధింపబడునది శ్రీదేవి యని అర్థము.

అరువది నాలుగు (64) కళలు, 64 విద్యలు, 64 ముద్రలు కలవు. వీని వివరములు భాగవత పురాణమున దశమస్కంధమున శ్రీకృష్ణుడు నేర్చిన విద్యలుగ వివరింపబడినవి. ఈ విద్యలు నేర్చినవారు పూర్ణ పురుషులు. ఇట్టివారు లోకమున అరుదుగ అవతరింతురు. యోగులు ఈ విద్యలను నేర్చుటకు ఉత్సుకత చూపుదురు. ఈ విద్యల యందు సిద్ధి పొందినవారు శివ సమానులు. వీనిని గూర్చి తెలుసుకొన గోరువారు, ఈ మహా యాగమునకు ప్రతిపాదింపబడిన భావోపనిషత్తును పరిశీలించ గలరు. ఈ ఆరాధనమున శబ్దోచ్చార ణము, క్రమము, ముద్రలు, అత్యంత నియమ నిష్ఠలను పాటింప వలెనని తెలుపబడుచున్నది.

సృష్టియొక మహాయాగము, సృష్టియాగము క్రమము ననుస రించియే సాగును. సృష్టిక్రమము ననుసరించియే ఈ ఆరాధన ముండునని, ఆరాధనము పురోగతి చెందుచుండగ సృష్టి రహస్యము లన్నియు తెలియబడుననియూ తెలుపుదురు. ఈ యాగక్రమము, ఆరాధనా విధానము తెలిసినవారు అరుదు.

231. 'మహాభైరవ పూజితా'

భైరవుడనగా శివుడు. మహా భైరవునిచే పూజింపబడునది శ్రీదేవి అని అర్థము. మహాశివుడు మహాదేవిని పూజించునట. అట్లే మహాదేవి మహాశివుని పూజించునట. శివశక్తుల సమభావము ఇందు దర్శన మీయబడినది. శివుడు లేని శక్తి లేదు; శక్తి లేని శివుడు లేడు. పరమున కూడ వారిట్లే యుందురు. పరతత్త్వమున శివతత్త్వ మెంతున్నదో, శక్తి తత్త్వము కూడ నంతయే యుండును. అందువలన శివుడు పరుడు. శ్రీమాత పరదేవత. ఈ రెంటినీ సరిసమానముగ దర్శించుట సమదర్శనము. ఎక్కువ తక్కువలు జీవుల మనస్సు యందున్నవి తప్ప, వారిరువురిలో లేవు.

శ్రీమాత శ్రీదేవుని ఆరాధించిన సందర్భము లున్నవి. శ్రీదేవుడు శ్రీమాతని ఆరాధించిన సందర్భములు కూడ నున్నవి.

భైరవ శబ్దమునందలి మూడక్షరములు సృష్టి, రక్షణ, లయము ఇమిడి యున్నవి. 'భ' అనగా సృష్టి, 'ర' అనగా రక్షణ, రమణ, 'వ' అనగా వమనము లేక వినాశము. సృష్టి, స్థితి, లయములకు కారణము లైన దైవమే భైరవుడు. అతడు కాలము ననుసరించి మూడు విధములుగ వర్తించుటచే కాలభైరవుడని కూడ పిలువబడుచున్నాడు. అట్టి భైరవుడు మహాదేవుడు. అతనిచే పూజింపబడునది శ్రీదేవి.

ఆది దంపతులు ఒకరినొకరు మన్నించుట, గౌరవించుట

సరిసమానముగ భావించుట తెలియవలసిన విషయము. అట్లే స్త్రీ పురుషులలో ఒకరిపై నొకరు ఆధిపత్యము చూపక సమవర్తనము చూపుట ఉత్తమోత్తమ సంస్కారము. స్త్రీలపై ఆధిక్యము చూపు పురుషులు శ్రీదేవి అనుగ్రహమును పొందలేరు. అట్లే పురుషులపై ఆధిక్యము కోరు స్త్రీలు మహాదేవుని అనుగ్రహమును పొందలేరు. శివశక్తులలో ఒకరు అనుగ్రహింపనిచో మరియొకరు అనుగ్రహింపరు. కావున సమదర్శనము, సమభావనమే అనుగ్రహమునకు ప్రధానము.

232.
'మహేశ్వర మహాకల్ప మహాతాండవ సాక్షిణీ'

మహా కల్పమునందు మహేశ్వరుడు చేయు మహా తాండవము నకు సాక్షిణి శ్రీమాత అని అర్థము.

శివ నర్తనమే సృష్టి స్థితి లయ వర్తనము. శివ నర్తనము ఆగక సాగుచునే యుండును. సృష్టికి మూల కారణము శివ నర్తనము. స్థితికి, పోషణమునకు ఆధారము శివ నర్తనము. సృష్టి లయమగుటకు కూడ శివ నర్తనమే కారణము. లయమగు సృష్టి మరల సృష్టిగ నేర్పడు విరామ సమయము నందు కూడ శివ నర్తన మున్నది. అందులకే శివుని నర్తనము మహా నర్తనమైనది. త్రికాలములను మించి వర్తించు నర్తన మిది. నర్తించువాడు మహేశ్వరుడు. అతని నర్తనము మహా తాండవము. ప్రళయ కాలమున కూడ వుండునది ఈ నర్తనము. శ్రీమాత మహేశ్వరి అనగా ఆమె కూడ ప్రళయ కాలమున వుండునదియే. వీరిరువురును శాశ్వతులు. కావున ప్రళయ కాలమున శివుని తాండవమునకు ఆమె ఒక్కతియే సాక్షిణి. ఇక ఎవ్వరునూ ఆ నర్తనమునకు సాక్ష్యము లేరు. ఏకైక సాక్షిణి కావున ఈ నామము కలిగినది.

233. 'మహాకామేశమహిషీ'

మహా కామేశుని పట్టపురాణి శ్రీదేవి అని అర్థము.

సృష్టికి మూలకారణము కామమే. అనగా ఇచ్ఛ. కోటాను కోట్ల జీవుల యిచ్ఛయే కారణముగ సృష్టికి దైవము యిచ్ఛగించును. తత్ఫలితమే సృష్టి. దేవేచ్ఛ లేనిదే సృష్టి జరుగదు. అతడు సహజముగ కాముడు కాదు. ఇతరుల యిచ్ఛలను మన్నించుటయే పెద్దరికము. స్వంత యిచ్ఛ కలవారు పెద్దలు కారు. తమకుగ ఏ యిచ్ఛయు లేకున్నను ఇతరుల యిచ్ఛలను పరిపూర్తి గావించుచు వారిని కూడ పరిపూర్ణులను చేయుట పెద్దరికము. అట్టి యిచ్ఛ కామమున బడదు. అది కామమును మించిన యిచ్ఛ. అందువలన మహా కామము. అట్టి మహా కామము కలవాడు శివుడు. దానిని పరిపూర్తి గావించుటకు సహకరించునది శ్రీమాత. సంకల్పము శ్రీమాతదైనపుడు, సహకారము శివుని దగును. కావున మహాకాముని కామె పట్టమహిషి.

శివ సంకల్పమగు మహా కామమునకు స్వరూపము, స్వభావము ఆమెయే. సంకల్పము కూడ ఆమెయే. శివుని హృదయమున ఆమెదే అగ్రస్థానము కావున పట్టమహిషి.

234. 'మహాత్రిపురసుందరీ'

త్రిపురములు, వాని తాదాత్మ్యతా సౌందర్యము గల సుందరి.

త్రిపురములు సుందరములు. వాని తాదాత్మ్యత మహా సుందరములు. త్రిపురము లనగా మూడు పురములు. అవియే త్రిశక్తులు, త్రిగుణములు, త్రిమూర్తులు, త్రిలోకములు, త్రికాలములు. ఇట్లు త్రికోణముగ సృష్టి నిర్మాణము జరుగుచుండును. ఇందు ప్రజ్ఞ, శక్తి, పదార్థము వినియోగపడుచుండును. సృష్టి స్థితి లయము జరుగుచు నుండును. కర్త కర్మ క్రియ లేర్పడుచుండును. దేవతలు, దానవులు, మానవులు ఏర్పడుచుందురు. స్వర్గము, భూమి, నరకము ఏర్పడుచుండును.

ఇట్టి త్రిగుణాత్మకమగు సృష్టిని త్రిపురము లందురు. అందు పనిచేయు శక్తులు కూడ త్రిశక్తులే (ఇచ్ఛ, జ్ఞాన, క్రియాశక్తులు). తెలిసినవారికి త్రిపురములు అమితానందము కలిగించును. శ్రీదేవి సృష్టి నిర్మాణ చాతుర్యమును తాదాత్మ్యముతో అట్టివారు వర్ణించు చుందురు. నారద, తుంబురు లట్టివారే. శ్రీమాత ప్రజ్ఞగను, కొలత గను, కొలుచు శక్తిగను తానే త్రిపుటి యగును. తానే త్రిపుటియై సమస్త సృష్టి కార్యమును నైపుణ్యముతో నిర్మించుటయే కాక సౌందర్యముగ కూడ సృష్టించును. సృష్టి సౌందర్యము చూచుటకు సంస్కరింపబడిన కన్ను కలవాడై జీవు డుండవలెను. సృష్టియే ఇంత

సుందరముగ నున్నప్పుడు సృష్టికి మూలమైన ఆమె ఎంత సౌందర్యవతియై యుండవలెను? ఆమె సౌందర్యము నుపాసించువారికి కలుగునది తాదాత్మ్యతయే. ఆమె సుందరి, త్రిపురసుందరి, మహా త్రిపుర సుందరి.

సుందరత్వమును దైవముగ ఆరాధించుట సూటియైన మార్గముగ పెద్దలు తెలుపుదురు. కృష్ణుని సౌందర్యము నారాధించి సరాసరి కృష్ణుని చేరిన గోప గోపీజను లట్టివారు. శ్రీ లలిత భక్తులు కూడ అట్లే.

235. 'చతుష్షష్ట్యుపచారాఢ్యా'

అరువది నాలుగు ఉపచారములతో పూజింపబడునది శ్రీమాత అని అర్థము.

శ్రీవిద్యా ఉపాసకులు వారికి గల భక్తి విశేషముచే విస్తారమగు ఉపచారము చేయుచుందురు. షోడశి యగు శ్రీమాతను షోడశ ఉపచారములతో ఆరాధించుట పరిపాటి. ఇంకను వివరముగ ఆరాధించుటకు ఉపచారములు పేర్కొనబడినవి. 116 ఉపచారము లతో కూడిన ఆరాధనలు కూడ కలవు. 64 ఉపచారముల ఆరాధన తెలియగోరువారు 'పరివశ్యా రహస్యము' అను గ్రంథమునందు పరిశీలించవచ్చును లేదా శ్రీవిద్యాఉపాసకులను సంప్రదించవచ్చును.

అరువది నాలుగు సంఖ్యకు ప్రాధాన్య మున్నది. చంద్రుని పదహారు కళలు ఒక పక్షము. అట్టి రెండు పక్షము లొక మాసము. అట్టివి రెండు మాసము లొక ఋతువు. వెఱసి ఒక ఋతువున అరువది నాలుగు తిథులు లేక కళలు కలుగును. ఋతుకాల దీక్ష అరువది నాలుగు తిథులు సాగును. ఇందు నాలుగుమార్లు పదహారు తిథులు వర్తించును. రెండుమార్లు ఆరోహణము, అవరోహణము జరుగును. ఈ క్రమముల ననుసరించి ప్రతిపత్తి (పాడ్యమి) నుండి రాకాంత (పౌర్ణమి తిథి చివరి వరకు) వరకు శ్రీదేవి కళలను ఆరోహణ క్రమమున మూలాధారమునుండి సహస్రారమునకు అవరోహణ

క్రమమున సహస్రారము నుండి మూలాధారము వరకు దర్శింపనగును. ఈ క్రమమున అష్టమి కళ యోగసిద్ధిని ప్రదర్శించును. ఆరోహణ క్రమమున శ్రీమాత తత్త్వములోనికి ప్రవేశించి, అవరోహణ క్రమమున అమ్మ ప్రణాళిక నవతరింప చేయుట కూడ సిద్ధులు చేయుచుందురు.

ఒక ఋతువు సంవత్సరమున ఆరవ భాగము. ఆరు ఋతువులు పై విధమగు దీక్షతో ఆరాధన చేయువారికి షట్చక్రములు ప్రభావిత మగును. ఇట్లు కాల విభాగమును అనుసరించుచు తదనుగుణమగు ఉపచారములు చేయుచు ఆరాధనను చేయుట ఋషులందించిన మార్గము. డెబ్బది రెండు ఉపచారములతో కూడ ఇదే విధమగు ఆరాధనను కూడ ఋషు లందించిరి. అపుడు సంవత్సర చక్రము ఐదు భాగములుగ విభజింపబడును. సృష్టి అంతయు పంచీకరణము చెందియున్నదని పంక్తి (ఐదు) రహస్యము తెలిసిన వారికి సర్వము తెలియుననియు కూడ నున్నది. "పాంక్తంవా ఇదగ్ం సర్వం పాంక్తేనైవ పాంక్తగ్గ్ం స్పృణోతీతి" పంచమ వేదమగు మహా భారతము, అందు పంచ పాండవుల కథలలో ఈ రహస్యము యిమిడి యున్నది. ఇట్టి రహస్యము లన్నియూ భక్తితో, దీక్షతో ఆరాధన చేయువారికి అవగాహన మగునవియే కాని కేవలము మస్తిష్కము నుపయోగించి తెలుసుకొనజాలము.

236. 'చతుష్షష్టి కళామయీ'

శ్రీమాత తత్త్వము అరువది నాలుగు కళల మయమని అర్థము.

కళలనగా కాంతులు. శ్రీమాత కాంతులు అరువది నాలుగు. ఆమెకు జరుపు ఆరాధనము అరువది నాలుగు ఉపచారములతో కూడి యున్నది. ఈ ఉపచారములు నేర్చుటకు అరువది నాలుగు విద్యలున్నవి. అవి ఈ విధముగ నున్నవి.

1) అక్షరజ్ఞానము (ఇదియే అక్షరాభ్యాసముగ ప్రథమ విద్య, 2) చదువుట, 3) వ్రాయుట, 4) బహు భాషా జ్ఞానము, 5) పై భాషల యందు కవిత్వము చెప్పుట, 6) విన్నదానిని విన్నట్లు చెప్పుట, 7) జూదము, 8) వేదములు, 9) వేదాంగములు - ఆరు, 10) శాస్త్రములు, 11) శాస్త్రాంగములు, 12) తంత్రములు - 6, 13) పురాణములు, 14) స్మృతులు, 15) కావ్యములు, 16) అలంకారములు, 17) నాటకములు, 18) శాంతము, 19) వశ్యము, 20) ఆకర్షణము, 21) విద్వేషణము, 22) ఉచ్చాటనము, 23) మారణము - 6 విధములు 24) గతి స్తంభనము, 25) జల స్తంభనము, 26) వృష్టి స్తంభనము, 27) అగ్ని స్తంభనము, 28) ఆయుధ స్తంభనము, 29) భాషా స్తంభనము, 30) వీర్య స్తంభనము, 31) శిల్ప విద్య, 32) గజహయ శిక్షణము, 33) రథ శిక్షణము,

34) నర శిక్షణము, 35) సాముద్రికము, 36) మల్లయుద్ధము, 37) పాక శిక్షణము, 38) విష శాస్త్రము, 39) సుషిరము, 40) అనద్ధము, 41) ఘనము, 42) ఇంద్రజాలము, 43) నృత్యము, 44) గీతము, 45) రసవాదము, 46) రత్న పరీక్ష, 47) చౌర్యము, 48) ధాతు పరీక్ష, 49) అదృశ్యము మొత్తము అరువది నాలుగు.

ఈ విద్యలన్నియూ కలవాడు పూర్ణ పురుషుడే. శ్రీకృష్ణుడు అన్ని విద్యలను ప్రదర్శించి చూపెను. ధర్మరాజాదులు, భీష్మ ద్రోణాదులు, ఇతర మహావీరులు, యిందలి కొన్ని విద్యలే యెరిగి యున్నారు.

237. 'మహాచతుష్షష్టి కోటి యోగినీ గణసేవితా'

అరువది నాలుగు కోట్ల యోగినీ గణములచే సేవింపబడునది శ్రీలలితా దేవి అని అర్థము.

64 సంఖ్యను గూర్చి వివరించటమైనది. కోటి యోగినులు అనగా ఏడు లోకములు వ్యాపించియున్న ఆమె శక్తులు. ప్రధానముగ అమ్మ శక్తులు ఎనిమిది. అందువలననే అష్ట బాహువులు గల దుర్గగ ఆమెను భావింతురు. ప్రకృతి స్థానములు కూడ ఎనిమిదియే. అమ్మ శక్తులు దుర్గా, బ్రాహ్మీ, మహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, ఇంద్రాణీ, చాముండా. ఇట్టి ఎనిమిది యోగినీ శక్తులకు మరల ఎనిమిది ఉపశక్తులున్నవి. ఎనిమిది రెట్లు ఎనిమిది కనుక అరువది నాలుగు అయినవి. అనగా ఎనిమిది ప్రకృతి స్థానములలో ఒక్కొక్క దానిలో మరల స్థూల సూక్ష్మములుగ ఎనిమిది తత్త్వము లుండును. ఈ అరువది నాలుగు యోగినీ శక్తులకు కోట్ల సంఖ్యల గుంపులు లేక సేనలు కలవు. ఈ మొత్తము నన్నింటిని విశేషము చెప్పుటకు, చతుష్షష్టి అను పదమును మహా చతుష్షష్టి అని తెలుపుట జరిగినది. మహత్త్వ మనగా తొమ్మిదింతలని అర్థము. మహా చతుష్షష్టి కోటి యోగినీ గణములు ఇచ్చట గ్రహించవలెను. అనగా ఎనిమిది ముఖ్య శక్తులు, ఎనిమిది ప్రకృతి స్థానములలో అరువది నాలుగు కోట్లుగ ఆవరించి యుండగ అట్టి మొత్తము శక్తులు తొమ్మిదింతలై శ్రీ చక్రమందలి

నవావర్ణముల యందు ఆవరించి యున్నారని భావము. శ్రీ చక్రరాజము నందలి తొమ్మిదింటియందు ప్రత్యేకముగ అరువది నాలుగు కోట్ల యోగినీ శక్తులు కలవు అని తంత్రము తెలుపుచున్నది.

శ్రీ లలిత యోగశక్తి సర్వత్ర వ్యాపించి సర్వమును నిర్వర్తించు చున్నదని దీనివలన తెలియనగును.

238. 'మనువిద్యా'

మనువిద్యా స్వరూపిణి శ్రీదేవి అని అర్థము.

మనువుల యందు భాసించు విద్య శ్రీదేవియే. సర్వ విద్యలు ఆమె నుండియే భాసించును. ప్రత్యేకముగ మనువిద్యా స్వరూపిణి యనుటలో మనువు ప్రాధాన్యత తెలియనగును. మను తత్త్వము పదునాలుగు విధములుగ, పదునాలుగు మనువులుగ తెలియవలెను. పదునాలుగు మనువుల తత్త్వమే పదునాలుగు తిథులుగ తెలియ వలెను. పౌర్ణమి పూర్ణ స్థితి; అమావాస్య శూన్య స్థితి. ఈ రెంటి నడుమ పదునాలుగు తిథులున్నవి. పదునాలుగు తిథులకు, పదు నాలుగు మనువులకు, పదునాలుగు మన్వంతరములకు సామ్యము తెలియవలెను. శుక్ల, కృష్ణ పక్షములుగ ఆరోహణ, అవరోహణ క్రమము లున్నవి. ఈ తిథులకు వెలుగు నీడ లున్నవి. ఇందు అష్టమి తిథి ఒక ప్రశస్థమైన తిథి, ఈ తిథి యోగసిద్ధిని కలిగించ గలదు. ఈ తిథి యందు వెలుగు నీడలు సమభావము పొందును. ఈ తిథి అర్ధనారీశ్వర యోగ తత్త్వమును ప్రకటింపజేయును.

శ్రీదుర్గ, శ్రీకృష్ణుడు అష్టమి యందు పుట్టుటలోగల రహస్యార్థ మిదియే. వారియందు వెలుగు నీడలు సమభావము చెందును. జ్ఞానము, అజ్ఞానము, దేవతలు, అసురులు, ఉత్తమము, అథమము, మంచి, చెడు అన్నిటిని వారు తమయందు లయము చేసుకొనగలరు. అందరికిని తగు విధమగు ఉద్ధారణము కల్పింపగలరు.

కృష్ణ పక్షమున మొదటి ఏడు తిథులలో వెలుగు పెరుగుచు నుండును. అష్టమి నాటికి వెలుగు, నీడ సమ మగును. ఈ ఏడు తిథులును పౌర్ణమి తరువాతి ఏడు తిథులతో సామ్యము చెందును. ఈ సామ్యము విలోమానుసారము తెలియవచ్చును. అట్లే శుక్ల పక్షపు నవమి నుండి పౌర్ణమి వఱకు కల ఏడు తిథులు పౌర్ణమి నుండి తరువాత కలుగు ఏడు తిథులలో విలోమానుసారము సామ్యము చెందును. ఉదాహరణకు శుక్ల చతుర్దశి యందు ఎంత వెలుగు వుండునో కృష్ణ పాడ్యమి నందు అంతే వెలుగు వుండును. బుద్ధి మంతులు దీనిని గ్రహింపగలరు. ఇట్లు సామ్యమును గూర్చినచో ఏడు తిథులే పదునాలుగుగ గోచరించును. అందువలన నిజమునకు మనువు లేడుగురే. మిగిలిన వారిని సావర్ణి మనువు లందురు. వీని ననుసరించియే వారమునకు దినము లేడుగను, రెండు వారములొక పక్షముగను, రెండు పక్షములొక మాసముగను, నాలుగు పక్షములు ఒక ఋతువుగను, ఆరు పక్షము లొక సంవత్సర పాదముగను, 12 పక్షములు ఒక అయనముగను, 24 పక్షములు ఒక సంవత్సరముగను వర్తించు చున్నది.

మనువిద్యా రహస్యములు అత్యంత గంభీరములు. జీవుల అవతరణము, ఉద్ధారణము మన్వంతర కథలుగ వివరింపబడినవి. ఇది ఒక విస్తారమగు విద్య. ప్రతి మాసమునందు మనలను స్పృశించు మను స్పర్శను ప్రథమముగ పొందినచో మనువిద్యా ప్రాథమిక

విద్యాలయమున ప్రవేశము కలుగును. సుళువు కొఱకై ఈ క్రింది చక్రమును వివరించుకొనుడు.



239. 'చంద్రవిద్యా'

శ్రీదేవి చంద్రవిద్యా స్వరూపిణి అని అర్థము.

చంద్రుడనగా మనకు కనిపించు చందమామ మాత్రమే కాదు. ప్రతిబింబించు శక్తి. మొలకెత్తించు శక్తి. పదార్థమును జనింపజేసి రూపముల నేర్పరచు శక్తి. దీనిని ఊర్ధ్వలోకములలో సోమశక్తి అందురు. మరియు ఆకర్షణ శక్తి, సృజనాత్మక శక్తి కూడను.

సోమ మనగా ఉమతో కూడిన శివతత్త్వమని అర్థము (స + ఉమ). ఈ శక్తి లేనిదే ఏకమనేకమగుట జరుగదు. అనేక అద్దములున్న గదిలో నిలబడినపుడు ఒకరే అనేకులై అనంతముగ గోచరింతురు కదా! అట్లే శ్రీదేవి మహా చైతన్యము నుండి, ఆమె చంద్రశక్తి కారణముగ అనేక గ్రహగోళాదులు అనేకానేక కోట్ల జీవుల రూపము లేర్పడుచున్నవి. ఆమె మనస్సు నుండి పుట్టినది ఆమె చంద్రశక్తి. ఆ చంద్రశక్తి నుండి పుట్టినవి మనువుల మనస్సులు. ఈ కారణముగనే మన మనస్సులలో కూడ అసంఖ్యాకములైన భావములు పుట్టు చుండును. మనమా భావములకు రూపకల్పన చేయుచుందుము. చంద్రవిద్య బలముగ నున్నవారు భావములకు రూపమును అప్పటి కప్పుడేర్పరచగలరు. ఋషులట్టివారు. మంత్రించిన జలములనుండి స్మరించిన భావమును రూపు కట్టింపగలరు. ఊర్ధ్వలోక దర్శనమునకు, అంతర్దర్శనమునకు, బాహ్య దర్శనమునకు, అవగాహనకు కూడ మనస్సే ప్రధానము.

శ్రీమాత చంద్రవిద్యను పదహారు కళలుగ ఏర్పాటు చేసి యున్నది. ఈ పదహారు కళలు శూన్యముగ గోచరించు శివ తత్త్వము నుండి, పూర్ణముగ గోచరించు భౌతిక సృష్టి వరకు సృష్టి నిర్మాణమునకు శ్రీమాత ఉపయోగించు చంద్రవిద్య. చంద్రవిద్యతోనే సృష్టి పురోగ మనము, తిరోగమనము నిర్వర్తింపబడుచున్నది. పరిశీలించినచో మానవ జీవితమున కూడ బాహ్యములోనికి పురోగతి చెందుట, బాహ్యము నుండి తిరోగతి చెందుట చంద్రవిద్యపైనే ఆధారపడి యున్నవి. చంద్రబలము బాగుండిననే యోగసాధన సులభమగును.

శుక్ల పక్షమున చంద్ర కళలు పెరుగుచుండగ బాహ్యములోనికి పురోగమించుట, కృష్ణ పక్షమున చంద్రకళలు తరుగుచుండగ అంతర్లోకములలోనికి తిరోగమించుట యోగులు చేయుదురు. తిరోగమనమునకు శివుడు గమ్యము. పురోగమనమునకు అనుభూతి గమ్యము. తిరోగమన పురోగమనములకు శ్రీదేవి అనుగ్రహము గమ్యము.

చంద్రవిద్య అంతయూ చంద్రుని షోడశ కళలయందు యిమిడి యున్నది. షోడశీ మంత్రమును ఉపాసించువారు ఈ విద్యను గ్రహింపగలరు. మరియొక విషయమేమనగా ముందు తెలిపిన మనువిద్య, చంద్రవిద్య పరస్పర సంబంధితములు.

240. 'చంద్రమండల మధ్యగా'

చంద్రమండలము యొక్క మధ్యభాగమున స్థితి గొన్నది శ్రీదేవి అని అర్థము.

సహస్రార కమల కర్ణిక యందలి మధ్యభాగము చంద్ర మండలము. పదహారు కళలతో శ్రీదేవి అచ్చట శివాంకమున స్థితయై యుండును. అనగా ఇది శ్రీమాత సహజ సిద్ధమైన స్థానము. అటుపైన నుండునది శివుడే. ఆమె శివతత్త్వముతో కూడి సృష్టి నిర్మాణము చేయుచున్నది. ఆమె అధ్యక్షతనే మనువిద్య, చంద్రవిద్య, మహా చతుష్షష్టి యోగినీ గణములు, చతుష్షష్టి కళలతో సృష్టి నిర్మాణము గావించుచున్నారు.

శివ పురాణమునందు శ్రీదేవితో శివు డిట్లనును. "నేను అగ్ని శిరమును, నీవు చంద్రశిరము. అగ్ని సోమాత్మకమైన విశ్వము, మన వలన వృద్ధి చెందుచున్నది".

శివుడు ప్రాణము, అగ్ని స్వరూపుడై సూర్యుని ద్వారా ప్రాణశక్తి అందింపబడుచున్నది. జీవుడు ప్రధానముగ స్పందించు ప్రాణశక్తి. చంద్రుడు మనస్సు లేక చైతన్యము. అది సోమాత్మక ప్రజ్ఞ. చంద్ర మండలముల ద్వారా మనయందు తెలివివలె ప్రకాశించుచున్నది. ఇట్లొకరు ప్రాణముగను మరియొకరు తెలివిగను మనయందు పనిచేయు చున్నారు. ఒకరు ఆత్మగను మరియొకరు బుద్ధిగను

జీవుల యందున్నారు. బ్రహ్మాండము నుండి అణువు వరకు అన్నిటి యందు వీరు కేంద్రస్థానమున నున్నారు. కేంద్ర స్థానమే మధ్యభాగము. సృష్టి చంద్రమండల మగుటచే దానికి కేంద్రము శ్రీదేవియే. శ్రీదేవికి శివుడు, శివుడికి శ్రీదేవి పరస్పరమైన తత్త్వములు.

241. 'చారురూపా'

అందమైన రూపముకలది శ్రీదేవి అని అర్థము.

సృష్టి అందములు శ్రీమాత రూపమే. అందము ఆనందము కలిగించును. అందము ఆకర్షణ కలిగించును. ఆకర్షణము వలన మనస్సు అందముపై నిలచును. పరిపరి విధములుగ పోవు మనస్సు నకు స్థిరము కల్పించుటకు అందము ఒక ఉపాయముగ ఋషులు దర్శించినారు. అందము, ఆకర్షణ మనోహరమగు స్థితిని కలిగించును. మనస్సు హరింపబడుటయే మనోహరత్వము. మనస్సు హరింపబడి నపుడు బాహ్యప్రపంచ మదృశ్యమగును. అపుడా అందము రూపము లను దాటి రూపాతీతమైన వెలుగు నందు స్థిరపడును. వెలుగున స్థిరబడుట యనగా బుద్ధి యందు స్థిరపడుటయే. బుద్ధి యందు స్థిరపడ్డ చిత్తము దైవావరణ యందున్నట్లే. హిరణ్య ప్రాకారములో నున్నట్లే.

ఈ కారణముననే అందము నుపాసించువారు త్వరితగతిని మనోహర స్థితిని పొంది బుద్ధి లోకమున స్థిరపడినట్లుగ ఎన్నియో పురాణ గాథ లున్నవి. మొదటగ ఉపాధి (రూపము) యందు అందమును ఉపాసించువారు అందము ఆధారముగనే ఉపాధిని మన్నించు చున్నారు కదా! అందము అదృశ్యమైనచో ఉపాధిని అంతగ మన్నించరు కదా! అందమైన పువ్వు వాడినపుడు జరుగుచున్నదేమి? అందము ఉపాధిని వీడినది. ఆరాధింపబడుచున్నది అందము గనుక

వాడిన పువ్వును మన్నింపరు. అట్లే స్త్రీ పురుష రూపములు, ఇతర రూపములు.

ఉపాధి అందము కన్న లోతులలో గుణ సంపద అందముగ నుండును. సద్గుణ సంపదకు ఆకర్షింపబడుట కూడా అందమునకు ఆకర్షింపబడుటయే. పరిణామమున గుణ సంపద అందమును రుచి చూచిన వారు సద్గుణముల నారాధింతురు. బాహ్య రూపమందముగ నుండి గుణము లందముగ లేనిచో అట్టివారిని ప్రేమించలేము. అసురులు అమితమైన అందము కలవారు. కాని వారిని ప్రజలు ప్రేమించరు. పై అందము నుండి లో అందములోనికి చేరుట పరిణామ దశ.

గుణముల అందముకన్న వాని నధిష్ఠించియున్న జీవుని అందము కొన్ని వందల రెట్లు ఎక్కువ. పరిణామ క్రమమున గుణములను చూడక జీవులనే చూచువారు అందరినీ ప్రేమింతురు. జీవుడు సహజ సౌందర్యము కలవాడు. అతడు సహజముగ చతుర్భుజుడు. దివ్యరూపి. యోగు లందరియందు ఆ దివ్య రూపమునే దర్శించుటచే వారు అమితానందమును పొందుచు నుందురు. ఇట్లు అందమును ఆరాధించుట వలన రూపము, గుణము, జీవము, దైవము అను సోపానక్రమమున ఉపాసకుడు సిద్ధి పొందగలడు. శుక్ర విద్యయందీ రహస్యములు కలవు. మరణము దాటుటకు కూడ ఈ విద్య ఉపకరించును.

శ్రీమాత అన్ని స్థితుల యందు అందముగనే యుండును. ఆమె రూపము అందమైనది. గుణము అందమైనది. సాన్నిధ్యము మనోహరము. ఆమె కురుల నుండి పాదముల వరకు ఎంత అందమైనదో ముందు నామములలో తెలుపబడినది. ఆ రూపమును, ఆ అందమును తదేక దీక్షతో ఆరాధన చేసినచో పై తెలిపిన సోపానము లన్నియును శీఘ్రగతిని ఆరోహణము చేయవచ్చును.

శ్రీదేవి, శ్రీ మహా విష్ణువు, శ్రీ కృష్ణుడు ఇత్యాది రూపము లన్నియూ ఆరాధన చేయుట మన సంప్రదాయము. ఈ ఆరాధనమున మనోహరత్వము సులభముగ కలుగును. శాంతమైన ఆకారము, ప్రసన్నమైన వదనము, చిరుదరహాసము కల విగ్రహములనే ఆరాధనము చేయవలెను. అప్పుడు మనోవికారములు హరింపబడును.

242. 'చారుహాసా'

అందమైన హాసము కలది శ్రీదేవి. శ్రీమాత జగన్మోహిని. ఆమె అందము కొలతల కందనిది. ఆమె నవ్వు ఎట్టి మూర్ఖునైనను వశపరచుకొన గలదు. భస్మాసురుని నుండి సదాశివుని వరకు అందరును ఆమె మందస్మితమునకు లోబడువారే. ఆమె పరమశివునికే వశ్య. ఇతరములన్నియూ ఆమె వశములే.

హాసమనగా చిఱునవ్వు. వికటమగు నవ్వు హాసము కాదు. అది వికారము. పగలబడి నవ్వుట లోతగు జీవుల కుండదు. నవ్వకుండుట యుండదు. ప్రతి జీవుడు ఏదో ఒక సమయమున నవ్వుట జరుగును. కాని ఎప్పుడూ చిఱునవ్వుతో నుండుట అందరికినీ సాధ్యమా? సమస్యలంటని వారే అట్లుండగలరు. సమస్యలుండుట సామాన్యము. అంటకుండుట అసామాన్యము. శ్రీకృష్ణుడొక్కడే సమస్య లంటని వాడు. శ్రీకృష్ణుడనగా శ్రీమాతయే. వీరిరువురే నిజమునకు చారుహాసులు. స్మిత వదనులు. వీరెల్లప్పుడునూ చెదరని చిఱునవ్వుతో నుందురు.

చిఱునవ్వుగల రూపమునే ఆరాధన చేయవలెను. చిఱునవ్వును చూచినపుడు సహజముగ ఆకర్షింపబడుదుము. నిజమగు శ్రీవిద్యా ఉపాసకులకు శ్రీమాత అనుగ్రహముగ ముఖమున చిఱునవ్వుండును. అమ్మ అనుగ్రహమే వారియందు చిఱునవ్వుగ భాసించును.

సహజముగ ఆనందమున నుండువారే ఇట్టి నవ్వు కలిగియుందురు. లోన ఆనందము లేనపుడు ప్రయత్నించినను చిఱునవ్వు ముఖముపై నుండదు. పై పై నవ్వులు వెకిలిగనే గోచరించును. లో ఆనందముతో కూడిన నవ్వే చూపరుల కానందము కలిగించును.



243. 'చారుచంద్ర కళాధరా'

వృద్ధి, క్షయ రహితమైన చంద్రకళ కలది శ్రీదేవి అని అర్థము.

చంద్రకళలకు వృద్ధి క్షయములు కలవు. పూర్ణజ్ఞాని చంద్రకళల కతీతముగ మనోభావమున వృద్ధి క్షయములు లేక యుండును. జ్ఞానాగ్ని మనో వికారము లన్నింటిని దగ్ధము చేయును. అట్టి జ్ఞాన వంతుడు బుద్ధిలోకమున స్థిరపడి పూర్ణ మనస్కుడై యుండును. ఈ స్థితిని చారుచంద్ర కళ అందురు. ఈ కళను ఎప్పుడునూ ధరించి యుండునది శ్రీదేవి. ఆ జ్ఞానమున కామెయే మూలము. ఆమె జ్ఞానేశ్వరి. జ్ఞాన స్వరూప. జ్ఞానమును ప్రసాదించునది కూడ ఆమెయే. ఆమె చారుచంద్ర కళలు ధరించి యున్నది అనుటలో విశేషము నిజమున కేమియూ లేదు.

శ్రీదేవికి ఈ నామము వచ్చుటకు ఒక పురాణ గాథ యున్నది. చంద్రకళ అను రాజకుమారి యుండెడిది. ఆమె కాశీరాజు కుమార్తె. సర్వ లక్షణ సంపన్న. ఆమెకు శశికళ అనుపేరు కూడ కలదు. ఆ రాజకుమారి శ్రీమాత భక్తురాలు. ఆమెను వరింప నర్హత గల రాజ కుమారుడు చాల కాలము కానరాకుండెను. చంద్రకళ తండ్రి విఫల ప్రయత్నములకు దుఃఖము చెంది శ్రీదేవిని మిక్కిలి భక్తి భావములతో పూజించుచుండగ ఆమె కమితమగు దుఃఖము కలిగినది. శ్రీదేవి ప్రసన్నురాలై చంద్రకళకు స్వప్న దర్శన మిచ్చి ఇట్లు పలికినది "పుత్రీ!

చంద్రకళా! నీవు దిగులు చెంద నవసరము లేదు. నీవు నా భక్తురాలవు. నిన్ను పెండ్లి యాడుటకు ఈశ్వర భక్తుడే సమర్థుడు. నిశ్చలమగు ఈశ్వరోపాసకుడే నిన్ను పరిణయ మాడగలడు. సుదర్శనుడను రాజపుత్రుడు కామరాజ బీజ ఉపాసకుడు, పరమ శివుడే కామరాజు. అతనీ బీజాక్షరీ ఉపాసనమున సిద్ధి పొందినవాడు. నీవతనిని వరునిగా వరింపుము. అతనిని మహేశ్వరు డావరించి యున్నాడు. అతడు నిన్ను వరించుటకు నేనీ క్షణము నుండి నిన్నావరించి యుందును. నీయందతనికి నాకళ గోచరించి ఆకర్షితుడగును. నీవు చంద్రకళవు. నిన్నావరించి నేనుండుట చేత నేటి నుండి చారుచంద్ర కళాధరా అను అష్టాక్షరీ నామము నా కేర్పడగలదు."

పై కారణముగ శ్రీదేవి చారుచంద్ర కళాధరా అయినది. పూర్ణచంద్రుని కళ చారుచంద్రకళ. ఇట్టి పూర్ణ జ్ఞానమును శ్రీదేవి అనుగ్రహింప గలదు. ఆమె సాన్నిధ్యమున ఉత్తమ భక్తులను ఇట్టి కళ ఆవరించి యుండును. ఇది శ్రీదేవి అనుగ్రహము.

244. 'చరాచర జగన్నాథా'

చరించునవి, చరించనివి యగు జీవులతో కూడిన సమస్త జగత్తునకు నాథ, శ్రీదేవి అని భావము.

ప్రాణముగల జీవులు చరించు జీవులు. ప్రాణము లేక కేవలము ప్రజ్ఞ మాత్రమే కల ఖనిజములు, పదార్థములు, వస్తువులు మరియు ప్రాణ ముండియు చరించలేని వృక్షాదులు, అన్నిటికినీ మూలము శ్రీదేవియే. ప్రాణముగల జీవులు చరింతురు. వీరి యందు ప్రజ్ఞ కూడ కలదు. ప్రజ్ఞ ప్రభావమును చూపును; స్వభావమును చూపును. ప్రజ్ఞ చరాచర జీవుల యందు వారి వారి స్వభావముగ గోచరించును. ఉప్పు యందు ఉప్పగను, పంచదార యందు తీపిగను, బంగారము నందు స్ఫూర్తి నిచ్చు మెఱుపుగను, కుక్క యందు కుక్కగను, సింహము నందు సింహముగను, జ్ఞానులుగను ప్రజ్ఞ భాసించు చుండును. ఇచ్చట హెచ్చు తగ్గులు ఉపాధికి సంబంధించినవే కాని ప్రజ్ఞకు సంబంధించినవి కావు. పెద్ద దీపము, చిన్న దీపము పరిమాణ భేదము వలన వెలుగు పెద్దదిగను, చిన్నదిగను గోచరించును. వెలుగొక్కటే, ఉపాధిని బట్టి అది ప్రకాశించును. ఇట్టి అన్నిటి యందు గల వెలుగు శ్రీదేవి. ఆమె సాన్నిధ్యమున ఉపాధులు వాని వాని స్వభావములను ప్రకటించుచున్నవి. స్వభావములను చూడక వాని కాధారమైన ప్రజ్ఞను చూచుట నిత్యము దేవీ దర్శనము చేయుట వంటిది.

ప్రాణము శివ స్వరూపము కాగా ప్రజ్ఞ దేవీ స్వరూప మగు చున్నది. నిజమునకు ప్రాణ స్పందనము కూడ శ్రీదేవియే. ప్రాణము యొక్క హెచ్చుతగ్గులు కూడ ప్రజ్ఞను బట్టియే యుండును. ప్రజ్ఞ త్రిగుణాత్మకముగ పనిచేయును. తమస్సు పాలు అధికముగ నున్నప్పుడు అచరము లేర్పడును. అందుండి రజస్సు మేల్కొంచినపుడు ప్రాణము సమవర్తనమై యుండును. సృష్టి నీ విధముగ నడిపించునది ప్రాణ, ప్రజ్ఞలే. రెంటికినీ శ్రీదేవియే ఆధారము. పరమశివుడు కేవలము అస్తిత్వముగ అన్నిటి యందుండును.

245. 'చక్రరాజనికేతనా'

శ్రీ చక్రరాజము నివాసముగా గలది శ్రీదేవి అని అర్థము. శ్రీ చక్రరాజము సృష్టి సంకేతము. అందు నాలుగు త్రికోణములు దిగువకును, ఐదు త్రికోణములు ఎగువకును వుండును. మొత్తము తొమ్మిది త్రికోణములతో యుండునది శ్రీ చక్రము. మూల ప్రకృతితో కలిపి ప్రకృతి స్థానములు తొమ్మిది. కేంద్రమున బిందువుండును. అది శ్రీమాత ఉద్భవస్థానము. పరతత్త్వమునుండి ఉద్భవించి మూల ప్రకృతియే త్రిగుణములను, పంచతత్త్వ సృష్టిని వ్యక్తపరచి వాని యందామె వసించు చుండును. ఆమె యందు పరతత్త్వము వశించి యుండును. పరతత్త్వము మూలధనముగ నవావరణ సృష్టి నిర్మాణము గావించి అందు పరుని (పరమశివుని)తో గూడి వశించి యుండును. చరాచరమగు జగత్తు మొత్తము శ్రీమాత నివాస స్థానము. రూపము లన్నియూ ఆమె నుండేర్పడునవే. స్థూలము, సూక్ష్మము సూక్ష్మతరము, సూక్ష్మతమము అగు రూపములన్నియూ ఆమె నుండేర్పడునవే. వెలుగు శబ్దముకూడ ఆమె రూపములే. తెలియబడున దంతయూ ఆమెయే. పరమశివుడు కూడా ఆమె రూపముననే తెలియబడును. మరియొక మార్గము లేదు. ఆమె శివరూపి మరియు విశ్వరూపి. శివుని ప్రధాన రూపమామె. సృష్టి ఆమె విశ్వరూపము. నవతత్త్వము శ్రీదేవి. తొమ్మిది ఆమెను గూర్చిన అంకె. శాశ్వతముగ శివునితో కూడియుండును గనుక పది యగుచున్నది. పూర్ణత్వమునకు పది

సంకేతము. అట్టి పూర్ణత్వమును కూడ ఆమెయే అనుగ్రహించును. ఆమె అనుగ్రహముననే శివ సాయుజ్యము కలుగును. పరమ శివునికి శ్రీదేవి నివాసము. శ్రీదేవికి నవావరణములతో కూడిన సృష్టి నివాసము.

శ్రీ చక్రమును గూర్చి వివరణము తదుపరి నామములలో తెలియగలదు.

246. 'పార్వతీ'

పర్వతరాజ పుత్రి శ్రీదేవి అని అర్థము.

హిమవత్ పర్వతునకు పుత్రికగ జనించి కఠోర తపస్సు గావించి మరల పరమేశ్వరుని శ్రీమాత చేరినది. పర్వతుడు పూర్వము సంతానమునకై చేసిన తపః ఫలముగ శ్రీమాత అతని కుమార్తెగ జన్మించినది.

దక్ష యజ్ఞమున భంగపడిన సతీదేవి అగ్ని నుద్భవింపజేసి అందు తన దేహమును ఆహుతి చేసెను. అట్లు చిదగ్నికుండము చేరెను. మరల శివుని జేరుటకు తపస్సు ఆవశ్యక మయ్యెను. హితము కోరి పరమ శివుడు వారించినను పుట్టినిల్లు మమకారముతో దక్షుని గృహమున కేగి అవమాన పడెను. పెనిమిటి జ్ఞానమునకే పెనిమిటి. అట్టివాని మాట పెడచెవిని పెట్టుట, అవమాన పడుట కారణముగ పశ్చాత్తాపము చెంది పరమ శివుని అనుగ్రహము కొఱకు మరల తపస్సునకు పూనుకొనెను. శంకరుడు రౌద్రుడై దక్షుని యజ్ఞమును ధ్వంసము చేసి మహోగ్రుడై వారింపరాని రౌద్రమూర్తి అయ్యెను. తన రౌద్రమును తానే ఉపశమించుకొనుటకై అతడును దీర్ఘమగు తపస్సును సంకల్పించెను.

రుద్రుడు తపస్సు మార్గమున శంకరుడై వాత్సల్యమూర్తియైన గాని తనను మరల మన్నింపడని తెలిసిన శ్రీమాత, తాను

సంకల్పించిన తపస్సునకు అపరిమితమగు దృఢము, స్థిరము వుండవలెనని భావించి, అమిత దృఢుడైన హిమవత్ పర్వత రాజునకు జన్మించెను. అట్లు పార్వతి యయ్యెను. అచంచలము, అసామాన్యము, అనుపమానము అగు తపస్సుతో శివుని మెప్పించి అతని అర్ధాంగి అయినది పార్వతీదేవి.

పార్వతి అను శ్రీమాత నామము సంకల్పమునకు దృఢత్వము, స్థిరత్వము నీయగలదు. పట్టుదలకు మారు పేరు పార్వతి నామము. ఈ నామ స్మరణము సాధకులకు పట్టుదలను అనుగ్రహింపగలదు.

హిమవత్ పర్వత శ్రేణిలో గల నొక నదీ ప్రవాహమును కూడ పార్వతి అని పిలుతురు.

247. 'పద్మనయనా'

పద్మములవలె విచ్చుకొనిన అందమైన కన్నులు గలది శ్రీమాత అని అర్థము.

కన్నులు పెద్దవిగను, అందముగను, ఆకర్షణీయముగను వుండుట ఒక శుభ లక్షణము. శ్రీమాత అనుగ్రహమున కవి సంకేతములు.

శ్రీమాత కన్నుల అందము వర్ణనాతీతము. ఆమెను పద్మాక్షి, మీనాక్షి, పద్మపత్రాయతాక్షి అనియు కీర్తించుట పరిపాటి. విశాల మైనవి, అందమైనవి, పద్మముల వలె వికసించియున్న కన్నులు గ్రహింపు శక్తికి చిహ్నము. ఇట్టి కన్నులు కలవారు చూపులతోనే సర్వమును గ్రహింతురు. ఇట్టివారు సహజముగ మౌనముగ నుందురు. చూపులతో వారు పొందు అవగాహనను సామాన్యముగ ప్రకటింపరు. ఆకళింపు శక్తి వీరికి ఎక్కువగ నుండును. ఇవి అన్నియూ శ్రీమాత అనుగ్రహ పరమగు సంకేతములే.

శ్రీమాత కన్నులు వాత్సల్యపూరితములే కాక శక్తివంతములు, స్ఫూర్తిదాయకములు కూడ. ఆమె కన్నుల నుండి మాయను ప్రసరింప చేయగలదు. అట్టి మాయకు త్రిమూర్తులు కూడ లోబడి యుందురు. అట్లే ఆమె కన్నుల నుండి మాయను తొలగింపజేయు శక్తిని కూడ ప్రసరింప చేయగలదు. శ్రీమాత కన్నుల ఆరాధన సర్వశుభంకరము.

248. 'పద్మరాగ సమప్రభా'

పద్మరాగ మణితో సమాన మగు దేహకాంతి గలది శ్రీమాత అని అర్థము.

పద్మరాగమణి కాంతి ఎఱుపు పసిడి కాంతి. పచ్చని పసిమికన్న ఎఱుపు పసిమి చాల ఆకర్షణీయమైన వర్ణము. గులాబీ రేకులవలె భాసించు కాంతి. శ్రీమాత నైజము నీలము. నీలము శుద్ధ జ్ఞానమునకు సంకేతము. పరమ ప్రేమకు కూడ సంకేతము. ఆమె నుండి ప్రకటింప బడు కాంతియందు ఎఱుపు, పసుపు సరిసమానముగ మిళితమై నున్నవి. ఇందు ఎఱుపు ఇచ్ఛాశక్తికి సంకేతము. పసుపు క్రియాశక్తికి సంకేతము. ఆమె సహజముగ జ్ఞానశక్తి. జ్ఞాన స్వరూపిణి యగు శ్రీమాత ఇచ్ఛా క్రియా శక్తులద్వారా సర్వసృష్టిని నిర్వహించు చున్నది. ఆమె పద్మరాగ ప్రభలతో విరాజిల్లుచు నుండును. ఇచ్ఛా క్రియాశక్తు లను బడయ గోరువారు ఈ నామమును నిరంతరము స్మరణము చేసుకొనవచ్చును.

249. 'పంచప్రేతాసనాసీనా'

పంచప్రేతముల యందు ఆసీనురాలై యున్నది శ్రీమాత అని అర్థము.

సృష్టికి ప్రధానమైన తత్త్వములు ఐదుగ ఋషులు గుర్తించిరి. ఈ ఐదింటి యందును శ్రీమాత ఆసీనురాలై యుండుట చేత అవి శక్తివంత మగుచున్నవి. అట్లు శ్రీమాత ఆసీనురాలు కానిచో అవి కేవలము ప్రేతములే. ప్రేతము లనగా నిర్జీవములు. తమకు తాముగ కదలనైన కదలలేవు. ఎట్టి ప్రభావమును చూపలేవు. పంచభూతముల యందు శక్తి శ్రీమాతయే. పంచాంగములతో కూడిన శరీర మందలి శక్తి శ్రీమాతయే. పంచ తన్మాత్రల ప్రభావము శ్రీమాతయే. పంచ ప్రాణముల యందలి శక్తి శ్రీమాతయే. ఇట్లు పంచ తంత్రముల యందు శ్రీమాత శక్తియే విరాజిల్లుచున్నది.

పై విధముగనే ప్రధాన పంచతత్త్వములగు అగ్ని, పదార్థము, బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు వీరియందు కూడ శ్రీమాత అస్తిత్వమే. వారి వారికి ఆయాప్రభావములు కలిగించుచున్నది. ఎంత గొప్ప విద్యుత్ పరికరమైనను, విద్యుత్ శక్తి ప్రసరించనపుడు పని చేయలేదు కదా! అట్లే త్రిమూర్తులు, ప్రకృతి, అగ్ని కూడ శ్రీమాత యను విద్యుత్ శక్తిచేత నడిపింపబడుచున్నారు. ఆమె లేని వారు లేరు. సమస్తము నందు జీవము, శక్తి ఆమెయే.

శ్రీమాతయే ఉద్భవించనిచో పరతత్త్వము సృష్టి నిర్మాణమే చేయలేదు. నిద్రించుచున్న సృష్టికి మేలుకొలుపు శ్రీమాతయే. మనము నిద్రనుండి మేల్కాంచుటకు కూడ శ్రీమాతయే కారణము. ఆమె అనుగ్రహించనిచో మేల్కాంచుటయే యుండదు, కదలిక లుండవు, ప్రాణము లుండవు, ప్రాణ స్పందన ముండదు. సాధారణముగ మరణించినపుడు జీవుడు ప్రేతమగును. యాతనా శరీరమున అవశుడై యుండును. ప్రేతము అవశత్వమునకు పరాకాష్ఠ. ఇది భరింపరాని ఒక అవస్థితి. బ్రహ్మాదులకైనను అట్టి అవస్థితి కలుగ గలదు. కాని కలుగదు. కారణము వారు శ్రీమాత శాశ్వత అనుగ్రహ పాత్రులు. అనుగ్రహము శ్రీమాత కృపయే కదా! అందువలన శ్రీమాత వారి యందు ఆసీనురాలు కానిచో వారు కూడా అవశులే అని హయగ్రీవుడు, అగస్త్యునకు బోధించుచున్నాడు.

250. 'పంచబ్రహ్మ స్వరూపిణీ'

పంచబ్రహ్మముల రూపమున నుండునది శ్రీమాత అని అర్థము.

పంచబ్రహ్మలు :

1)	బ్రహ్మ	నారాయణుడు	సద్యోజాతుడు
2)	విష్ణువు	వాసుదేవుడు	వామదేవుడు
3)	రుద్రుడు	సంకర్షణుడు	అఘోరుడు
4)	ఈశ్వరుడు	ప్రద్యుమ్నుడు	తత్పురుషుడు
5)	సదాశివుడు	అనిరుద్ధుడు	ఈశానుడు

పై తత్త్వములు శ్రీమాత స్వరూపములే. శ్రీమాతయే ఐదుగ ఆవిర్భవించి రూపములనుగొని సృష్టి కార్యమును నిర్వర్తించును. సర్వమునకు మూలమైన ఆమె నాలుగు స్థితులలోనికి ప్రవేశించి ఐదగుచున్నది.

గరుడ పురాణమునందు ఇట్లు తెలుపబడినది. లోకానుగ్రహము కొఱకై శ్రీ మహా విష్ణువు వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ నారాయణు లను పంచరూపములు గలవాడాయెను.

అట్లే త్రిపుర సిద్ధాంతమందు పరబ్రహ్మము మాయా

విలాసముచే బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వర, సదాశివుడను పేర్లతో నున్నాడు అని చెప్పబడెను.

పరతత్త్వము నాలుగుగ దిగివచ్చుట వలన మొత్తము ఐదైనది. పరతత్త్వము దిగివచ్చుట కొంత భాగమే. దిగిరాని భాగము మిక్కుటముగ దిగివచ్చిన తత్త్వము సృష్టిని నిర్వహించు చుండును. ఒక వేదము నాలుగు వేదములైనవి–

1) ఋగ్వేదము, 2) యజుర్వేదము, 3) సామవేదము, 4) అథర్వణ వేదము.

ఒకే పరావాక్కు నాలుగు వాక్కులైనవి. అవియే 1) పర, 2) పశ్యంతి, 3) మధ్యమ, 4) వైఖరి.

ఒకే నారాయణుడు నలుగురు కుమారులైరి. వారే 1) సనాతన, 2) సనక, 3) సనందన, 4) సనత్కుమారులు.

ఇట్లు సమస్తము పంచీకరణము చెందును.

ఆకాశము	ప్రాణము	వినుట	చెవి
వాయువు	అపానము	చూచుట	కన్ను
అగ్ని	వ్యానము	స్పర్శ	చర్మము
నీరు	ఉదానము	రుచి	నాలుక
భూమి	సమానము	వాసన	ముక్కు

ఇట్లు ఐదు, ఐదుగ సృష్టిని వివరించు శాస్త్రమున్నది.

అంతయూ ఐదే. ఐదు నుండి ఐదు పుట్టుచుండును. ప్రధానమగు ఈ ఐదును శివతత్త్వముగను, శ్రీ తత్త్వముగను, విష్ణుతత్త్వముగను, బ్రహ్మతత్త్వముగను బహు విధములుగ పురాణము లందు పేర్కొనిరి. నామ భేదము చేత కొంత ప్రాథమికముగ తికమక యుండును. అవగాహన కలిగినచో అన్నింటిని సమన్వయించుకొనవచ్చును. మన ఋషులు ఒకే సత్యమును పలు రకములుగ ప్రకటించిరి. అది వైభవమే గాని తికమక కాదు. ఒకే కూరగాయను, రక రకములుగ వండి రుచి చూచుట వైభవమే కదా! సమన్వయము సంపూర్ణముగ ఎఱిగిన వేదవ్యాస మహర్షి ఈ పంచ సూత్రము ననుసరించియే, పంచమ వేదముగ మహాభారతమును రచించెను. అందీవిధముగ నుడివెను.

"పాంక్తంవా ఇదగ్ం సర్వం, పాంక్తే నైవ పాంక్తగ్గ్ం స్పృణోతీతి."

పంక్తి అనగా ఐదు. అంతయూ ఐదే. ఐదు నుండి ఐదు పుట్టును. సృష్టి కథ ఐదు కథ. భారత కథ కూడ ఐదుగురు పాండవుల కథయే కదా!

ఇట్లు శ్రీమాతయే పంచమి. పంచమి, పంచభూతేషు, పంచ సంఖ్య ఉపచారిణి అను నామములతో కూడ ఈ తత్త్వమునే ఆరాధింతురు.

251. 'చిన్మయీ'

చైతన్యమయమైనది శ్రీదేవి అని అర్థము.

చిన్మయమనగా చైతన్యమయము. శ్రీమాతయే సృష్టి చైతన్యము. ఆమె ఉద్భవించుటయే సృష్టి మేల్కాంచుట. సృష్టిలోని ప్రతి వస్తువు నందు కూడ ఆమె ప్రభావమే మేల్కాంచి యుండును. గుణ రూపమున మనకు గోచరించుచుండును. ఉప్పు, పులుపు, తీపి, వగరు, చేదు, కారముగ ఆహార పదార్థములలో గోచరించునది శ్రీమాతయే. అట్లే పండ్లయందు వివిధమగు రుచులుగను, పువ్వులయందు సుగంధములుగను, సుగంధ ద్రవ్యములయందు సువాసనలుగను శ్రీమాత గోచరించును. పంచభూతములయందు ఆయా గుణములతో గోచరించును. జంతువులయందు, మానవులయందు వారి వారి స్వభావములకు మూలమైన సత్త్వ, రజస్తమో గుణ సంమిశ్రమముగ భాసించును. అట్లే దేవతలయందు, దానవులయందు కూడ భాసించును.

శ్రీమాత చైతన్యము త్రిగుణాత్మకమై సృష్టి అంతయూ ఆవరించి యుండగ త్రిగుణముల మిశ్రమమును బట్టి అనేకానేక జీవుల ప్రవర్తనము లుండును. గుణముల మిశ్రమములలోని భేదములే జీవుల స్వభావములోని భేదములుగ గోచరించును. అందరూ జీవులే! జీవులుగ అందరూ శ్రీమాత సంతానమే! వారి నావరించి యుండు

త్రిగుణముల మిశ్రమము వారి వారి అనుభవములకు సంబంధించి యుండును. మంచి చెడులు, ఉచ్ఛ నీచములు, కుడిఎడమలు, స్థూల సూక్ష్మములు అన్నియూ గుణముల మిశ్రమమే. అన్నిటియందుగల ఈ గుణ మిశ్రమమున కాధారము శ్రీమాత చైతన్యమే. ఈ చైతన్య ముద్భవించనిచో జీవులందరూ నిద్రాణమగు స్థితి యందుందురు. నిద్రాణ స్థితిలో రాజు, బంటు, పోలీసు, దొంగ, తెలిసినవారు, తెలియనివారు అందరూ సమానులే. సృష్టిక్రీడ అంతయూ గుణములుగ చైతన్యము మేల్కాంచినపుడే యుండును. ఈ చైతన్య స్వరూపము శ్రీమాత. త్రిగుణాత్మకము కాని ఈ చైతన్యమును శుద్ధ చైతన్య మందురు. శుద్ధ చైతన్యమున ఇచ్ఛ కాని, ఆ ఇచ్ఛను నిర్వర్తించవలసిన జ్ఞానముగాని, తత్సంబంధిత క్రియగాని ఇంకనూ మేల్కాంచి యుండవు. కేవలము చైతన్యమే యుండును. తానున్నాను అన్న భావన తప్ప మరియొక భావన లేని స్థితి యది. ఈ శుద్ధ చైతన్య స్వరూపమే చిన్మయ స్వరూపము. ఈ స్వరూపము సత్య ప్రకాశముగ నుండును. స్వయం ప్రకాశముగ నుండును. తనకు తానే సహజమగు వెలుగుగ నుండును. సత్యమే తానుగ నున్నానను జ్ఞానమే (భావమే) ఈ వెలుగు. అట్టి చేతన యందు సహజమగు ఆనంద ముండును. సత్, చిత్ అను ప్రకాశముగ మాత్రమే నుండుట వలన, త్రిగుణముల యందింకను జొరబడకుండుట వలన, ఎట్టి కోరిక లేకుండుట వలన పరిపూర్ణమైన ఆనంద ముండును. కేవలము సత్ చిత్‌లే యున్నప్పుడు కలుగు ఆనందము వర్ణనాతీతము. అదియే పరమానందము ఈ

స్థితిని సత్ చిత్ ఆనందా– సచ్చిదానంద అందురు. ఈ సచ్చిదానంద స్థితి శ్రీదేవి సహజ స్థితి. జీవులకది గమ్యము. త్రిగుణముల కావల ఈ చిన్మయ స్థితిని జీవుడు పొందగలడు. త్రిగుణముల కీవల సంసారబంధమున నుండును. చిన్మయ స్థితిని పొందినవారు త్రిగుణములలో ప్రవేశించినను బంధింపబడక నుందురు. వారే ముక్తజీవులు.

252. 'పరమానందా'

ఆనందమునకు పరాకాష్ఠ శ్రీమాత అని అర్థము.

ఆనందము పలు విధములు. భౌతికమగు ఆనందము కొంత తృప్తి నిచ్చును. ఇంద్రియానందము అంతకు మించిన తృప్తి నిచ్చును. మానసికానందము మరికొంత తృప్తి నిచ్చును. అంతకు మించి మిక్కుటమైన తృప్తి విజ్ఞాన మిచ్చును. విజ్ఞానమున మునిగిన జీవుడే మానసిక ఇంద్రియ భౌతిక ఆనందమును విస్మరించగలడు. ఇచ్చట జీవునకు ఆనంద మిచ్చుటకు కారణము విజ్ఞానము. అనగా విజ్ఞానముతో ఉన్నప్పు డానంద ముండును. విజ్ఞానమను ఉపాధి ఆనందమున కాధార భూతము. ఉపాధి కారణముగ పొందు ఆనందము శాశ్వతము కాదు. ఉపాధితో సంబంధములేక ఎప్పుడునూ ఆనందముగ నుండుట నిజమగు ఆనందము. ఇట్టి స్థితియందు ఉండుట లేకుండుట ఆనందముపై ఎట్టి ప్రభావము చూపదు.

భౌతిక సౌకర్యము లున్నను, లేకున్ననూ, ఇంద్రియ సుఖము లున్నను, లేకున్ననూ, విజ్ఞాన వీచికలున్నను, లేకున్ననూ ఆనందముగ నుండుట సాధ్యమా? సాధ్యమే. తనయందు తానున్న వానికి ఆనందము శాశ్వతముగ నుండును. పరతత్త్వముతో ముడిపడి యున్నవానికి ఆనందము శాశ్వతముగ నుండును. అట్టివారిపై త్రిగుణములు ప్రభావము చూపవు. త్రిగుణముల ప్రభావము వలననే జీవుడహంకార

స్థితిని పొందును. అహంకారము మూడు రకములు. తామసికము, రాజసికము, సాత్త్వికము. ఈ మూడును వరుసగ ఒక దానికంటె ఒకటి మెరుగైనదే అయినప్పటికి శాశ్వతానందము నీయవు. సాత్త్విక అహంకారము కూడ అహంకార స్థితియే గనుక సంసరణమునకు లోబడుట జరుగుచుండును. సత్త్వాతీతము గుణాతీతము అగు స్థితియే శాశ్వతానంద స్థితి. ఆ స్థితియందు జీవుడు "పరముతో పరము" సంయోగము చెందినపుడు పరమానందమును పొందును. పరమున లయమైనపుడు ఉండుటయే ఉండును కాని ఆనందించు వాడుండడు. పరముతో కూడియుండుట వలన పరమానంద ముండును. శ్రీమాత పరమునందుద్భవించి పరము నందు కలిసి యుండును. కనుక ఆమె పరమానంద.

253. 'విజ్ఞానఘనరూపిణీ'

చైతన్యరసమే ఘనీభవించిన రూపము గలది శ్రీమాత అని అర్థము.

విజ్ఞాన మను పదమునకు జీవుడను అర్థమున్నది. జీవుల రూపముగ శ్రీమాత చైతన్యమే ఘనీభవించి యుండును. రూపము నిచ్చున దామెయే. దైవాంశగ దిగివచ్చు జీవునికి తన వెలుగును ప్రసాదించి చైతన్యవంతుని గావించి త్రిగుణముల రూపమున ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తుల నొసగి, పంచతత్త్వములతో కూడిన శరీర మిచ్చి, అందు పంచ ప్రాణములను నిలిపి జీవుని ఘనరూపునిజేసి ఆనందము, అనుభూతి, పరిణామము పొందుటకై నక్షత్ర, గ్రహ గోళాది సృష్టిగ యేర్పడినది శ్రీమాత. ఆమె ఘనరూపమే. సృష్టి, జీవుల ఘన రూపము గూడ ఆమెయే.

సహజముగ చైతన్య రస స్వరూపిణి అయి వుండియు జీవుల కొఱకు తానే ఘన రూపము దాల్చినది. జీవుల రూపము, సృష్టి రూపముగ నిలచినది. జీవుల యందు విజ్ఞానముగ గూడ యేర్పడి యున్నది. కావుననే జీవులు పరిణామము చెందుట కవకాశ మేర్పడినది.

254. 'ధ్యాన ధ్యాతృ ధ్యేయరూపా'

చింతనము, చింతన గమ్యము, చింతించు జీవుడు, అను మూడు రూపములుగ ఉండునది శ్రీదేవి అని అర్థము.

చింతన గమ్యము శుద్ధ చైతన్యము. అందుండి చింతించు జీవుడు జన్మించును. అతని గమ్యము పుట్టిన చోటికి చేరుటయే. దీనినే స్వస్థానమున కేగుట అందురు. సత్య స్వరూపుడగు జీవుడు మేల్కాంచుట శ్రీదేవి కారణముగ జరుగును. మేల్కాంచిన జీవుడు చింతన మారంభించును. చింతనము త్రివిధములుగ అవతరణము చెందును. అవియే ఇచ్ఛా, జ్ఞాన, క్రియలు. వాని ననుసరించు జీవుడు, మనస్సు, పంచేంద్రియముల ద్వారా పంచతత్త్వములతో కూడిన సృష్టియందు ప్రవేశించును. ఇట్లు త్రిగుణములను, పంచతత్త్వములను ఆధారము చేసికొని జీవుడు బహిరంగము జేరును. ఇట్టి జీవుడు మరల అంతరంగుడై స్వస్థానము చేరుటకు ధ్యానము అవసరము. తాను పుట్టిన చోటికి చేరుటకే ఈ ధ్యానము. తాను పుట్టిన చోటును గూర్చి చింతన చేయుటయే అన్ని ధ్యానముల పర్యవసానము. ఈ ధ్యానమునే గాయత్రీ ధ్యాన మనిరి.

తానెచ్చుట పుట్టినాడు? తన ఉత్పత్తికి మూలమేమి? తానున్నా డన్న భావము కలుగుటకు మూలమేమి? తన భావములకు తాను మూలము. తనకు మూలము? తన మూలమును ధ్యేయముగ ధ్యానము చేయుట నిజమగు గాయత్రీ ధ్యానము. ఇది నిత్య చింతన

మైనపుడు, నిరంతర చింతనమైనపుడు ధ్యాసగ మారును. ఇట్టి ధ్యాసయే ధ్యానము.

ధ్యానము చేయుటయందు ధ్యాస కలుగుట స్వస్థానము చేరుటకు ప్రధానము. సాధన యందు ఇది తుది మెట్టు. అష్ట ప్రకృతులు (త్రిగుణములు, పంచేంద్రియములు) ద్వారా బహిరంగము చేరిన జీవుడు త్రిగుణములయందు తన్ను తాను బంధించుకొనును. ఇచ్ఛా పూర్ణమే కార్యక్రమముగ లక్షల జన్మలు సాగిపోవుచుండును. ఇచ్ఛా పూర్ణ కార్యక్రమములో భాగముగ ఇంద్రియాసక్తి, విషయాసక్తి తామర తంపరలుగ పెరిగి అందు జీవుని అగమ్యుని చేయును. గతిలేని జీవుడు చేయునది లేక మూలకారణము కొఱకు వెదకును. గతి లేకయే కదా, గజేంద్రుడు మూలకారణమును గూర్చి ప్రార్థన చేసెను. ధ్యానించుటకు కూడ వలసిన ప్రేరణ శ్రీదేవి అనుగ్రహమే. అనుగ్రహము లేనివారు దైవమును గూర్చి ధ్యానము చేయలేరు. ప్రార్థనలు చేయలేరు. ప్రారబ్ధము విఘ్నములు కలిగించు చుండగ ప్రార్థన లెట్లు జరుగగలవు? ధ్యానమునకు అనుగ్రహము శ్రీదేవి.

ధ్యానము, ధ్యేయము శ్రీదేవి అని వివరింపబడినది. ధ్యానించు జీవుడుకూడ శ్రీదేవి నుండి ఏర్పడినవాడే. జీవుడు స్వయముగ చైతన్య స్వరూపుడు. స్వయంప్రకాశకుడు. అష్ట ప్రకృతుల లోనికి సంసరణము చెందినపుడు తనను గూర్చిన ఎఱుక కోల్పోవును. నిజమున కతడు కూడ సముద్రమునందు అలవలె శ్రీదేవి అంశ. అల సముద్రమే కదా! అట్లే మహాచైతన్యమగు శ్రీదేవి నుండి ఉద్భవించినవాడే జీవుడు.

శ్రీదేవి సత్, చిత్ రూపిణి. జీవుడు కూడ సత్ చిత్ రూపుడే.

255. 'ధర్మాధర్మ వివర్జితా'

ధర్మమును, అధర్మమును వర్జించినది శ్రీదేవి అని అర్థము.

శ్రీదేవి ధర్మమునకు, అధర్మమునకు అతీతమైన స్థితి యందున్నది. ధర్మా ధర్మములు ఆమెను తాకవు. ధర్మము పుట్టినపుడు అధర్మము కూడ పుట్టును. వెలుగు పుట్టినపుడు చీకటి కూడ పుట్టును. అట్లే జ్ఞానము పుట్టినపుడు అజ్ఞానము కూడ పుట్టును. కుడి ఎడమలు రెండునూ గల స్థితి సృష్టి. సృష్టియందు ధర్మాధర్మములు తప్పవు. సృష్టి కతీతమైనవారిని అవి అంటవు. సృష్టికి మూలము ఇచ్ఛ. ఇచ్ఛ లేనిదే తత్సంబంధిత జ్ఞానము లేదు. క్రియ కూడ లేదు. ఇది త్రిగుణముల కతీతమగు సహజ సమాధి స్థితి.

ఇచ్ఛలోనికి ప్రవేశించుట రెండు విధములుగ నుండును. తన కొరకు, ఇతరుల శ్రేయస్సుకొఱకు, తమకొఱకు ఇచ్ఛ లోనికి ప్రవేశించువారు అధర్మమున పడుదురు. ఇతరుల శ్రేయస్సు కొఱకు ఇచ్ఛా ప్రవేశము గావించువారు ధర్మమున నిలతురు. శ్రీమాత నుండి వెలువడు ఇచ్ఛాశక్తి జీవుల శ్రేయస్సు కొఱకే వ్యక్తమైనది. అట్లే జీవుల శ్రేయస్సు కొఱకే జీవించువారు శ్రీమాతవలె సహజ సమాధి యందుందురు.

ఇష్టములను పొందుటకు ధర్మము నాచరించు వారున్నారు. ఐశ్వర్యమును, గొప్పదనమును కోరి యజ్ఞయాగాది క్రతువుల

నాచరించుచు నుండువారున్నారు. వీరాచరించు ధర్మము ఇష్టమును పొందుటకు, అయిష్టమును తొలగించుకొనుటకు. ఇట్టివారు నిత్యము అయిష్టములను వర్జించు ప్రయత్నమున నుందురు. అయిష్టమును నిర్జించుటకు నిత్య ప్రయత్నమున వీరి జీవితము పోరాటమువలె సాగును. పురాణములందు ఇంద్రుని కథలు దీనినే సూచించును. ఇంద్రుని కెప్పుడునూ దైత్యుల బాధ మనస్సున యుండును. అట్లే దైత్యులకు ఇంద్రాది ఆదిత్యులతో శత్రుత్వ ముండును. వీరు ఒకరి నొకరు జయించుకొను పోరాటములో ఎప్పుడునూ మునిగి తేలు చుందురు. కొంత తడవు మునక, కొంత తడవు తేలుటగ నుండును. ఈ కారణమున నిత్యము దేవ, దానవ యుద్ధము జరుగుచునే యుండును. అహంకార పురుషునకు జీవుని యందు కూడ దేవ దానవ యుద్ధము నిత్యము జరుగుచు నుండును.

సనక సనందనాదులు, నారదుడు, సప్త ఋషులు, ప్రజాపతులు ఇత్యాదులకు ఈ ఘర్షణ లేదు. కారణము వారు ధర్మాధర్మముల కతతీమైన చైతన్యమున నిలబడి యుందురు. వారందరికిని మిత్రులే. లోకశ్రేయస్సే వారికి ప్రధానము. జీవులందరునూ ఉద్ధరింపబడవలె నని వారి ప్రేమ భావన. తెలియనివారు తెలిసినవారిగ తీర్చిదిద్ద బడవలెను. తెలిసినవారు సంయమము చెంది సర్వమునూ సమన్వ యించుకొని సమవర్తనమున నిలువవలెను. తెలిసినవారు తెలియని వారిని దూషించిననూ, ద్వేషించిననూ తెలియనివారే అగుచున్నారు.

దూషించుట, ద్వేషించుట, హింసించుట కారణముగ తెలిసినవారు కూడ తెలియనివారితో సమానముగనే ఘర్షణ యందు పడి యుందురు. తెలియక దుస్థితి యందుండుట ఒక వంతు; తెలిసి దుస్థితి యందుండుట లోతైన దుస్థితి.

ధర్మా ధర్మములచే విడివడుటకు యోగవిద్య ఒక్కటియే మార్గము. ఈ విద్యయే సమభావమున నిలుపును. సమదర్శనము నందించును. సమవర్తనము కలిగించును. యోగేశ్వరి అయిన శ్రీదేవి అట్టి సమదర్శనము కలది. ఆమెకు అందరూ తన సంతానమే. ధృతరాష్ట్రుని దూషించిన సనత్సుజాతునకు– ధృతరాష్ట్రునకు జ్ఞానము బోధింపుమని ఆదేశించి ఆతనిని సరిదిద్దినది. ఇట్టి విశేష ధర్మమే ఈశావాస్య ఉపనిషత్తు బోధించు చున్నది.

256. 'విశ్వరూపా'

విశ్వము యొక్క రూపము కలది శ్రీమాత అని అర్థము.

శ్రీమాత రూపమే విశ్వము. ఈ రూపము స్థూలము, సూక్ష్మము కూడ. ఆమె నుండి వెలువడు వెలుగునుండి సూక్ష్మము స్థూలముగ రూప మేర్పడును. విశ్వరూపము ఆమె రూపము కంటె వేరు కాదు. రూపములు వచ్చి పోవుచుండును. వానికి వృద్ధి ఉన్నది. క్షయ మున్నది. ఇన్ని రూపములు వచ్చి పోవుటకు మూలమగు శ్రీమాత రూపము కల్పాంతము వఱకు వృద్ధి క్షయములు లేనిది. ఈ రూపము 16 కళలు కలిగి యుండుటచే శ్రీమాతను షోడశి అని కూడ కీర్తింతురు. ఇది శ్రీమాత సచ్చిదానంద రూపము. ఈ పదహారు కళలు గల సచ్చిదానంద రూపమును 'సాదా' అని పిలుతురు.

ఈ సాదా రూపమును చూచుటకే యోగులు, సిద్ధులు, ఋషులు, భక్తులు తపన చెందుచుందురు. గురు ముఖమున శ్రీ విద్యను గ్రహించి ఉపాసన చేయుచు తదనుగుణమైన దీక్షను వహించు వారికి ఈ రూప దర్శనము జరుగ గలదు.

ఈ సచ్చిదానంద రూపమునే సృష్టి యందు దైవ మందురు. ఈ రూపము స్త్రీ రూపము కాదు. పురుష రూపము కాదు. స్త్రీ రూపముగ చూచువారికి స్త్రీ రూపముగ గోచరించును. పురుష రూపముగ ధ్యానించు వారికి పురుష రూపముగ గోచరించును. లింగ భేదము లేని రూప మిది. శ్రీ మహావిష్ణువు, శ్రీ లలిత, శ్రీకృష్ణుడు

అనుచు భక్తులారాధించు రూపమిదియే. విశ్వరూప అని శ్రీమాతను, విశ్వరూపుడని శ్రీమహావిష్ణువును సంబోధింతురు. లింగభేదము సృష్టి అవరోహణ క్రమములో నాలుగవ స్థితియందు కలుగుచున్నది. అంతకు ముందు స్థితులలో లింగభేదము లేదు. ఉన్నతమైన యోగీశ్వరులు స్త్రీ పురుష భావములను సమన్వయించుకొని యుందురు. అట్టివారి రూపములు స్త్రీలకు పురుషునివలె ఆకర్షణీయముగ నుండును. అట్లే పురుషులకు స్త్రీ రూపమువలె ఆకర్షణీయముగ నుండును. భూమిపై అట్టి రూపముతో సంచరించిన వాడు శ్రీకృష్ణుడు.

జగద్గురు వగు మైత్రేయ మహర్షి కూడ శ్రీకృష్ణానుగ్రహమున ఇట్టి రూపమునే ధరించి యున్నాడు. శ్రీమాత విశ్వరూపమును ధ్యానించు విధానమే విష్ణూపాసన మందురు. స్థూల సూక్ష్మ సకల సృష్టి రూపములను శ్రీదేవి రూపములుగ భావించుట ఈ ఉపాసనా మార్గము. జీవులు కూడ స్వయముగ వెలుగు రూపము గలవారే. వారికిని వారి వెలుగు రూపము నుండి స్థూల రూపము లేర్పడు చుండును. స్థూల రూపములు క్షరములు. అవి వచ్చి పోవుచుండును. వెలుగు రూపము కల్పాంతము వరకు శాశ్వతము. జీవుల అస్తిత్వము సత్‌చిత్‌ల అస్తిత్వమే గనుక వారి దివ్య రూపమును వారియందు అంగుష్ఠమాత్ర రూపమున దర్శించుట కూడ యోగవిద్య యందు ఉపదేశించబడినది. ఈ మార్గమున దైవమును చేరు విధాన ముండును. ఈ కారణముగనే రూప ధ్యానము గూడ విశిష్ట మార్గముగ తెలుపబడినది.

257. 'జాగరిణీ'

మేలుకొని యుండునది, మేలు కొలుపునది, మెళకువగ జీవుల యందుండునది శ్రీమాత అని అర్థము.

ప్రళయమున నున్న సృష్టియందు మొట్టమొదటగ మేల్కొనునది శ్రీమాత. నిద్రవంటి స్థితినుండి ఆమె మేల్కాంచుటయే సృష్టి కారణము. అది నిద్రవంటి స్థితియే గాని నిద్ర కాదు. తనకు తానుగ మేల్కొనును. మేల్కొనిన దగ్గర నుండి కదలిక ప్రారంభమగును. శ్రీమాత కదలిక వలననే కదలుచున్న సృష్టి యేర్పడును. కదలిక ఉన్నంత కాలము సృష్టి యుండును. కదలిక అను పదము నుండే జగత్తు అను పదము పుట్టినది. జగత్తు అనగా జనించుట, గమనమును పొందుట, స్థిరముగ నున్నట్లు గోచరించుట. ఇట్టి సృష్టి జననము, గమనము, స్థిరత్వము శ్రీమాత మేల్కొని యుండుట వలననే. ఆమె మేల్కొనుటయే సృష్టికి కూడ మేలుకొలుపు.

జీవులు నిద్రనుండి మేల్కొనుట కూడ శ్రీమాత అనుగ్రహముననే జరుగును. అనుగ్రహహీనులు, మేలుకొనలేక మత్తుగ పడియుందురు. నిద్రాసక్తులందరూ శ్రీమాత అనుగ్రహమును అంతంత మాత్రముగ పొందువారే. అనుగ్రహము కలవారు నిద్ర నుండి ఉత్సాహముతో మేల్కాంతురు. వారి ముఖములు కూడ ప్రాతః సమయమున తేజో వంతములై యుండును. అనుగ్రహహీనుల ముఖములు ప్రాతః

కాలమున బరువుగ నుండును. నిద్రనుండి ఉత్సాహముగ వేకువ జాముననే మేల్కొనుట యందు ఆసక్తి కలవారు శ్రీమాతను మిక్కుటముగ ప్రార్థించవలెను.

నిద్ర నుండి మేల్కొనుట ఒక యెత్తు. అజ్ఞానము నుండి మేల్కొనుట మరియొక యెత్తు. అజ్ఞానము నుండి జ్ఞానము లోనికి మేల్కొనుటకు కూడ శ్రీమాత అనుగ్రహము ఆవశ్యకమై యున్నది. కేవలము నిద్రనుండి మేల్కొని ఇంకనూ జ్ఞానమున మేల్కొనని జీవులందరూ స్వప్నజీవనమునే జీవించు చుందురు. ఇట్టి స్వప్నము నుండి కూడ మేల్కాంచుట జరిగినపుడు, నిజమగు జాగృతి యందున్నట్లు. ఇట్టి జాగృతిని ప్రసాదించునది శ్రీమాతయే. ఎన్ని విధములుగ చూచిననూ శ్రీమాత అనుగ్రహమే జాగరణ స్థితి కలిగించును. కావున ఆమె జాగరిణి అని కీర్తింపబడుచున్నది.

258 - 263. 'స్వపంతీ, తైజసాత్మికా, సుప్తా, ప్రాజ్ఞాత్మికా, తుర్యా, సర్వావస్థా వివర్జితా'

స్వప్నము, సూక్ష్మలోక తెలివి, నిద్ర మేలుకొనిన స్థితి, అజ్ఞానము నుండి మేలుకొనిన స్థితి అను నాలుగు అవస్థలకు అతీతముగ వుండు నది శ్రీమాత అని అర్థము.

అవస్థలన్నియూ సృష్టి జీవులకే. త్రిగుణములకు లోబడిన వారికే. శ్రీమాత కిట్టి అవస్థలు లేవు. జీవుని అవస్థలు ప్రధానముగ చతుర్విధములని తెలుపుదురు. అందు మొదటిది నిద్ర. రెండవది స్వప్నము. మూడవది మెళకువ. నాలుగవది అజ్ఞానము నుండి మెళకువ. ఈ నాలుగు స్థితుల కన్న పైన నుండునది శ్రీమాత.

1. నిద్రయందు బాహ్యలోకము లేదు. అంతర్లోకము లేదు. జీవునకు ఉండుటయే గాని తానున్నాడని కూడ తెలియదు. దీనిని సుప్తి అందురు. ఇట్టి సుప్తి స్థితి కలిగించునది శ్రీమాత గనుక సుప్తా అందురు.

2. స్వప్నమున జీవుడు మేల్కాంచిననూ అవశుడై యుండును. అది నిద్ర కాదు; మెళకువ కాదు. పూర్ణ జ్ఞానము కాదు. ఏవేవో దృశ్యములు వచ్చి పోవుచుండును. జీవునకు స్వాధీన ముండదు. బాహ్యమున మేల్కాంచినపుడుండు లేశమాత్రపు స్వాధీనము కూడ యుండదు. దుస్వప్నములు, సుస్వప్నములు తమకు తాముగా వచ్చి పోవు చుండును. మేల్కాంచిననూ ఏమియూ చేయలేని స్థితియే.

వృక్షము లిట్లే యుండును. స్వప్నమునందు ఇంద్రియములు కార్యములు చేయకున్నను చేసినట్లు భ్రమ కలుగును. మనసు ప్రాపంచిక అనుభవమును పొందుచుండును. ఇట్లు శరీరము, ఇంద్రియములు పనిచేయక మనసు అవశమై తెగిన గాలిపటము వలె సన్నివేశముల యందు పాల్గొనుట స్వప్నము. స్వప్నానుభూతి ప్రతి మానవునకును అప్పుడప్పుడు కలుగు అవస్థ. ఇది కలిగించునది శ్రీదేవియే.

3. తైజసాత్మిక అనగా ఆత్మల యందు తేజస్సుగ నిండి యున్నది శ్రీదేవి అని అర్థము. శ్రీదేవి అస్థిత్వము కారణముగనే జీవుడు తేజో వంతుడై త్రిగుణములను పొందును. వ్యక్తిగత ప్రజ్ఞ కలిగిన వాడగును. త్రిగుణము లపుడు అతనిని ఆవరించును. తమస్సు అధికముగ ఆవరించినపుడు నిద్ర, తమస్సు నందు కొంత రజస్సు ప్రవేశించి నపుడు స్వప్నము, మెలకువ ఇత్యాదివి కలుగును. రజస్సు పాలు తమస్సులోనుండి పెరుగుచున్నకొలది ప్రజ్ఞ బహిర్ముఖమై విప్పారు చుండును. తైజసాత్మ క్రమముగ ప్రజ్ఞాత్మ అగును. ఈ తేజస్సు పురోగమనమే నిద్ర నుండి, స్వప్నమునుండి జీవుడు మేల్కాంచుటకు కారణము. ఈ తేజస్సు తిరోగమించినపుడు క్రమముగ విశ్రాంతి కోరుట, నిద్రించుట జరుగును.

4. ప్రాజ్ఞాత్మిక అనగా పూర్తిగ ఆత్మయందు విచ్చుకొనిన ప్రజ్ఞగ నున్న శ్రీదేవి. ప్రాజ్ఞుడనగా తెలిసినవాడు. విజ్ఞానవంతుడు, జ్ఞాన వంతుడు, అంతర్లోక బహిర్లోక విషయములు తెలిసినవాడు. ఈ తెలియుట శ్రీమాత సాన్నిధ్యమే. ఒక జీవుని యందు జ్ఞానముగను,

విజ్ఞానముగను శ్రీదేవియే యున్నదని తెలియవలెను. గ్రుడ్డి దీపము నుండి, సూర్యుని వఱకు గల అశేష రూపములలో గల వెలుగు శ్రీదేవి అని తెలియవలెను.

'తుర్యా' అనగా మేల్కొని యుండుట; స్వప్నము నందుండుట, నిద్ర యందుండుట కాక తానుగ జీవుడుండుట. ఇది పూర్ణ జ్ఞాన స్థితి. ఇట్టి వానికి పై మూడు స్థితు లుండవు. కేవల ముండుట యుండును. ఉన్నానని తెలిసి యుండును.

ఇట్టి స్థితులన్నింటినీ వర్జించి పరముగ నిలబడి యుండునది శ్రీదేవి తత్త్వము. పై తెలిపిన మూడు అవస్థలు మరియు తుర్యావస్థ జీవులకే పరిమితము. శ్రీదేవి వీని కతీతము. తురీయావస్థ యందు పరమాత్మ అనుభవము ఉన్ననూ జాగ్రత్ నిద్రావస్థలు కూడ కలుగు చుండును. తురీయావస్థ సిద్ధించిన యోగులు, సిద్ధులు కూడ అపుడపుడూ నిద్రించుట, మేల్కాంచుట యున్నది. పరమాత్మ అనుభవము కూడ యుండును. శ్రీదేవి పరమాత్మైక, పరదేవత ఆమెకు అనుభవించుట అను స్థితి లేదు. ఆమె అన్ని అవస్థలకు అతీతమైనది. కావున ఆమెను సర్వావస్థా వివర్జితా అని కీర్తింతురు.

'వర్జిత' అను పదము మాత్రమే వాడినచో స్వప్నాది అవస్థ లన్నియు విసర్జించునది అని భావము కలుగును. 'వివర్జిత' అను పదము వాడుటలో అచట అన్నిటియందు శ్రీదేవి నిండియున్నను, వాటికి అతీతముగను గూడ నున్నదని అర్థము. ఏక కాలమున అవస్థలయందు, వాని కతీతముగ నుండుట ఆమె మహిమ.

264. 'సృష్టికర్త్రీ'

(సృష్టించుట వివిధాంశములుగ గోచరించును. పంచకృత్యము లుగ అవి అగుపడును. వీని నిపుడు హయగ్రీవుడు బోధించు చున్నాడు.)

సృష్టి నిర్మాణము చేయునది శ్రీదేవి అని అర్థము.

సృష్టి నిర్మాణము పంచకృత్యములు- ఐదు విధములు. సృష్టించుట, రక్షించుట, అవరోధములను నిర్మూలించుట, వృద్ధి చేయుట, తనలోనికి మరల లయ మొనర్చుకొనుట. ఈ కార్యములు చేయుటకు శ్రీదేవియే బ్రహ్మ, విష్ణు, రుద్ర రూపములను ధరించును. అందులకే ఆమె బ్రాహ్మీ, వైష్ణవీ, రుద్రాణి అని పిలువబడుచున్నది. సృష్టి కామె ఈశ్వరి కనుక ఈశ్వరీ అని పిలువబడుచున్నది. సృష్టి యందు వ్యాపించియుండును గనుక సదాశివా అని పిలువబడు చున్నది. జీవులను అనుగ్రహించును గనుక అనుగ్రహదా అని పిలువ బడుచున్నది. ఈ తెలిపిన నామములన్నియూ ఇటుపై వివరింప బడును.

సృష్టి నిర్వహణమున శ్రీమాత ప్రధాన నిర్వహణాధికారి. ఆమెయే సృష్టికర్త్రీ.

265. 'బ్రహ్మరూపా'

బ్రహ్మ రూపమున వెలుగొందునది శ్రీమాత అని అర్థము.

సృష్టి అంతయూ చతుర్ముఖ బ్రహ్మ నుండియే వెలువడును. అతడు గోచరించు సృష్టికర్త. నిజమునకు శ్రీమాతయే అతని రూపముగ వెలసి అతని యందు తానే సృష్టి నిర్మాణ చైతన్యముగ నిలచి, సృష్టి గావించుచున్నది. బ్రహ్మ విష్ణు రుద్రులు అను రూపములు ఆమె తన వాహికలుగ నేర్పరచుకున్న రూపములు. ఆయా రూపముల నేర్పరచి వాని నుండి తానే కర్తవ్యమును నిర్వర్తించును. చతుర్ముఖ బ్రహ్మ చతుర్వ్యూహములను నిర్మించును. చతుర్వ్యూహములలోనికి పరదేవతయైన శ్రీమాత వాసుదేవ సంకర్షణ వ్యూహములుగ దిగి వచ్చును. నాలుగు వ్యూహములు, నాలుగు వేదములు, నాలుగు విధములుగ వాక్కు, నాలుగు పాదములుగ ధర్మము, నాలుగు సంస్కారములుగ వర్ణములు, నాలుగు ఆశ్రమములు, నాలుగు యుగములు, నలుగురు కుమారులుగ చతుర్ముఖ బ్రహ్మ నుండి శ్రీదేవియే సృష్టి నిర్మాణము గావించుచున్నది. ఈ నాలుగే మూడు గుంపులుగను, ఆరు గుంపులుగను, పది గుంపులుగను ఏర్పడును. ఇది యొక ప్రత్యేక సృష్టి జ్ఞానము.

266. 'గోప్త్రీ'

గోప్యముగలది శ్రీమాత అని అర్థము.

సమస్త వ్యూహములను, ధర్మములను, సంస్కారములను, వాక్కును, నిర్వర్తించు చున్ననూ శ్రీమాత గోప్యముగనే నుండును. ఆమె సంరక్షణము కూడ గోప్యముగనే యుండును. సున్నితము సూక్ష్మము అయి వుండును. జీవుల యందు ఆమె చేతనయే వర్తించు చున్నను జీవులా చేతనను చూడరు. స్వభావమును, కదలికలను మాత్రమే చూతురు. కావున ఎంత తెలిపిననూ జీవులకు మరుపే కలుగుచుండును. అణువణువునందు ప్రాణుల యందు వర్ణించలేని వైవిధ్యముతో నర్తించుచున్న ఆమెను చేతనగ ఎవరు దర్శింపగలరు? ప్రాణస్పందనగ ఎవరు దర్శింపగలరు? నామము, రూపము, ప్రవర్తనయే దర్శింతురు. రూపము కూడ ఆమెయే అయిననూ దర్శింప లేరు. ఇంతకన్నా విచిత్ర మేమున్నది? ఇతరులు మాటాడినపుడు వాక్కును దర్శింతుమా! భాషను, భావమును దర్శింతుము. కనుకనే శ్రీదేవి ఇట్లు పలుకును. "నన్ను చూచుచునే చూడరు. నన్ను వినుచునే వినరు. *ఉతత్వః పశ్యన్ నదదర్శ వాచమ్ ఉతత్వశృణ్వాన్ నశృణోతి యేనామ్.*"

శ్రీదేవి పై విధముగ కనబడుచున్ననూ, వినబడుచున్ననూ, కనబడక వినబడుచున్ననూ వినబడక రహస్యముగ నున్నది.

267. 'గోవిందరూపిణీ'

రక్షించు గుణముతో కూడిన విష్ణురూపము కలది శ్రీదేవి అని అర్థము.

రక్షణము శ్రీదేవి రెండవ కృత్యము. మొదటి కృత్యము సృజనము. హరివంశము నందు నారదుడు ఇట్లు పలికెను. "ప్రకృతి యొక్క రెండవ తత్త్వము సర్వమయుడు. సర్వవ్యాప్తియైన విష్ణువు. విష్ణువు లోక రక్షకుడు, స్త్రీ సంజ్ఞ గలవాడు. ఇదియే శ్రీమాత జగన్మోహిని లేక జగన్మోహన రూపము. రక్షకుడు గనుక గో శబ్దము అతనికే తగినది. పూర్వము భూమిని నశింపజేయుటకు అసుర శక్తులు ప్రయత్నింపగ శ్రీమాత విష్ణురూపమున భూమిని రక్షించెను. అపుడు దేవతలు విష్ణురూపిణియైన శ్రీమాతను గోవిందరూపిణి అని స్తుతించిరి.

గాం + విందతి – గోవింద అయినది. 'గాం' అనగా భూమి. భూమిని రక్షించిన శక్తి అని గోవింద పదమున కర్థము. గో అనిననూ భూమియే. భూమి, గోవు, ఇంద్రియములు, సూర్య కిరణములు వీటన్నిటిని గో శబ్దముతో పిలుతురు. స్రవించునవి అన్నియూ గోవులే. ఇట్టివాని నన్నింటినీ రక్షించువాడు గోవిందుడు. మన శరీరము భూమి వంటిది గావున గోవు. వానిని నడిపించు ఇంద్రియములు గోవులు. ఇంద్రియానుభవము వలన స్రవించు ఆనందము గోవు. మన యందలి గ్రంథులు గోవులు. అవి స్రవించినపుడే ఉత్తమ మగు ఆనందము కలుగును. ఇట్లు రసానుభూతి, రక్షణము నిచ్చు తత్త్వముగ గోవింద తత్త్వమున్నది. గోవింద రూపిణిగ యున్నది శ్రీదేవియే.

268, 269, 270.
'సంహారిణీ రుద్రరూపా తిరోధానకరి'

సృష్టి తిరోధాన కార్యమును నిర్వర్తించుటకు రుద్రరూపము దాల్చి సంహారము చేయునది శ్రీమాత అని అర్థము.

రుద్రుడు దుఃఖములను తరుమువాడు. అజ్ఞానమును దహించు వాడు. అగ్ని స్వరూపుడు. రుద్ అనగా దుఃఖము. దుఃఖమును హరించువాడు గనుక రుద్రు డనబడుచున్నాడు. సృష్టి ప్రారంభమున చతుర్ముఖ బ్రహ్మ, సృష్టించుటకు తన మానసపుత్రుల సహకారమును కోరగా వారు సున్నితముగా అది తమపని కాదనిరి. అపుడు బ్రహ్మ దేవునకు దుఃఖము కలిగెను.

భాగవత పురాణమున బ్రహ్మదేవునకు కుమారుల సహాయ నిరాకరణము కోపము కలిగించినదని, ఆ రౌద్రము ఆధారముగ రుద్రుడు దిగివచ్చెనని చెప్పబడినది. రుద్రుడు రౌద్రుడే కాదు; రోదనము (దుఃఖము) గూడ పోగొట్టువాడు. అందువలన ఈ విధమైన వ్యాఖ్యా నము గూడ దేవీ భాగవతమున అందించబడినది.

బ్రహ్మ దుఃఖమును పోగొట్టుటకై ఫాల భాగమునుండి రుద్రు డుదయించి ఏకాదశ రుద్రులుగ మారి చీకటులను తొలగించి అంతరిక్షము నేర్పరచెను. అవరోధము లేని శక్తి రుద్ర శక్తి. అట్టి శక్తి

రూపమును దాల్చునది శ్రీమాతయే. సృష్టి యందవరోధము లేర్పడినపుడు, అసుర శక్తులు విజృంభించినపుడు, పెనుమార్పులు అవసరమైనపుడు శ్రీమాతయే రుద్రరూపమును దాల్చి కావ్యములను చక్కబెట్టును.

సృష్టిని తనలోనికి లయము చేసుకొనుట తిరోధానము. ఇట్టి తిరోధానమునకు రౌద్రము, రుద్ర రూపము అవసరము. అట్టి రూపమును ధరించి ప్రళయకాల రుద్రునివలె సృష్టిని ప్రళయములోనికి నడుపునది శ్రీదేవి.

జీవులు జన్మించినపుడు, జన్మించుట ఆకారము లేర్పరచు కొనుట అటుపైన వృద్ధి చెందుట తమ తమ పరిధులలో వ్యాపించుట బ్రహ్మ విష్ణు తత్త్వములు కాగ, వ్యాప్తిని ఉపసంహరించుట, శరీరమును క్రమముగ నశింపజేయుట, శరీరమునకు మరణము కలిగించుటగ రుద్రశక్తి పనిచేయును. జీవన ప్రయోజనము నెరవేరకయే తిరోధానము జరిగినచో జీవుడు వైఫల్యము చెందును. కావున జ్ఞానము పొందునంత వఱకు జీవితము పండునంత వఱకు మృత్యువును కలిగించ వద్దని రుద్రుని ప్రార్థించు ఆచారము ఏర్పడినది.

271. 'ఈశ్వరీ'

సత్త్వగుణ ప్రధానమై సర్వస్వతంత్రయై సర్వ అధికారిణియై యుండునది శ్రీమాత అని అర్థము.

ఈశ్వరుడనగా స్వామి, సర్వస్వతంత్రుడు. కర్తవ్యము, కర్తృత్వము లేనివాడు. ఇచ్ఛా, క్రియలు కూడ లేనివాడు. శుద్ధ సత్త్వమైన చైతన్యము. మాయచేత కూడ బంధింపబడనివాడు. జీవులకు శరణ్యమైనవాడు. దేవాసుర భావముల కతీతుడు.

జగదీశ్వరి శ్రీమాత. ఆమెయందీ గుణము లన్నియూ ప్రస్ఫుటముగ గోచరించును. జగదీశ్వరుని యందు కూడ ఈ గుణములు గోచరించును. సిద్ధులు, ఋషులు, యోగులు కోరునదీ స్థితియే. వ్యక్తిగత కర్మను దగ్ధము కావించుకొని సత్త్వగుణ ప్రధానులై నిత్య సత్యమందు నిలచి దివ్య ప్రణాళికయందు తమ కర్తవ్యమును స్వచ్ఛందముగా నిర్వర్తించువారు నిజమగు సిద్ధులు, యోగులు. ఇట్టి వారికి కర్తృత్వము లేదు. గనుక కర్మలేదు. కర్మబంధము లేదు గనుక స్వతంత్రులు. వీరి ఇచ్ఛా క్రియలన్నియూ దైవ ప్రేరితములే. ఇట్టి వారిని కూడ ఈశ్వరులని (మాస్టర్స్) అని పిలుతురు. ఇట్టి యోగీశ్వరు లకు, యోగేశ్వరియైన శ్రీమాతకు భేదమున్నది. అట్లే ఇట్టి యోగీశ్వరు లకు యోగేశ్వరుడైన శ్రీకృష్ణునకు (లేక శ్రీ మహావిష్ణువునకు) భేదమున్నది. యోగేశ్వరీ యోగేశ్వరుల అధీనమున మాయ ఉన్నది.

కానీ యోగీశ్వరులగు సిద్ధులు, యోగులు దైవ మాయకు బద్ధులే. సనక సనందనాదులు, నారములు, త్రిమూర్తులు కూడ మాయనబడిన సందర్భము లున్నవి. ఇక ఇతరుల విషయము చెప్పనేల?

మాయా స్వరూపమును దాటియుండునది శుద్ధ చైతన్యమూర్తి యగు శ్రీదేవియే. గోవిందుని రూపమున నున్నది కూడ ఆమెయే. మాయ వారి కనుసన్నలలో మెలగుచుండును. ప్రళయమందుకూడ మాయ విశ్రాంతి గొనుచు నుండునేగాని నశింపదని భాగవత పురాణము తెలుపుచున్నది. కావున ఈశ్వరీ ఈశ్వర పదములు త్రిగుణాతీత శుద్ధ సత్త్వమునకు మాత్రమే ఆపాదింపదగును.

272. 'సదాశివా'

విస్తారమగు సృష్టియం దంతట అన్నిట సత్త్వ ప్రధానముగ నిండియుండునది శ్రీమాత అని అర్థము.

సృష్టి కతీతముగ శుద్ధ సత్త్వరూపమున ఈశ్వరిగ నున్న శ్రీమాత సృష్టియందు అంతట అన్నిట సత్త్వగుణముతో భాసించును. సృష్టి కతీతముగ నున్న తత్త్వము ఈశ్వరి కాగా సృష్టియందిమిడియున్న శ్రీమాత సదాశివా అయి వున్నది. శివపరముగ తెలిపినపుడు ఈశ్వరుడు సదాశివుడుగ జీవుల యందున్నాడందురు. విష్ణుపరముగ తెలిపినపుడు శ్రీ మహావిష్ణువు వాసుదేవ రూపమున జీవులయందున్నా డందురు. వాసుదేవ, సదాశివ, సదాశివా అను పదములు పర్యాయ పదములు.

భగవంతు డెచ్చటో నున్నాడని భావింప పనిలేదు. మనయందు, మన పరిసరముల యందు సత్త్వగుణముగ ప్రకాశించు చున్నాడు. మనయందు సత్త్వగుణమును పెంపొందించుకొనుట వలన భగవత్ సాన్నిధ్యము పెరుగును. మనయందలి సదాశివా లేక వాసుదేవ తత్త్వములను దర్శించుటకు సత్త్వగుణము నుపాసింపవలెను. సత్త్వగుణమును ఇరువది యారు సద్గుణములుగ దైవాసుర సంపత్తి యోగము అను అధ్యాయమున భగవద్గీతలో తెలుపబడినది. వీనిని క్రమముగ నుపాసించుట యొక పద్ధతి. సత్త్వగుణ ప్రధానులగు

సజ్జనులను ఆశ్రయించి వారి సాంగత్యముతో జీవించుట మరియొక పద్ధతి. దీని కొఱకే సద్గురు సమాశ్రయనము. వాసుదేవ సాన్నిధ్యము నకు ఇది యొక్కటియే మార్గమని భగవద్గీత, భాగవత పురాణము బోధించుచున్నవి.

సద్గుణముల ఉపాసన ద్వారా రజస్తమస్సులను సమన్వయించు కొని సత్త్వగుణమును చేరినవాడు తనయందలి దైవమునకు సమీప మగును. అటుపైన తనయందలి దైవమును చూచుట యుండును. ఆపైన ఆ దైవమును చేరుట యుండును. అందు క్రమముగ ఐక్యము చెందుట యుండును. ఇట్లు జీవుల ననుగ్రహించుటకే జీవుల యందు దైవము సదాశివాగా వెలసియున్నది.

273. 'అనుగ్రహదా'

అనుగ్రహ మొసగునది శ్రీమాత అని అర్థము. అర్హతతో సంబంధములేక, ఎట్టి కారణము లేక ఇతరులకు శ్రేయస్సు కలిగించుట అనుగ్రహము. శ్రీదేవి అనుగ్రహ మట్టిది.

సృష్టించుట, పునః సృష్టి చేయుట, మరల మరల విస్తారమగు సృష్టికార్యమును నిర్వర్తించుట శ్రీమాత తన కొఱకు కాక, జీవుల కొఱకే చేయుచున్నది. చేయవలెనని నిర్బంధము లేదు. ఆమె నెవరునూ శాసించనూ లేరు. కేవలము జీవులు అనుభవము, అనుభూతి, పరిపూర్ణతలను పొందుటకొఱకే బహు విస్తారమైన సృష్టి నిర్మాణము చేయుచు నుండును. ఇది కేవలము అనుగ్రహమే.

జీవులను నిద్రనుండి మేల్కొలుపుట, నిద్రనొసగుట ఆమె అనుగ్రహమే. జీవులకు ఇచ్ఛా, జ్ఞాన క్రియల నొసగుట ఆమె అనుగ్రహమే. భావనలు కలుగుట, భాషణ చేయుట ఆమె అనుగ్రహమే. పంచేంద్రియములు, మనసు, శరీరము మానవుల కొసగుట ఆమె అనుగ్రహమే. విచక్షణను, వైరాగ్యమును, సద్బుద్ధిని, సాన్నిధ్యమును ఇచ్చుట ఆమె అనుగ్రహమే. పంచభూతాదులు, గ్రహగోళాదులు, దేవతలు, అంతరిక్ష దేవతలు, దిక్పాలకులు వారి వారి ధర్మములను ఆమె ఆధారముగనే నిర్వర్తించుచున్నారు. ప్రాణుల యందు ప్రాణ ప్రవృత్తులుగా వర్తించునది, నర్తించునది శ్రీమాతయే. ఆమె

అనుగ్రహము లేనిదే క్షణమైన గడవదు. కాని జీవులహంకారులై దీనిని గుర్తించరు. గుర్తింపకున్ననూ ధిక్కరించిననూ కృతఘ్నత చూపిననూ అట్టివారియందు శ్రీమాత తన సాన్నిధ్యము నిచ్చుచున్నది. ఇంతకు మించిన అనుగ్రహము లేదు. 'అనుగ్రహదా' అను నామ మామెకే చెందినది. రక్షించుటతో పాటు శిక్షించుటతో కూడ జీవులను అనుగ్రహించుచునే యుండును. ఆమె శిక్షించుట కర్మ క్షాళనము కొఱకే.

274. 'పంచకృత్య పరాయణా'

పంచకృత్యములు సదా నిర్వర్తించుటయందు నిమగ్నమై యుండునది శ్రీదేవి అని అర్థము.

పంచకృత్య పరాయణా అను అష్టాక్షరీ నామమునందు పరాయణత్వము ప్రధానమైన భావము. పరాయణ మనగా అభీష్టము. హెచ్చు తగ్గులు లేని ఒకే రకమగు యిష్టము. పారాయణము అను పదమునకు కూడ అర్థమిదియే. ఒకే రకమగు యిష్టముతో శాశ్వతముగ పనులు చేయుట పరాయణత్వ మగును. ఇష్టమున్నప్పుడే యిది జరుగగలదు. ఇష్టములు అయిష్టము లాధారముగ మానవుల పనుల యందు శ్రద్ధ, అశ్రద్ధ గోచరించును. ఇష్టమున్న చోట శ్రద్ధ యుండును. ఇష్టము నందు బలవంత ముండదు. తప్పక చేయుట అను భావ ముండదు. "చేయవలెను కదా! కర్తవ్యము కదా!" అను బరువగు భావము లుండవు. ఇష్టము కనుక చేయుట యుండును. ఇష్టము గనుక కష్ట మనిపించదు. ఈ యిష్ట మేర్పడుటకు కారణ ముండదు.

పిల్లవాడు ఆడుకొనుట, పెద్దలు మాట్లాడుకొనుట చేయుదురు. ఎందుకని ప్రశ్నించిన సమాధాన ముండదు. తీపి యిష్టమైన వానిని నీకు తీపి ఎందులకు యిష్టమని ప్రశ్నించినచో సమాధాన ముండదు. కావున యిష్ట మకారణ మగుచున్నది. నిష్కారణ మగుచున్నది. దీనినే పరమ ప్రేమ అందురు. కారణముండి యిష్టపడినపుడు అది పరమ ప్రేమ కాదు. "ఇందు వలన నాకిష్టము", "అందువలన నాకిష్టము"

అను సమాధాన మున్నచోట కారణమున్నది. సామాన్యముగ జీవు లందరూ కార్యకారణ సంబంధముగనే యిష్టపడుచుందురు. ఇది లౌకికము. దీనియం దిమిడియున్న వారు అన్నిటికినీ కారణములు వెతుకుచుందురు. సతమత మగుచుందురు.

మహాత్ముల కార్యములు ఎక్కువగ నిష్కారణములై యుండును. అవి లౌకికుల కంతు పట్టవు. శ్రీమాత యిష్టమును గూర్చి, తర్కించుట వ్యర్థము. ఆమె మహాత్ములకు, త్రిమూర్తులకు కూడ గమ్యము. ఆమె నిరంతరము పంచకృత్యముల యందు యిష్టపడి యుండును.

సృష్టించుట, వృద్ధిచేయుట, రక్షించుట, అనుగ్రహించుట, సృష్టిని తనలోనికి తిరోధాన మొనర్చుట అను ఐదు విధములగు కార్యములను నిర్వర్తించుట యందు పరాయణయై యుండునని ముందు నామములలో తెలుపబడినది. ఈ కృత్యములు నిర్వర్తించుట యందు ఆమె తత్పరయై యుండును. పరమానందము పొందు చుండును. గంపెడు పసిపిల్లలుగల తల్లి పిల్లలందరిని అహర్నిశలు ప్రేమతో పెంచుచుండును. ఆమెకు చాకిరి అనిపించదు. చూచు వారికి మాత్రము చాల చాకిరి చేయుచున్నట్లు భావన కలుగును. మహాత్ములు కూడ యిట్లే అహర్నిశలు జీవుల శ్రేయస్సు కొఱకు తమ జీవితమును సమర్పింతురు. చూచు వారి కది ప్రారబ్ధమువలె గోచరించును. ఇష్టపడి చేయుటకు, తప్పక చేయుటకు తేడా యున్నది. మహాత్ములు నిష్కారణులై జీవుల శ్రేయస్సు కొఱకు అహర్నిశలు పాటు పడుచుందురు. వారికి పరాకాష్ఠ శ్రీదేవి. ఆమె అభీష్టమును కూర్చి తర్కింపలేము.

275. 'భానుమండల మధ్యస్థా'

సవిత్రు మండల మధ్యమున స్థిరముగొన్నది శ్రీమాత అని అర్థము.

సూర్యున కాధారము సవిత. పంద్రెండు సూర్యమండలముల కిది కేంద్రము. సూర్యుడు ఒక సౌర మండలమునకు కేంద్రము కాగా, అట్టి సూర్యులు పంద్రెండు మందికి కేంద్రముగ సవిత అను దేవత యున్నది. అట్టి సవితృమండలమునకు కేంద్రముగ భర్గోదేవు డున్నాడు. భర్గోదేవు డనగా ప్రచండమై, సృష్టి కాధారమై, పరము నుండి పుట్టిన వెలుగు. ఈ వెలుగే శ్రీమాత.

భాను అను పదమునకు మూలార్థము వెలుగుగ ప్రకటింప బడినది అని అర్థము. చీకటినుండి ప్రప్రథమముగ వెలువడిన వెలుగే శ్రీమాత. ఆ వెలుగు ఆధారముగనే భర్గోదేవ మండలము, సవిత్రు మండలము, సూర్యమండలము ఒక దాని నుండి ఒకటి ఏర్పడు చున్నవి. నాలుగు స్థితులలో వెలుగు అవతరించు చున్నది. ఈ వెలుగును దర్శించుటకే గాయత్రి ఉపాసనము.

శ్రీదేవి సృష్టి కేంద్రము. ఆమె ఆధారముగనే భర్గోదేవుడు జన్మించును. ఆదిత్య మండల మేర్పడును. ఆదిత్య మండలము నుండి సవిత్రు మండలము, సవిత్రు మండలము నుండి సూర్యమండలములు గుంపులు గుంపులుగ పుట్టుకొని వచ్చును. ఇట్లవరోహణ క్రమమున

అంతయూ ఏర్పడుచుండగ అన్నిటియందు కేంద్రముగ శ్రీదేవి అవతరించుచుండును. ఇది ఆమె సదాశివ తత్త్వమని, వాసుదేవ తత్త్వమని తెలుపబడినది. అన్నిటియందు అంతర్యామిగ ఈ తత్త్వమే యుండును. అణువునందు అణుకేంద్రముగను, బ్రహ్మాండమునందు బిందువుగను తానుండి సృష్టి స్థితి లయములను కలిగించుచుండును.

ఆదిత్య హృదయము అనగా కూడా నిదియే. అగస్త్య మహర్షి శ్రీరాముని కందించిన అంతర్యామి ఉపదేశమిది. నారదుడు ధృవునకు, వ్యాసునకు, ప్రహ్లాదునకు బోధించిన వాసుదేవ తత్త్వ మిదియే. రాముని సర్వాంతర్యామిగ వాల్మీకి కూడా నిదియే బోధించి నాడు. భగవద్గీత యందు శ్రీకృష్ణుడు అర్జునునికి "వాసుదేవ మితి సర్వం" అని బోధించినాడు. ఇట్లు ప్రకాశించు ప్రతి అణువు మధ్యమున, బ్రహ్మాండ మధ్యమున స్థితిగొన్నది శ్రీమాత.

276. 'భైరవీ'

పండ్రెండు సంవత్సరముల వయస్సు గల కన్యగ గోచరించు నది శ్రీమాత అని అర్థము.

భైరవ శబ్దము త్రిమూర్త్యాత్మక శబ్దమని ముందు నామములలో తెలుపబడినది భ, ర, వ వరుసగ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సంకేతించు శబ్దములు. భైరవి అనగా ఈ మూడు తత్త్వములు తానై యున్నది. తానే మూడైనది. మూడు మరల తానొకటిగ కాగలదు. మూడిటిని ఏర్పరచి వారికి కేంద్రముగ కూడ నిలబడగలదు. కావున ఈ విధముగ భైరవి నామము శ్రీపరముగను, భైరవ నామము శివ పరముగను తెలుపుదురు.

భైరవుని భార్య గనుక భైరవి అని కూడ అందురు.

భీరువుల గుంపును కూడ భైరవి అందురు. భీరువులైన కన్యల గుంపు భైరవి అని మరియొక అర్థము. పండ్రెండు సంవత్సరముల వయస్సు గల కన్యలు భీరువులై యుందురని పెద్దలు తెలుపుదురు. వారి చిత్తములు ఇంకను కామ ప్రేరితములు కాక యుండును. ఇట్టి కన్యలు అత్యంత పవిత్రులు. పవిత్రతకు పూర్ణరూపములై వారు వెలుగొందుదురు. పురాణములందు పార్వతి, అరుంధతి అనసూయ, శుచి, గౌరి, ఉమ నామములు భైరవ గుంపుగ తెలుపుదురు.

క్లుప్తముగ కన్యా తత్త్వమునకు భైరవి పదమును వాడుదురు. నిజమగు ఆనందమునకు మనస్సు ఈ స్థితిని మరల పొందవలెనని యోగవిద్య సూచించును. సత్యకామము, ధర్మకామము తప్ప ఇతర కామములు ఈ స్థితి చేరిన వారి నంటవు. ఇట్టి వారిని కన్యాపుత్రు లందురు. వీరి యందు దివ్యత్వము ప్రతిబింబించును.

భైరవ తంత్రము ద్వారా తాంత్రికులు ఈ స్థితిని పొందుటకు ప్రయత్నింతురు. సాత్త్వికులు సత్త్వగుణము నాశ్రయించి ఈ స్థితిని పొందుదురు. మార్గమేదైననూ శ్రీదేవి తత్త్వము తనయందు నిత్యము ప్రతిబింబించుటే జీవుల గమ్యము.

277. 'భగమాలినీ'

భగములు మాలికగ ఏర్పరచి ధరించునది శ్రీదేవి అని అర్థము.

'భ' అనగా వెలుగు. 'గ' అనగా గతి, వ్యాపకశక్తి. శ్రీదేవి తన వెలుగును వ్యాప్తి చేయుటకు, బిందువుగ నున్న తాను త్రికోణముగ ఏర్పడును. భగ శబ్దమునకు మూలార్థమిది. భగవంతుడు, భగవతి, అని శివ పరముగను, శ్రీ పరముగను, వ్యాపించుచు అవతరించుచు అంతర్యామియై చరించుచు నున్న తత్త్వమును భగవత్ తత్త్వమందురు. దీనిని గూర్చి తెలుపునదియే భాగవతము. అది దేవీ భాగవతముగ నున్నది. కృష్ణపరముగ శ్రీమద్భాగవతముగ నున్నది. ఇందు దైవము లీలలు వివరింపబడుట ప్రధానముగ నుండును.

త్రికోణములుగ వ్యాప్తిచెందుట వలన, వానిని తాను ధరించి యుండుట వలన భగమాలిని అను నామము కలిగినది. ఏడు లోకములు ఏడు త్రికోణములు. వీనిని ధరించి యున్నది భగవత్ తత్త్వము. త్రిస్సప్తగ (3 × 7) సృష్టి నిర్మాణము జరిగినదని, నవావరణలుగ తొమ్మిది త్రికోణములతో సృష్టి నిర్మాణము జరిగినదని, పంక్తిగ 5 త్రికోణములుగ సృష్టి నిర్మాణము జరిగినదని అనేక విధములుగ ఋషులు సృష్టి నిర్మాణమును దర్శించిరి. అన్నిటికీ మూలము త్రికోణమే, త్రికోణమే సృష్టికాధారము.

తంత్రమున ఈ త్రికోణమును స్త్రీయోనిగ కూడ భావించి, పూజింతురు. స్త్రీ యోని అను భావముకన్న త్రిభుజ, త్రికోణము అన్న భావము కలియుగమున శ్రేయస్కరము. త్రికోణ మెచ్చట గోచరించిననూ పూజ్య భావము కలుగుట ఉపాసకునికి శుభప్రదము. త్రికోణములను ప్రతి కార్యమునందు గుర్తించుట దర్శన విద్య. కనపడు ప్రతి కార్యమునందు కనపడక త్రికోణ కార్యమున్నది. వినబడు వైఖరి వాక్కునకు ఆధారముగ వినబడని పరా పశ్యంతి మధ్యమ వాక్కు లున్నవి. కనబడు ప్రతి దృశ్యమునకు వెనుక చూడబడుట, చూచుట, చూచుశక్తి యున్నవి. మనము చేయు ప్రతి పనికి వెనుక సంకల్పము నిర్వర్తించు జ్ఞానము, క్రియ వున్నవి. కనబడుచున్న సష్టికి వెనుక క్రియాశక్తి, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి యున్నవి.

వెలుగు అవరోహణము చెందుచూ సూక్ష్మము నుండి స్థూలమునకు త్రికోణాత్మకముగ దిగివచ్చును. మరల ఆరోహణము చేయుటకు త్రికోణములను సమన్వయించుకొని కేంద్రమును జేరుటయే మార్గము. అందులకే శ్రీ చక్రమున త్రికోణములు అధో ముఖముగను, ఊర్ధ్వముఖముగను ఏర్పరచబడినవి.

భగమాలిని నామము శ్రీచక్రమునే సూచించును. శ్రీచక్రము సృష్టి నిర్మాణమును సూచించును. అందన్నియూ త్రికోణములే గోచరించును.

278. 'పద్మాసనా'

పద్మము ఆసనముగా గలది శ్రీదేవి అని అర్థము.

పద్మము సృష్టి చిహ్నము. సృష్టివలె పొరలు పొరలుగా విచ్చుకొనునది. పద్మ దళములు ప్రకృతి మయములు. పద్మనాళము జ్ఞానమయ నాళము. ఈ నాళము బురద యగు భౌతిక సృష్టి నుండి పరతత్త్వమందుకొనుడు సత్యలోక స్థితి వఱకు వ్యాపించి యుండును. పద్మనాళము బ్రహ్మరంధ్రము వంటిది. దళముల అరలు, పొరలు వివిధలోకములై విప్పారును. దళముల యందలి కాంతి శుద్ధ చైతన్యము. పద్మముగా వ్యాప్తి చెందునది పరతత్త్వము. దళము లన్నియూ నాళముతో సంబంధము కలిగియుండుట సృష్టి యందలి ఏకత్వమును, ఐక్యతను, యోగస్థితిని సూచించును. ఈ సృష్టియను పద్మమును అధిష్ఠించి యుండు చైతన్య స్వరూపిణి శ్రీమాత గనుక ఆమెయే పద్మాసనా. చతుర్ముఖ బ్రహ్మ సృష్టికర్త అగుటచే అతడు కూడ పద్మమున ఆసీనుడైనట్లు పురాణములు తెలుపుచున్నవి. అతడు ప్రత్యక్ష సృష్టికర్త. శ్రీమాత పరోక్ష సృష్టికర్త. మానవుల యందు కూడా వివిధ లోకము లున్నవి. ఎన్ని లోకములు గలవో అన్ని పద్మములు కూడ ఏర్పడగలవు. పూర్ణ పురుషులయందు పద్మము లన్నియూ వికసించి యుండును. వారు వికసించిన ముఖపద్మము కలిగి యుందురు. ఇతరులకు పద్మములు వికసింపక చక్రములవలె

యుండును. అన్ని లోకములయందు అన్ని పద్మముల యందు ఆసీనురాలై యుండునది శ్రీమాతయే. ఆమె అనుగ్రహముననే చక్రములు పద్మములుగ విచ్చుకొనును.

సహస్రార దళ పద్మమున పరమ శివునితో కూడియున్న శ్రీమాత జీవుల కొఱకు జీవ సృష్టిని గావించి తానే సహస్రారము నుండి ఆజ్ఞకు, అచ్చట నుండి విశుద్ధి కేంద్రమునకు, అటు తరువాత వెన్నెముక ద్వారా మూలాధారమునకు చేరును. శ్రీమాత మూలాధారమును చేరుటయే భౌతిక సృష్టికి ఆధారము. ఆమె 'మూలాధారైక నిలయ'. జీవుని యొక్క పరిణామమును బట్టి మూలాధారము నుండి మరల తిరుగు ప్రయాణము ఊర్ధ్వగతిగ చేయును.

కుండలినివలె చుట్టలు చుట్టుకొనిన శ్రీమాత ఊర్ధ్వగతి చెందుటకు సంకల్పించినపుడు జీవుడు సాధన మార్గమును బట్టును. అతని సాధన యందలి శ్రద్ధా భక్తులను బట్టి శ్రీమాత ఊర్ధ్వముగ వ్యాప్తిచెందుచు షట్ పద్మముల నధిష్ఠించును. జీవుడు పరిపూర్ణుడై నపుడు సహస్రారమును చేరి శివునితో యోగించును. ఆమె ననుసరించుచు జీవుడు కూడ పరమును చేరును. ఇట్లు పద్మము నందాసీనమైన సర్వమును నిర్వహించు చున్నది శ్రీమాత.

పద్మాసన యగు శ్రీమాతను ఆరాధించినచో దుఃఖములు తొలగును. భాగ్యమును పొందును. దేహము, గృహము స్వర్ణమయ మగును. స్త్రీ సహకారము పరిపూర్ణముగ నుండును. సుఖములతో

కూడిన దైవయోగ ముందును. పద్మము ఆసనముగా గల శ్రీమాత సర్వ శుభంకరి అని ఎఱుగవలెను.

పద్మము అతి విస్తారమైన సంకేతము. ఇతర నామములలో మరికొంత వివరింపబడును.

279. 'భగవతీ'

వర్ణింపరాని మాహాత్మ్యము కలది శ్రీమాత అని అర్థము.

భగమనగా ఐశ్వర్యము, జ్ఞానము, వైరాగ్యము, త్రికోణము (స్త్రీ యోని), యశస్సు, వీర్యము, క్రియాశక్తి, ఇచ్ఛా, ధర్మము, శ్రీ, ముక్తస్థితి, దేవతలచే పూజింపబడుట, దేవతలను కూడ అనుగ్రహించు శక్తి. ఇట్టి మహిమలు గలది శ్రీమాతయే.

సృష్టి, ప్రళయము, జీవకోట్ల గమనాగమనములు, విద్య అవిద్యల తత్త్వము తెలిసివుండుట వలన కూడ భగవతి అని పిలుతురు. భగవంతుడు భగవతి సర్వాధికారము గల వారికే వర్తించును. ఇట్టి వారిని సృష్టియందు మరి యే శక్తి అధిగమించలేదు.

పై తెలిపిన విశేష గుణములన్నీ వివిధ నామములలో మరల వివరింపబడును గనుక ప్రత్యేకముగ నిచ్చట వివరింప నవసరము లేదు.

280. 'పద్మనాభ సహోదరీ'

పద్మనాభుని తోబుట్టువు శ్రీమాత అని అర్థము. పద్మనాభు డనగా నాభి నుండి పద్మము నుత్పత్తి చేసినవాడు. సృష్టికర్తకు మూలము. ఈ మూలతత్త్వమును శ్రీమహా విష్ణువు అని, నారాయణు దని తెలుపుదురు. అతనితోపాటు ఎప్పుడునూ నున్నది శ్రీమాత. వారిరువురునూ పరులే. పరమపదమున ఇరు తత్త్వములు మేళవించి యుండును. సృష్టి ఉద్భవ సమయమున వీరే మొట్టమొదటగ ప్రకృతి, పురుషులగుదురు.

వీరినే నారాయణ, నారాయణి అందురు. విష్ణువు – వైష్ణవి అందురు. ధర్మము – ధర్మి అని కూడ అందురు. ఈ ప్రకృతి పురుషులు ఒకే తత్త్వమునుండి ఏకకాలమున ఉద్భవింతురు. కనుక తోబుట్టువులు. పరతత్త్వమును పరమ శివుడని, నారాయణుడని, పరబ్రహ్మమని, పరదేవత యని సంబోధింతురు. అందుండి దిగివచ్చిన పురుషుడు విష్ణువు, స్త్రీ వైష్ణవి. ఈ వైష్ణవీదేవి పరమశివుని పత్నీ భావము పొందెను.

శ్రీమాత విష్ణువునకు తోబుట్టువు. ఆమె అంశావతారమే సుభద్ర. శివుని అంశగ ఉద్భవించిన అర్జును డామెను పెండ్లాడుట యందు గల రహస్యమిదియే.

281.

'ఉన్మేషనిమిషోత్పన్న విపన్న భువనావళిః'

శ్రీమాత కన్నులు తెరచిన బ్రహ్మాండములు పుట్టునని, ఆమె కన్నులు మూసిన అవి నశించునని అర్థము.

ఉన్మేషమనగా నేత్రముల కాంతి. ఉత్పన్న విపన్నములు, భువనావళులకు అనగా బ్రహ్మాండములు ఆమె నుండి కలుగు చుండును. శ్రీమాత అనిమిష అయినచో సృష్టి యుండును. నిమిష అయినచో సృష్టి లయ మగును. అనిమిష అనగా తెరచిన కన్నులు గలది. నిమిష అనగా మూసిన కన్నులు కలది. అనిమిషగ నున్నప్పుడు ఆమె నేత్రముల నుండి ప్రసరించు కాంతి సృష్టి కాధారమై సృష్టిని గావించి వృద్ధి పరచును. ఆమె నిమిషయై కన్నులు మూసినచో సృష్టి క్షణ కాలమున లయమగను.

సృష్టి కాలమందు శ్రీమాత అనిమేష అనగా రెప్పపాటులు లేనిది. ఈ కర్మములనే శ్రీమాతను, శ్రీమహా విష్ణువును పద్మముల వలె విచ్చుకొన్న ఆకర్షణీయమైన కన్నులు కలవారిగ ఆరాధింతురు. విచ్చుకొన్న కన్నులుగల మూర్తి నారాధించువారు క్రమముగ వికాసము పొందుదురు. మూసిన కన్నులు గల రూపమును ధ్యానించుట వలన ప్రయోజన మంతంత మాత్రమే. దేవి కన్నుల వర్ణన అనేక విధములుగ భక్తులు చేయుచు నుందురు. నేత్ర దర్శన మత్యంత ప్రధానము.

కలువరేకుల వలె విచ్చుకొన్న కాంతివంతమైన కన్నులను ధ్యానించు వారు కాంతివంతు లగుదురు. కాంతి ప్రభావము చేత అప్రమత్తులుగ ఉందురు. కాంతిగల పెద్ద కన్నులు జీవుల పరిణామమును కూడ సూచించును.

కన్నులు తెరచుట, మూయుట శ్రీమాత ఇచ్ఛానుసార ముండును. కావున సృష్టి ఆరంభమునకు అంతమునకు శ్రీదేవి ఇచ్ఛయే ఆధారము. సంవత్సరమున ఫాల్గుణ మాసము (మీనరాశి) ఈ తత్త్వమును ప్రసరింపచేయును. ఈ మాసమునకు అధిదేవత మీనాక్షి. ఈ మాసమునందే సంవత్సర మంత మగుచుండును. ఈ మాసము నందే సూక్ష్మమగు ఆరంభము కూడ జరుగును. అంతము వలె తోచుట మరియొక ఆరంభమునకే. ఒక సృష్టి అంతమగుట మరియొక సృష్టి ఆరంభమునకే. చిన్నదైననూ, పెద్దదైననూ ఒక కార్యమంత మైనపుడు మరియొకటి ఆరంభమగునని తెలియవలెను. ఇవియే విపన్న ఉత్పన్నములు.

282. 'సహస్రశీర్షవదనా'

వెయ్యి శిరస్సులతో కూడిన వదనము కలది శ్రీమాత అని అర్థము.

"సహస్ర" శబ్దము అనేకానేక అర్థములు కలిగియున్నది. సహస్ర మనగా వేయి. సహస్ర మనగా అనేకము. వేయి అనినపుడు ఒకటి తరువాత మూడు సున్నాలు వుండును. మూడు సున్నాలు మూడు లోకములకు సంకేతము కాగా, వాటికి పూర్వము నందున్నది ఒకటియే. ఒకటియే మూడు లోకములు వ్యాపించి యున్నదని అర్థము. సృష్టి మొత్తము ప్రజ్ఞ, శక్తి, పదార్థములతో చేయబడినది. ఈ మూడింటికిని ఆధారమైనది ఒకటియే. కావుననే సహస్ర పదమును పరతత్త్వమును తెలుపుటకు వాడుదురు. ఒకటి మూడుగనై నాలుగు అగును. (1 + 3 = 4) తత్కారణముగ వాక్కు, వేదము, కాలము, స్వభావములు, ప్రధానముగ నాలుగు విభజనలు పొందును. ఒకటి నుండి పుట్టిన మూడు, నాలుగు నుండి ప్రతిబింబించుటచే ఏడగును. (1 + 3 + 3 = 7) ఇట్లు ఏడు లోకము లేర్పడును. ప్రధానముగ మూడే లోకము లైననూ ప్రతిబింబ ప్రభావమున ఏడుగ గోచరించును. సత్యలోకము, తపోలోకము, జనోలోకము ప్రధానముగ మూడు లోకములు. ఈ మూడు లోకములు మహత్తు అను నాలుగవ లోకమునుండి సువర్లోకము, భువర్లోకము, భూలోకముగ ప్రతిబింబించును. ముందు మూడు లోకములు సూక్ష్మములు. తరువాత మూడు లోకములు

స్థూలములు. సూక్ష్మము స్థూలములోనికి వచ్చుటకు మహత్తు నడుచు చున్నది. అదృశ్యము దృశ్యమగుట, దృశ్యము అదృశ్యమగుట ఈ మహత్తు. ఇట్లు మొత్తమేడు లోకము లేర్పడును. కావుననే ఈ మొత్తమును సంకేతించుటకు ఒకటి తరువాత 7 సున్నలు చేర్చుదురు. అదియే ఒక కోటి సంఖ్య.

క్లుప్తముగ సహస్రము అని, విస్తారముగ కోటి యని మన వాఙ్మయమున పేర్కొనుచుందురు. ఈ సున్నాలన్నిటికిని ఆధారము శ్రీదేవి. లోకమను పదమున, అందు వశించువారు, వాటి పాలకులు కూడ ఇమిడియున్నారు. ఇన్ని లోకములకు ముఖము, శిరస్సుయై శ్రీదేవి యున్నది.

'సహస్ర' అనునది సహస్రార పద్మ వైభవమును సూచించును. సహస్రార వర్ణనము బహువిస్తారము.

'సహస్ర' అనునది అత్యంతశక్తివంతమగు మంత్రము. రహస్య మగు మంత్రము. అంతరంగమున దివ్యానుగ్రహముగ తెలియబడు మంత్రము. ఈ మంత్రమును తెలిసినవారు సర్వ శక్తిమంతులు అగుదురు. సుదర్శన ఆయుధము వీరి సొత్తు అగును. అంబరీషాదులు ఈ మంత్రమును దర్శించిరి.

'స' అను శబ్దముతో పురుష సూక్తము ప్రారంభమగును *(సహస్ర శీర్షా పురుషః)*. 'హ' అను శబ్దముతో శ్రీ సూక్తము ప్రారంభ మగును *(హిరణ్య వర్ణాం)*. 'సహ' అను శబ్దము ప్రకృతి పురుషుల

సమాగమ శబ్దము. ఈ శబ్దముల మిశ్రమమే సోహం, హంస, హసౌం, హింస, సింహ ఇత్యాదివి. ప్రకృతి పురుషుల సమాగమమే సృష్టి రూపము. 'సహ' అను శబ్దము నుండి పుట్టు సృష్టినే 'స్ర' అని పలుకుదురు. 'సహస్ర' శబ్దము అత్యంత వైభవోపేతమైన శబ్దము. ఇంకనూ వివరించుట కిచట తావు లేదు.

283. 'సహస్రాక్షీ', 284. 'సహస్రపాత్'

వెయ్యి కన్నులు కలది శ్రీమాత అని అర్థము.

అక్ష మనగా కేంద్రమునుండి పరిధికి చేరు రేఖ. వేయి అక్షములుగ కేంద్రము నుండి పరిధికి వ్యాపించునది అని అర్థము. కేంద్రము నుండి పరిధికి 360 కోణములు కలవు. మూడు లోకముల యందు కేంద్రమునుండి పరిధికి వ్యాపించునది శ్రీమాత అని అర్థము. ప్రధానముగ ప్రతిబింబించు మూడు లోకములు ముందు నామమున తెలుపబడినవి. ఈ లోకము లన్నియూ ఏర్పరచుటకు శ్రీమాత తానే కేంద్రము నుండి పరిధికి వ్యాపించినది. సృష్టియందు ఏ వస్తువున కైనను అణువున కైననూ కేంద్రము శుద్ధ చైతన్యము. ఆ చైతన్య మాధారముగనే ఆయా అణువులు, అణువుల సముదాయములు రూపము గట్టుకొను చుండును. కేంద్రమాధారముగ త్రిగుణ మేర్పడి, త్రిగుణ స్వభావము ననుసరించి రూపమేర్పడుచు నుండును. పరమాణువు నుండి బ్రహ్మాండము వఱకు ఇట్లే వ్యాప్తి చెందుచూ రూపములు కట్టుకొనుచుండును. పరమాణువు, పరాశక్తి పరమశివుని సమ్మేళనము. అటు నుండి వ్యాపించిన దంతయు త్రిగుణాత్మక మగు శక్తి చైతన్యమే. వ్యాపించిన సమస్తము నందు పరమ శివతత్త్వము నివాసముండును.

'సహస్రాక్షి' అనగా అక్షములే కాక కన్నులు కూడ కలది,

అనగా ఆమెయే లోకసాక్షి అని అర్థము. శ్రీమాత, శ్రీమహా విష్ణువు ప్రతి జీవి లోపల వెలుపల కూడ నిండియుండి జరుగుచున్న సమస్తమును దర్శించుచు నుందురు. అసురులు నిర్వర్తించు రహస్యాత్మక మగు చర్యలను కూడ వారిలో నుండియే గమనింతురు. అన్నిట నిండియున్న చైతన్యము అన్నిటినీ గమనించుచునే యుండును. ఎవ్వరునూ చూచుట లేదనుకొని చేయు పనులు, పలుకు మాటలు, ఆలోచనలు, లోనుండి దైవము చూచుచున్నాడు, అని తెలిసినవాడు తెలిసినవాడు. ఇది తెలియని వారు తెలియని వారు. దైవముకడ రహస్యము లేమియు లేవు. తటస్థ స్థితి దైవస్థితి. జీవుడు తటస్థ స్థితిని చేరినచో తానునూ దైవమువలె సాక్షీభూతుడు కాగలడు. యోగవిద్య ఉపదేశించు సమవర్తన మిదియే. ఇతరులు రజస్తమస్సు లకు గురియై ధర్మాధర్మ పోరాటమున చిక్కుకుందురు. సాక్షీ స్థితి పొందుట యనగా తాను అక్షర స్వరూపము అని ఎఱిగి క్షర స్వరూపముతో విడివడి యుండుట. ఇట్టి స్థితిలో క్షర పురుషుని చేతలు అక్షరుని అంటవు.

'సహస్రపాత్' అనగా వెయ్యి పాదములు కలది శ్రీదేవి అని అర్థము.

అనగా వెయ్యి మార్గములలో చరించునది. శ్రీదేవి వెయ్యి మార్గములలో చరించును గావున ఆమెను చేరుటకు కూడ వెయ్యి మార్గము లున్నవి. వేయి అనగా అనేకమని ముందు నామములలో

సూచించితిమి. వేయి మార్గములు గమ్యమున కుండగా ఒకే మార్గ మున్నదని బోధించుట ఎంతటి మూర్ఖత్వము! మూర్ఖులే యిట్లు పలుకుదురు. వీరి వలననే సిద్ధాంతములు, మతములు, విరోధములు, యుద్ధములు ఏర్పడినవి. ఏ యింటిలోని వారైనా వారి తూర్పు కిటికీ నుండి చూచినపుడు సూర్యు డగుపించును. ఆకాశము కూడ అగుపించును. మా యింటి కిటికీ నుండియే సూర్యుడగుపించును అని భావించుట పరమ మూర్ఖత్వము.

భావన దైవమును గూర్చి యున్నప్పుడు, రూపమేదైననూ, నామ మేదైననూ విధాన మేదైననూ గతి గమ్యమును చేర్చును. సిద్ధాంతీకరించుట వెఱ్ఱితనము. ఆకలి తీరుట ముఖ్యము కాని ఏ పదార్థము తినితిమి అని కాదు కదా! భారతీయ ఋషులు స్వతంత్రించి అనేకానేక విధములుగ దైవ మార్గములను ప్రతిపాదించిరి. అనేకానేక విధముల బోధించిరి. ఇట్లు వైవిధ్యముతో వైభవము కలిగించిరి. వైవిధ్యము వైభవమే. వైవిధ్యమైన ఆహార పదార్థములు, దుస్తులు వైభవమే కదా! ఒకే రకమగు దుస్తులు ధరించుట, ఒకే రకమగు ఆహారము జీవితాంతము తినుట దుర్భరము. దేవుని సృష్టియందు కూడ వైవిధ్యమున్నది. అనేకానేక పుష్పములు, ఫలములు, వృక్షములు, జంతువులు, ఖనిజములు, జీవులు, గోళములు, దేవతలు, ఋతువు లతో కూడి సృష్టి, వైభవోపేతముగ నున్నది కదా! అట్లే మార్గములు కూడ ఉన్నవని తెలుపుటకే సహస్రపాత్ అను నామము సూచింప బడినది.

285. 'ఆబ్రహ్మకీటజననీ'

బ్రహ్మ మొదలు సాలీడు వరకు అన్ని జీవరాసులకు జనన మిచ్చునది శ్రీమాత అని అర్థము. ఏ జీవికైననూ శ్రీమాతయే జనని కావున ప్రతి జీవియును శ్రీమాత అనుగ్రహము పొందదలచినచో తమ తమ తల్లుల రూపముల నున్నది శ్రీమాతయే అని తెలిసి పూజింపవలెను, గౌరవించవలెను, మన్నించవలెను. కన్నతల్లిని దూషించుచు శ్రీమాత పూజలు చేయుట వ్యర్థము. తండ్రి కూడ పూజకు తల్లి తరువాత వాడే. అటుపైన గురువు అని వేదము ఘోషించు చున్నది. ప్రత్యక్ష గురువులలో ప్రధానమైనది తల్లి. అటుపైన తండ్రి, అటుపైన గురువు. తల్లిదండ్రులను కాదని గురువును చేరుట వలన మార్గమున అవరోధము లేర్పడగలవు. నారదుడు సహితము సిద్ధి పొందుటకు పూర్వము తల్లి నారాధించవలసి వచ్చెను. శంకరులు సహితము సన్యసించుటకు తల్లి ఆజ్ఞను పొందవలసి వచ్చెను. తల్లి ఆశీర్వచనముతో లవకుశలు జగదేక పరాక్రమవంతుడైన శ్రీరాముని యుద్ధమున నిర్జించిరి. కావున శ్రీమాతను ఉపాసించువారు ప్రధానముగ తల్లియందు దైవమును చూచుట అభ్యసించవలెను.

286. 'వర్ణాశ్రమవిధాయినీ'

వర్ణాశ్రమ ధర్మములను ఏర్పరచి ఆయా ధర్మములను విధించినది శ్రీమాత అని అర్థము.

వర్ణములు నాలుగు. ఆశ్రమములు నాలుగు. వర్ణములనగా స్వభావములు. ప్రధానముగ నాలుగు స్వభావములు కలవు. జీవుల గుణములను బట్టి, చేయు కర్మను బట్టి నాలుగు వర్ణములు దైవమే ఏర్పరచునని తెలియవలెను. కొందరియందు మేధాశక్తి అధికముగ నుండును. వారు కాలమును, దేశమునుబట్టి దైవ నిర్ణయము ననుసరించుచు ఇతరులకు హితము చేయుటయే ప్రధానముగ జీవింతురు. తపస్సు, స్వాధ్యాయము, పరహితము ప్రధాన లక్షణము లుగ వీరు జీవితమును గడుపుచుందురు. ఇట్టివారు గుణముచేత, కర్మచేత బ్రాహ్మణు లనబడుదురు.

కొందరు శౌర్యము, ధైర్యము, సాహసము స్వభావమున కలిగి యుండి ఇతరులను రక్షించుటలో నిమగ్నమై యుందురు. ఇట్టివారు స్వభావపరముగ క్షత్రియు లనబడుదురు. మరికొందరు వినిమయ శక్తి కలిగి సృష్టి సంపదను, మానవ మేధస్సును మానవ సంఘమునకు వినిమయ పడునట్లు కార్యము లాచరింతురు. ఇట్టివారు వైశ్య ప్రవృత్తి కలవారు. వినిమయ వినియోగ కార్యక్రమములకు ధనమును ప్రధాన వాహికగ ఏర్పరచుకొని కార్యము చేయుదురు. మరికొందరు కేవలము

శరీర శ్రమనే చేయగలరుగాని పై తెలిపిన మూడు స్వభావములు లేక యుందురు. వీరిని శూద్రులందురు.

ఇట్లు ప్రధానముగ నాలుగు వర్ణములు గోచరించును. ఈ విభాగము గుణ కర్మ విభాగమే కాని జాతి భేదము కాదు. నాలుగు వర్ణములు కూడ సంఘశ్రేయస్సుకే పాటుపడుట, తద్వారా పరిణామము చెందుట శ్రీమాత ఏర్పరచిన విధానము. సంఘమునకు తమను తాము సమర్పించుకొను వున్ముఖతను బట్టి వీరు అభివృద్ధి చెందు చుందురు. పరిణామము చెందుచు దివ్యపథమున సాగుదురు. సృష్టి యజ్ఞమున వీరందరికిని భాగమున్నది. స్వార్థమున్నచోట బంధము, పరహిత మున్నచోట మోక్షము శ్రీమాత ఏర్పరచిన విధానము.

నాలుగు వర్ణములవలెనే మానవ జీవితమున నాలుగు ఆశ్రమములు కూడ కలవు. అవి వరుసగా బాల్యము, యౌవనము (కౌమారము), గృహస్థము, వానప్రస్థము. బాల్యమున క్రీడాసక్తి, కౌమారమున విద్యాసక్తి, గృహస్థాశ్రమమున కర్తవ్య నిర్వహణము, వానప్రస్థమున దైవచింతన అను నాలుగు స్థితులు ప్రతి జీవునికి గలవు. క్రీడాసక్తి అందరికిని సహజమేగాని, విద్యాసక్తి, సంఘమున బాధ్యతాయుత జీవనము, చరమదశలో తపస్సు జీవులు ప్రయత్నించి నిర్వర్తించుకొనవలెను. అట్లు చేసినచో జీవుడు సన్మార్గమున పురోగతి చెందును. కర్మకాండను సక్రమముగ నిర్వర్తించువారికే భక్తి, జ్ఞానము ఉదయించి ధ్యానమున నిలువగలరు. కర్మమందలి ధర్మమే భక్తిగ

వికసించును. భక్తి జ్ఞానమునకు మార్గము చూపును. జ్ఞానము వైరాగ్యమునకు, ధ్యానమునకు మార్గము చూపును. ఒక జీవిత కాలమున ఈ నాలుగాశ్రమములను నిర్వర్తించుకొనుట వలన జీవుడు కృతకృత్యుడగును.

ఇట్లు జీవోద్ధరణకై వర్ణాశ్రమ విధానమును శ్రీమాత ఏర్పరచెను.

287. 'నిజాజ్ఞారూపనిగమా'

దేవి ఆజ్ఞా రూపములే వేదములు అని అర్థము.

మహాచైతన్య ముద్భవించిన వెనుకనే వేదముల ప్రసక్తి. ప్రళయమున వేదములు మహా చైతన్యములోనికి, మహాచైతన్యము ప్రళయములోనికి ఇమిడి యుండును. అపుడేమియు లేనట్లుండును. లేనట్లుండుటయేగాని లేకుండుట కాదు. లేనట్లున్న స్థితియే ఆది. అందుండి ఉద్భవించునది మహాచైతన్యము లేక శ్రీమాత. ఆమె ఇచ్ఛయే వేదములకు మూలము. మన యందలి సంకల్పముల పుట్టుకకు కూడ ఈ ఇచ్ఛయే కారణము. పుట్టిన సంకల్పము భావ రూపము, భాషా రూపము, కర్మ రూపము దాల్చును. ఇచ్ఛయే కారణముగ ప్రాణస్పందనముకూడ కలుగును. సంకల్పము ఋగ్వేదము కాగా, భావ మయము, చేత మయము అగుట యజుర్వేద మగును. వీని కాధారముగ సామవేదమై ప్రాణములు స్పందించును. అవతరించు సృష్టి అధర్వణ వేదమై నిలచును. ఇట్లు శ్రీమాత ఇచ్ఛయే అన్ని వేదములకు మూలము. నాలుగు వేదములు ఆమె ఆజ్ఞా రూపములే.

నిగమము లనగా వేదానుసారమైన తంత్రములు, తంత్రము లనగా విధానములు. ఏ మానవుని యందైననూ ఈ నాలుగు వేదములే వ్యక్తమగు చుండును. మానవునికి కలుగు స్ఫురణ, భావము,

ఉచ్చారణ ఋగ్వేదము. అతని యందలి ప్రాణ ప్రవృత్తులు సామ వేదము. భావనను తీరుగ అమర్చుకొని కార్యములు యజ్ఞార్థముగ నిర్వర్తించుట యజుర్వేదము. ఇట్లు నిర్వర్తింపబడిన కార్యములు భూమిపై అవతరించుట అధర్వణ వేదము.

ఇట్లు నాలుగు వేదములు మానవుల యందు ప్రకాశించు చున్నవి. ఇట్లు ప్రకాశించుటకు మూలము మన యందలి శ్రీదేవి ప్రకాశమే. ఆమె చైతన్య స్వరూపిణిగ మన యందుండుట వలన మానవుడు ఆ చైతన్యము, తన చైతన్యమని భ్రమపడు చుండును. అట్లే తన సంకల్పమని, తన ప్రాణమని, తన తెలివితేటలని, తాను సృష్టించెనని భావించును. కాని అన్నిటికీ మూలమైన స్ఫురణ కలుగనిచో ఏమి చేయగలడు? శ్రీమాత ఆజ్ఞగనే నాలుగు వేదములు, సృష్టి యందు మానవుని యందు వర్ధిల్లుచున్నవి.

288. 'పుణ్యాపుణ్య ఫలప్రదా'

పుణ్యఫలము, అపుణ్యఫలము ప్రసాదించునది శ్రీమాత అని అర్థము.

ధర్మమాచరించిన పుణ్యము. అధర్మాచరణము పాపము. ధర్మము నాచరించిన వారికి స్థిరత్వముండును. అధర్మము నాచరించు వారికి స్థిరముండదు. జీవితమున పుణ్యాత్ములు కాలమును, దేశమును బట్టి వచ్చు సుఖ దుఃఖములు, లాభ నష్టములు, జయాపజయములు స్థిరచిత్తముతో ఎదుర్కొనుదురు. ఇట్లు స్థిరముగ నుండుటకు లోబలము ధర్మమే. ధర్మము నాచరించని వారికే మతి స్థిమిత ముండదు. భయ భ్రాంతములు కలుగుచుండును. రాగద్వేషములు, కామక్రోధములు, మదమాత్సర్యములు, ఈర్ష్యాసూయలు, లోభ మోహములు తరచూ వీరిని స్పృశించు చుండును. ధర్మమాచరించని వారికి లోబలము తక్కువ. ధర్మమాచరించు వారికి లోబలము ఎక్కువ.

కష్ట నష్టములు, దుఃఖములు ధర్మమాచరించిన వారికి కూడ కలుగునని పురాణ గాథలు తెలుపుచున్నవి. కాని వారు కష్ట సమయమున లోబడక ధర్మమునందు నిలచి దాటుదురు.

శ్రీమాత మహా చైతన్య స్వరూపిణి. కార్యకారణముల కతీతముగ నుండును. జీవులు కార్యముల ద్వారా కారణములను సృష్టించుకొందురు. ఉదాహరణకు ఒక దీపపు వెలుగులో సద్గ్రంథ

పఠనము, సద్భాషణము, సత్కర్మాచరణము చేయవచ్చును. అట్లే అదే దీపపు వెలుగులో దుర్భాషణము, దుష్కార్యములు చేయవచ్చును. ఒకరు సద్భాషణము సత్కార్యము చేయుటకు, మరొకరు దుర్భాషణము దుష్కార్యము చేయుటకు వెలుగు కారణము కాదు కదా! ఇట్లు శ్రీమాత అందించిన సమస్త సృష్టి సౌకర్యములను సద్వినియోగము చేసుకొను వారు సత్ఫలములను పొందుచుందురు. దుర్వినియోగము చేయువారు దుష్ఫలములను పొందుదురు. ఇట్టి అమరికను సృష్టి యందేర్పరచినది శ్రీమాత.

వర్ణ ధర్మము, ఆశ్రమ ధర్మము విహిత కర్మలుగ శాస్త్రము చెప్పుచున్నది. వీని ననుసరించక పోవుట వలన జీవులు పతనము చెందుచుందురు. అనుసరించువారు వృద్ధి చెందుచు నుందురు.

289.

'శ్రుతిసీమంత సిందూరీకృత పాదాబ్జధూళికా'

శ్రుతి సీమన్తములనెడి సిందూర ధూళిచే కప్పబడిన పాదములు కలది శ్రీదేవి అని అర్థము.

యజ్ఞార్థ కర్మకు ఫలశ్రుతి బ్రహ్మజ్ఞానమును పొందు అర్హత. బ్రహ్మ జ్ఞానమునకు వేదములు, కర్మజ్ఞానమునకు శాస్త్రములు ఏర్పడినవి. రహస్యమగు వేద మంత్రములకు ఉపనిషత్తులు దిక్సూచిగ ఏర్పడినవి. ఇట్లు శాస్త్రములు, పురాణములు, ఉపనిషత్తులు, వేదము – ఈ మొత్తమును శ్రుతులనిరి. ఈ శ్రుతులు దేవీ తత్త్వమును ప్రకటించుటలో పారము చేరినవి. అనగా సీమాన్తము చేరినవి. అనగా ఒక పరిమితి వరకు చేరినవి. అంతేగాని శ్రీదేవిని పరిపూర్ణముగ వర్ణించుటలో విఫలమైనవి. వేద వాఙ్మయమును మించిన వాఙ్మయము సృష్టిలో లేదు. అట్టి వాఙ్మయము కూడ శ్రీదేవిని వర్ణించుటలో కేవలము సిందూర ధూళివలె (కుంకుమ ధూళివలె) పాదముల నంటినట్లు హయగ్రీవుడు అగస్త్య మహర్షికి తెలుపుచున్నాడు.

దైవమును నిర్వచించుట అసాధ్యము. భాషకు, భావమునకు అందని విషయము. భావన, భాషలు అందుండి పుట్టినవే. అందు లోనికి జీవుడు లయమగుటయే యుండును గాని, దైవమును తెలుసుకొనజాలడు. అనుభూతి కలిగిననూ వర్ణింపజాలడు. దైవము

వర్ణనాతీతము గనుక ఎంత వర్ణించిననూ, వివరించిననూ అది కేవలము పాదధూళి పరిమాణమే కలిగి యుండునని అంతకు మించిన స్థానము వేద వాఙ్మయమునకు సహితము లేదని శ్రీదేవి మహత్తును యిచ్చట ఆవిష్కరించు చున్నారు.

అన్నిటికి అతీతమైన తత్త్వమును పేర్కొనలేక "నేతి నేతి" "ఇది కాదు, ఇది కాదు" అనుచూ శ్రుతులీ తత్త్వమును పేర్కొనినవి. దేవీ మహత్తును వర్ణించుటలో ఇంతకు మించిన నామము మరియొకటి యున్నదా? అనిపించును.

290.
'సకలాగమ సందోహ శుక్తిసంపుట మౌక్తికా'

సమస్త వేదముల గుంపులు శ్రీమాత ముక్కునకు అలంక రింపబడిన ముత్యముల ఆభరణములని అర్థము. అట్టి ముక్కు పుడక గలది శ్రీమాత అని కూడ అర్థము.

ముందు నామములలో తారకల కాంతిని కూడ తిరస్కరించెడి ముక్కర కలదని సహస్ర నామములు తెలియజెప్పుచున్నవి *(తారా కాంతి తిరస్కారి నాసాభరణ భూషితా).* ఇచ్చట వేదముల గుంపులే ఆ నాసాభరణమని ఆ ఆభరణకాంతి ముత్యముల కాంతివలె వర్ణింప బడినది. సోమాత్మకమైన కాంతిని ముత్యపు కాంతి గను, సూర్యాత్మక మైన కాంతిని వజ్రకాంతిగను తెలుపుదురు. సోమాత్మకమైన కాంతి మహాచైతన్యమునకు సంకేతము. దీనినే జ్ఞానకాంతి అందురు. ఇది జీవునికి చంద్రుని వెన్నెలవలె చల్లదనమిచ్చును. సూర్యుని కాంతి తాపము కలిగించును.

ముత్యపు కాంతితో సకల వేద సమూహమును పోల్చుటలో జీవునికి తృప్తి, సంతుష్టి, చల్లదనము, మనస్సున కాహ్లాదము, ప్రశాంతత కలిగించు జ్ఞానము శ్రీమాత ముక్కుపుడక వంటిదని తెలుపబడినది.

అట్లే ఒక చిన్న ఆభరణము కాంతియే శ్రీమాతకు వేద సమూహముల జ్ఞానమైనపుడు ఇక శ్రీమాతనేమని వర్ణింపగలము! "సకలాగమ సందోహ" అను నామము శ్రీమాత మాహాత్మ్యమును మిక్కుటముగ ప్రశంసించుచున్నది. శ్రుతులు, ఆగమములు సమస్తము ఆమె పాద ధూళిగను, ముక్కు పుడకగను పోల్చబడినవి.

మౌక్తిక మనగా సృష్టించు ధర్మము గలది అను అర్థము కూడ నున్నది. సృష్ట్యాది ధర్మములన్నియూ, ఆగమములందు (వేదము లందు) తెలుపబడినప్పటికిని, అవి శ్రీమాతతో సరిసమానము కానే కావని భావన. వర్ణించలేని విషయము వర్ణించుట, వర్ణనమును అనంతముగ వర్ణించుటగ నుండును. ఎంత వర్ణించిననూ మిగిలి పోవుచుండును. అయిననూ భక్తులు వర్ణించుచునే యుందురు. అట్టి వర్ణన ఆరాధనమై వారిని శ్రీమాత సాన్నిధ్యమున నిలుపును.

291. 'పురుషార్థప్రదా'

పురుషార్థములను ప్రసాదించునది శ్రీదేవి అని అర్థము.

పురుషార్థములు చతుర్విధములు. కామము, అర్థము, ధర్మము, మోక్షము. ఈ నాలుగింటిని పరిపూర్తి గావించి జీవులను పరిపూర్ణులను చేయుటయే శ్రీమాత పని. అర్థ కామములు, జీవులకు వారిలోని లోటు, అసంపూర్ణతల వలన కలుగును. రకరకములగు కోరికలు కలుగుటకు కారణము వానిని గూర్చిన పూర్ణానుభవము లేకపోవుటయే. అనుభవైకమైన విద్య నిజమైన విద్య. అనుభవములోనికి రాని విద్య తృప్తి నివ్వదు. జీవులకు తగుమాత్రము అనుభవ మందించుటకే జన్మ పరంపరలు. అనుభవము ద్వారా జీవునికి తప్పు ఒప్పులు తెలియును. అట్లే తృప్తినిచ్చువాటిలో తాత్కాలికము లేవి? శాశ్వతము లేవి కూడ తెలియును. అసంతృప్తితో ముందుకు సాగుట వలన ప్రయోజనము లేదు. కావుననే జీవులకు లక్షలాది నరజన్మ లేర్పాటు చేయబడినవి. జీవులు అనుభవము చెందుచు పరిణామము దిశగ నడుచు చుందురు. క్రమముగ కామమును, అర్థమును, ధర్మము అధ్యక్షతన నిర్వర్తించుకొనుట నేర్తురు. ధర్మమున చేరుట పరిపూర్తి యగుచున్నకొలది మోక్షము దగ్గరగు చుండును. కర్మబంధము లేకుండుటయే మోక్షము– అది ధర్మాచరణముననే సిద్ధించును.

మానవ సంఘమున ఈ నాలుగు తరగతుల వారును ఉందురు.

అర్థకామములను నిర్వర్తించుటలో ధర్మము ననుసరించు వారు, అనుసరించనివారు కూడ నుందురు. ఇందరును కలిసి జీవించుటలో ఘర్షణలు కూడ యుండును. అన్నియునూ జీవునికి అనుభవము నందించుటకే. అన్ని అనుభవములూ పరిపూర్ణమైనపుడు జీవునికి పరిపూర్ణత్వము లభించును. కావున శ్రీమాత సృష్టి విధానమున ఆమె కోరినవారికి కోరునది ప్రసాదించును. కోరుటలోని తప్పు ఒప్పులతో ఆమెకు సంబంధము లేదు. తప్పుల వలన కూడ ఫలితముల ద్వారా జీవులు నేర్చుకొనుచునే యుందురు. మహాత్ములైన వారు కూడ ప్రాథమిక దశలో తప్పులు చేసినవారే. శ్రీమాతకు అందరూ తన పిల్లలే. ఎవరెవరు ఏ విధముగ నేర్వవలెనో వారి వారి కట్లే నేర్చుచు నుండును. కావుననే కోరికలు కోరువారికి కోరికలు తీర్చుట, ధనార్జనమున నిమగ్నమైనవారి ప్రార్థనలను మన్నించి ధనవంతులను చేయుట, ధర్మము నర్థించువారికి సత్పురుషుల ద్వారా ధర్మమును నేర్పుట, శిక్షణ నిచ్చుట, ఇత్యాదులన్నీ శ్రీమాతయే చేయుచున్నది.

భగవద్గీత యందు శ్రీకృష్ణుడు కూడ ఇదే విధముగ పలుకును. ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు, తనను గూర్చిన అన్వేషణలో జన్మ పరంపరలను సాగించు చున్నారని తెలిపెను.

292. 'పూర్ణా'

పూర్ణమైనది శ్రీమాత అని అర్థము.

పూర్ణము, శూన్యము అను రెండు పదములను గూర్చి ఆలోచించినపుడు దృశ్యాదృశ్యములు భావనకు వచ్చును. పూర్ణము కంటికి అగుపడు పూర్ణము. శూన్యము కంటికి అగుపడనిది. ఒకటి ఉన్నట్లుండును. మరియొకటి లేనట్లుండును. ఉన్నట్లు అగుపడుట దృష్టిని బట్టి, ద్రష్టను బట్టి యుండును. కొందరు కనపడునదే చూడలేరు. కొందరు కనుపడునది, కనపడనిది కూడ చూడగలరు. వీరికి సూక్ష్మదృష్టి యుండును. సూక్ష్మదృష్టి యున్నవారు కూడా తమలోనుండి చూచుచున్న చైతన్యమును చూడలేరు. చైతన్య మాధారముగ సూక్ష్మ దృష్టి, స్థూల దృష్టి ఏర్పడుచున్నవి.

పూర్ణిమ చంద్రుని కన్నులుగల వారందరూ చూడగలరు. అట్టివారు అష్టమి చంద్రుని చూచినపుడు చంద్రుడు సగమే కనపడును. కనపడని భాగము లేదనుట సత్యమా? కాదు కదా! మనకు కనపడదు గాని యున్నది. శుక్లాష్టమి నాడు కనపడిన భాగము కృష్ణాష్టమి నాడు కనపడదు. రెండు భాగములు పూర్ణముగా కనుపించునపుడు పౌర్ణమి అందుము. రెండు భాగములు కనుపించనినాడు అమావాస్య అందుము. పౌర్ణమి, అమావాస్య, శుక్లపక్ష తిథులు, కృష్ణపక్ష తిథులు భూమికి, భూమి జీవులకే గాని చంద్రునకు కావు. చంద్రునికి హెచ్చు

తగ్గులు లేవు. చంద్రుని చూచు మనకుండును. కారణము మనలోని హెచ్చుతగ్గులే. ఇట్లే సృష్టి ఆది, వృద్ధి, అంతము, ఇవి అన్నియూ జీవులకే గాని శ్రీమాతకు కాదు. ఆమె ఎప్పుడూ పూర్ణయే. అట్టి పూర్ణత్వమును జీవులు కూడ పొందవలెనని శ్రీమాత ఆకాంక్ష. అట్టి పూర్ణత్వము పొందుట వలన పొందిన జీవులు శ్రీమాత భక్తులుగా ఇతరులకు ఆదర్శప్రాయులుగ సృష్టి యున్నంత కాలము ఉందురు. సృష్టి శ్రీమాత యందు లయమైనపుడు ఆమెను చేరుదురు. మరల సృష్టి ఆరంభమున ఆమె నుండి పూర్ణులుగనే వెలువడి శ్రీమాత అనుజ్ఞానుసారము సృష్టి నిర్వహణమున పాల్గొందురు.

ఈ నామము జీవుల గమ్యమును తెలుపు నామము. మరల మరల సృష్టి నిర్మాణములు చేయుటకు, శ్రీమాత సంకల్పించుటకు, కారణము కూడ జీవులు పూర్ణత్వము పొందుట కొఱకే. ఇది శ్రీమాత సహజ స్థితి.

293. 'భోగినీ'

సుఖ సౌఖ్యముల స్వరూపిణి శ్రీమాత అని అర్థము. శ్రీమాత ఆరాధకులకు సుఖ సౌఖ్య పరంపరలు మెండుగ నుండును. సకల సౌభాగ్యము లుండును. జీవితమున యోగముతోపాటు భోగము, వైభోగము వుండును. రోగము లుండవు. సంతోషమెప్పుడునూ నీడవలె అంటిపెట్టుకొని యుండును. శ్రీమాత ఆరాధనా బలమున సత్యమును, ధర్మమును అప్రయత్నముగ అనుసరింతురు.

మానవ జీవితము మూడు రకములుగ గోచరించును. యోగమయము, భోగమయము, రోగమయము. రోగములచే పీడింప బడువారు ప్రయత్నించి సత్యధర్మముల నిలబడవలెను. భోగమయ జీవితము వర్జితము కాదు. యోగుల యందు భోగులు కూడ అనేకులు కలరు. యోగములేని భోగమే రోగములకు కారణము. యోగమయ జీవనమున యమ నియమము లాచరింపబడుట వలన మానసిక సుఖముండును. అట్టివారు సంతోషముగ కర్తవ్యములను నిర్వర్తించు చుందురు. అంతరంగమున ఆరాధన జరుగుచుండును. అంతరంగ మున దైవముతో యోగము చెందుట, బహిరంగమున వైభవముగ జీవించుట, శ్రీమాత అనుగ్రహముగ వీరికి లభించును.

జీవితమున కర్తవ్యమును నిర్వర్తించువారు రెండు రకములుగ నుందురు. నిర్వర్తించవలెను కదా! అని నిర్వర్తించువారు మెండు.

ఇట్టివారు కర్తవ్యము తప్పదు గనుక నిర్వర్తింతురు. తప్పుకొనుటకు వీలున్నచో తప్పించు కొందురు. వీరికి సుఖము శాశ్వతము కాదు. "తనకున్న పని తినకున్నా తప్పదు" అని చేయువారు కర్తవ్య నిర్వహణ మును మానసికమైన బరువుతో చేయుదురు. తప్పని పనియైనను, ఉల్లాసముగ చేయుట అను మార్గ మొకటున్నది. ఇష్టపడి చేసినచో కష్టమైన పని అయిననూ సంతోషముగ నిర్వర్తింపవచ్చును. ఇట్లు కర్తవ్యములను యిష్టపడి చేయుట ఎవరి కబ్బునో వారే జీవితమును సుఖమయము గావించుకొనగలరు. ఇట్టివారే జీవితమున సంపద లుండుట, లేకుండుటతో సంబంధములేక వైభోగముగ జీవింతురు. వీరు జీవించు విధానమున సత్యధర్మముల వైభవము గోచరించును. వీరియందు గోచరించు వైభోగమే భోగిని.

294. 'భువనేశ్వరీ'

పదునాలుగు లోకములతో కూడిన భువనమునకు ఈశ్వరి అని అర్థము.

భువనమనగా ఏడు ఊర్ధ్వలోకములు, ఏడు అధోలోకములతో కూడిన సృష్టి. ఇన్ని లోకముల సృష్టి జీవుల పరిణామమును బట్టి ఏర్పడును. ఇన్ని లోకముల రూపము, అందలి జీవుల రూపము, ఆయా జీవుల స్వభావము, ప్రాణము శ్రీమాత ఆధారముగనే ఏర్పడుచూ వర్తించుచూ ఉన్నవి. వెండితెర ఆధారముగనే ప్రేక్షకులు పౌరాణిక ములు, జానపదములు, సాంఘికములైన చిత్రములను చూచు చున్నారు కదా! కుట్రలు, హత్యలు, మోసములు, దోపిడీలు, యుద్ధములు, నవరసభరితములైన సన్నివేశములు, విశ్వాసము, భక్తి ఇత్యాది వన్నియూ వెండితెర ఆధారముగనే జరుగుచుండును. ఈ వెండి తెరయే శ్రీమాత. అన్ని జీవులయందు వెండితెరవలె యుండి, వారికి ప్రాణము, తెలివి నందించి, వారి స్వభావములకు, రూపము లకు ఆధారముగా నుండును. ఇట్లు రూపము, రంగు, శబ్దము, అంకె అను నాలుగు అంశముల కాధారమై వాని నధిష్ఠించి ఐదవదిగా తానుండును. అంతటిపైన తన ఆధిపత్య ముండును.

295. 'అంబికా'

జగన్మాత అని ఈ నామమున కర్థము.

మాతృభావము జీవులకు సంక్రమించుట శ్రీమాత నుండియే. మాతృభావము నిర్మలమైన ప్రేమ భావము. తల్లి ప్రేమను మించిన ప్రేమ లేదు. పిల్లలకు తల్లిపై ప్రేమ యుండుట అంతంతమాత్రమే. కాని తల్లికి పిల్లలపై ప్రేమ అత్యధికము. తన నుండి పుట్టుట వలన ప్రతి తల్లి తన పిల్లలను అత్యధికముగ ప్రేమించును. తన పిల్లల తరువాతే తల్లి కెవ్వరైనను. కేవలము మహోన్నతమైన వ్యక్తులే ఇతరులను కూడ తమ పిల్లలతో సమానముగ చూడగలరు. మహాభారతమున కుంతీదేవి, ద్రౌపదీదేవి అట్టివారు. అందరికీ తల్లులుందురు గాని, కొందరే తల్లులు కాగలరు. పురుషులు తల్లులు కాలేరు గనుక వారియందు మాతృభావము తక్కువ. హృదయ వికాసము కలిగినవారే ఇట్టి మాతృభావమును కలిగియుందురు. ఆ రుచి వారికి తెలియును. మహత్తరమైన జ్ఞానులు కాకున్ననూ, తల్లులు మధురమైన మాతృభావము ననుభవింతురు. అందలి మాధుర్యము వారికే తెలియును. ఆ మాధుర్యము కారణముగనే ఉచ్చ నీచములను మరచి పిల్లలకు సేవ చేయుదురు. మహాత్ముల యందు కూడ ఈ మాతృభావము ఆవిష్కరింపబడుటచే వారునూ ఉచ్చ, నీచములు మఱచి జీవులకు సేవ చేయుదురు. ఇట్టి శ్రీమాత మాతృ భావము అంబికా భావము నుండి విడుదల అగుచున్నది.

పిల్లియైననూ, కుక్కయైననూ, పులియైననూ, ఏనుగైననూ, పందియైననూ తమ పిల్లలను పెంచి పోషించు విషయమున ఈ మాతృభావమునే ప్రకటించుచున్నవి. ఆధునిక మానవులలో కొందరు మాత్రము ఈ సహజ సిద్ధమైన దేవీ సాన్నిధ్యమును కోల్పోవుచున్నారు. అందము తగ్గునని పాలివ్వని స్త్రీలు అట్టివారు.

హృదయము కఠినమైనపుడు మాతృభావమునకు స్థానముండదు. కఠిన హృదయులగు స్త్రీలు మాతృభావమును కోల్పోవుదురు. వారికి శ్రీమాత సాన్నిధ్యము దుర్లభమగును. శ్రీమాత సహజముగ అందించిన ఒక సాన్నిధ్య అవకాశమును కఠినత్వము వలన కోల్పోవుట దురదృష్టము. పురుషులైననూ, స్త్రీలైననూ దయ, దాక్షిణ్యము, ప్రేమ, అనురాగముల ద్వారా హృదయము మెత్తబడిన వారిగ మలచుకొనినచో అంబిక సాన్నిధ్య మిచ్చును. కఠిన హృదయులకు కష్టనష్టములు కలిగి అటుపైన మెత్తబడుట జరుగును. పిండిని మలచినట్లు పప్పును మలచలేము. అట్లే దివ్యత్వము కలుగుటకు జీవులకు కష్టనష్టములు సృష్టియం దవసరమైనవి. పప్పును దంచి పిండిని చేయవలెను కదా! ఎట్లైననూ జీవులకు నిజమగు మాతృభావమును సంక్రమింపజేసి ఉద్ధరించుకొనుటకు తల్లివలె జగన్మాత అనేకమగు ప్రయత్నములు చేయుచుండును. ఆమె అంబిక. సృష్టిజీవుల మేలుకోరు తల్లి. అన్ని విధముల మేలు కలుగజేయుటకే ప్రయత్నించుచునుండును.

296. 'అనాదినిధనా'

ఆది, అంతము లేనిది శ్రీమాత అని అర్థము.

అనాది అను పదమునకు వివరణము ఇట్లున్నది. 'ద' అనగా 8. 'అ' అనగా 0. సంస్కృతమున సంఖ్యలను ఎడమ వైపునుండి పలుకుదురు. అందువలన 08 – 80 గ మారును. ఆది 80 అయి నపుడు, అనాది అనగా 80 కానిది. 80 రకములైన విఘాతములు అమృతత్వమునకు కలవని, వీని వలన జీవుడు మరణము ననుభ వించునని శాస్త్రములు తెలుపుచున్నవి. ఈ 80 మరణ సాధనములను తొలగించునది శ్రీదేవి అని రహస్యార్థము.

పామరులగు మానవులు ఒక మరణమునే చూతురు. నిజమున కనేక మరణములు కలవు. బ్రహ్మత్వమును కోల్పోవుటయే నిజమగు మరణము. బ్రహ్మత్వమును పొందుట వలననే జీవుడు అన్ని విధములగు మరణముల నుండి ముక్తి చెందును. పాశ మరణములు, వధ మరణములు అను రెండు విధములైన మరణములు గలవు. వధ మరణములు 28. పాశ మరణములు 52. మొత్తము 80 మరణములు జీవుడు అనుభవించును. అహంకారము వలన 28 విధములగు మరణములు కలుగును. ఆశాపాశము వలన 52 విధములగు మరణములు కలుగును.

బుద్ధి నశించినపుడు ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు

కర్మేంద్రియములు, మనస్సు, పదకొండునూ, ధర్మరహితమైన కార్యముల నొనర్చును. దాని వలన జీవునికి నష్టము కలుగును. అపుడు జీవుడు తుష్టికొరకై రకరకములైన అపచారములు చేయును. అది పదిహేడు రకములుగ నుండునని లింగపురాణము తెలుపు చున్నది. సంపూర్ణత చెందుటకు తొమ్మిది తుష్టులు, ఎనిమిది సిద్ధులు అవసరమై యున్నవి. వీటికవరోధము లేర్పడుట కూడ జీవ వధయే. తొమ్మిది తుష్టులీ విధముగ నున్నవి.

1. అష్ట ప్రకృతులను అధిగమించుట.
2. సన్యాస స్థితిని పొందుట (ఇష్టాయిష్టములు దాటుట)
3. కాలము వలన అన్నియూ ఫలించునను విశ్వాసము కలుగుట.
4. భగవంతుడు తప్పక అనుగ్రహించునను విశ్వాసము కలుగుట.
5. శబ్దము వలన ఆనందమును పొందుట.
6. స్పర్శ వలన ఆనందమును పొందుట.
7. రూపము వలన ఆనందమును పొందుట.
8. రుచి వలన ఆనందమును పొందుట.
9. వాసన వలన ఆనందమును పొందుట.

ఇందు మొదటి నాలుగు తుష్టులు అంతః తుష్టులు. తరువాత

ఐదు తుష్టులు బాహ్య తుష్టులు. ఇవి కలుగని వారు సంపూర్ణత వైపునకు పోజాలరు.

అష్టసిద్దులు ఈ విధముగ నున్నవి.

1. సరియగు ఊహ.
2. వినుట ద్వారా సర్వమును ఎఱుగుట.
3. గురూపదేశము నెరుగుట.
4. మంచి స్నేహితులను పొందుట.
5. సత్పురుషుల యొక్క శుశ్రూష.
6. భౌతిక దేహ సంపూర్ణ సహకారము.
7. స్వభావ సహకారము.
8. ప్రార్థనా ధ్యానాదులయందు ప్రజ్ఞ స్థిరమై దైవ సాన్నిధ్యము నందుండుట.

ఈ విధముగ 28 వధలు- బుద్ధిరాహిత్యము వలన (11), తుష్టి లేమి వలన (9), సిద్ధి లేమి వలన (8) కలుగుచున్నవి. ఈ అవరోధములు తొలగినచో వధ రూపమైన మరణములు దాట వచ్చును.

ఈ ఇరువది ఎనిమిదియూ జీవునికి మరణహేతువులే. అనగా తాను శాశ్వత ధర్మ స్వరూపుడను సత్యమును మరుగు పఱచి అజ్ఞానపు

మార్గములలో పడవేయును. వీని వలననే రాబోవు జన్మలలో గ్రుడ్డితనము, చెవిటితనము, మూగతనము కలుగుట మరియు అంగవైకల్యములతో పుట్టుట జరుగుచుండును.

ఇక పాశ మరణములు 52గ వివరింపబడినవి. "*ఆశాపాశము తా గడున్ విడుపు లేదు రాజేంద్రా!*" అని భాగవతమున బోధింప బడినది. ఆశకు అంతు లేదు. అహంకార మున్నంత కాలము ఆశ వుండును. పదమూడు లోకములలో, నాలుగు స్థితులలో జీవు లందరికిని ఏదో ఒక ఆశ. ఈ ఆశ దైవమును గూర్చి కానపుడు మరణము తథ్యము. ఇట్టి పలువిధములగు మరణములను శ్రీమాత దాటించగలదు. అందులకే ఆమె ఆరాధనము.

ఈ పై వివరణ మంతయూ అనాది అను పదమును గూర్చి. దాని నంత మొందించునది శ్రీదేవి గనుక ఆమె 'ఆనాదినిధనా' అయి వున్నది.

297. 'హరిబ్రహ్మేంద్రసేవితా'

విష్ణువు, బ్రహ్మ, ఇంద్రులచే సేవింపబడునది శ్రీదేవి అని అర్థము.

చతుర్ముఖ బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు కూడ శ్రీమాత నుండి దిగివచ్చిన వారే. కనక వారునూ వారి వారి కర్తవ్యములను- శ్రీమాతను సేవించుచునే నిర్వర్తింతురు. వారా స్థితులయందుండుటకు కూడ వారి ఆరాధనమే కారణము. మహాచైతన్యము నుండి త్రిమూర్తులు (3), ద్వాదశాదిత్యులు (12), ఏకాదశ రుద్రులు (11), అష్ట వసువులు (8), అశ్వినీదేవతలు (2) వెలువడిరి. అట్లే కుమారులు (4), ప్రజా పతులు (10), ఋషులు (7), మనువులు (14) ఏర్పడిరి. కాలము కూడ ఏర్పడినది. ఇట్లు 72 అంశములు శ్రీమాత చైతన్యము నుండి ఉద్భవించినవి. ఈ అంశా రూపములన్నియూ శ్రీదేవివే. కావున ఆమెకే ఉన్ముఖమై యుండును.

శ్రీదేవి నారాధించినచో సకల దేవతామూర్తులను కూడ ఆరాధించినట్లే. ఇక ప్రత్యేకముగ ఇతర దేవతల నారాధింప పనిలేదు. శ్రీదేవి రూపమునుగాని, శ్రీమహా విష్ణువు రూపమును గాని ఆరాధింప వచ్చును.

298. 'నారాయణీ'

దివ్యజలములు నివాసముగా గలది అని అర్థము.

దివ్య జలములనగా సృష్టి కాధారభూతమైన, అనంతమైన తత్త్వము. అది నీలి తరంగమువలె అనంతమై యుండును. ఇవియే సృష్టికి మూలము. వీనిని నారములని కూడ పిలుతురు. వీనియందు తేలుచు నుండునది శ్రీదేవి కనుక నారాయణి అయినది. నారాయణు డన్ననూ, నారాయణి అన్ననూ ఒక్కటియే. పురాణములందు నారాయణుని సహోదరి కనుక నారాయణి అనిరి. అట్లే శివునికి నారాయణుడను పేరు కలదు. అతని భార్య గనుక నారాయణి అని కూడ శ్రీమాత నందురు.

పద భేదము వలన తత్త్వ భేదము, అవగాహనా భేదము కలుగరాదు. సృష్టి కతీతమగు జలములను నివాసముగా గల స్థితి ఇది. శ్రీ లక్ష్మిని, పార్వతిని 'నారాయణి' అను నామముతో పిలుతురు. అట్లే విష్ణువుని, శివునిగూడ 'నారాయణుడు' అని పిలుతురు. నారముల నధిష్ఠించి యుందురు గనుక వీరు నారాయణులు. (నారాయణ అనునది ఒకటియే. నారాయణు లనుట అవగాహన కలిగించుటకు.)

నరులు కూడ నారముల నుండి వచ్చినవారే కనుక వారును శాశ్వతులే. 'నర' అన్నను 'నారీ' అన్ననూ ఒక్కటియే. 'నారాయణ', 'నారాయణి' వలెనే, నర, నారీ పదము లేర్పడినవి. ఈ శబ్దము

లన్నిటియందు మూలశబ్దము 'నర' శబ్దము. 'ర' అనగా నశించునది. 'నర' అనగా నశింపనిది.

'నారములు' నశింపనివి. అవి సృష్టికి ముందు, లయమునకు వెనుక కూడ నుండును. కనుక నారాయణి, నరులు ఎప్పుడూ నుందురు. నారాయణునకు, నరునకు వ్యత్యాసము అయనము అను శబ్ద మొకటియే (నర + అయనము = నారాయణము). అయనము అనగా ఆరోహణము లేదా అవరోహణము . (దక్షిణ + అయనము, ఉత్తర + అయనము). నరులు సృష్టియందు అవరోహణము చెందుట, ఆరోహణము చెందుట యుండును. నారాయణుడట్లు అవరోహణ, ఆరోహణములు లేక, వాని నధిష్ఠించి నడిపించు వాడుగ నుండును. శ్రీమాత పరముగ చెప్పునపుడు నారాయణి సృష్టి స్థితి లయములను గావించు చున్నదని తెలుపుదురు. అందరునూ పూజించునది, పూజించవలసినది 'నారాయణి' లేక 'నారాయణు'లనే. ఈ పూజనము తత్త్వపరము.

299. 'నాదరూపా'

నాదరూపము గలది శ్రీదేవి అని అర్థము. సృష్టి సంకల్పింప బడినపుడు ఆ సంకల్పము నాదరూపముగ వ్యక్తమగును. నాదమే తత్త్వమునకు మొదటి శరీరముగ వేదములు కీర్తించుచున్నవి. నాద మున్నంతవరకు సృష్టి యుండును. నాదము నిష్క్రమించినచో సృష్టి తిరోధానము చెందును. నాదమే ప్రాణము; నాదమే తెలివి, నాదమే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగ ప్రకటిత మగును. నాద మాధారముగనే సమస్త లోకము లేర్పడి గుత్తిగ కలిసియున్నవి. దైవము నాద స్వరూపము. జీవులును నాద స్వరూపులే. సృష్టికూడ నాద స్వరూపమే. నాదము కాని దేమియూ లేదు. తత్త్వము నుండి వెలువడిన నాదము అవరోహణ క్రమమున వాక్కై దిగివచ్చును. సృష్టి కాధారమైన ఈ నాద రూపమే పరదేవతయైన శ్రీమాత ప్రథమ రూపము. పరమ శివుని గూడ నాద తనువు గలిగినవాడని ఋషులు కీర్తించిరి.

ఈ నాద మొక ఝంకారమువలెనూ, ఓంకారమువలెనూ మనయందు నిత్యము జరుగుచున్నది. అది ఆధారముగనే మన ప్రాణము, తెలివి, మనస్సు, ఇంద్రియములు, శరీరము పనిచేయు చున్నవి. మన ముండుట యనగా నాద ముండుటయే. నాదము ననుసరించి దేహమును స్వచ్ఛందముగా వీడుట, మరల దేహమందు ప్రవేశించుట "అక్షర పరబ్రహ్మ యోగము" నందు శ్రీకృష్ణుడు బోధించి నాడు. నాదమును అనుస్మరణ చేయుట వలన ఇది సిద్ధించునని

తెలిపినాడు. అవరోహణమునకు, ఆరోహణమునకు నాదమే ఆధారము.

సృష్టి మొత్తము నాదమను దారమున కెక్కించిన పూసలగుత్తి వంటిది. దారము ఊడినచో పూసలు రాలినట్లు, నాదమాగినచో సృష్టి నాటక మదృశ్యమగును. శ్రీకృష్ణుని గానము నాదగానమే. అతడు ఆ గానము ద్వారా జీవులయందలి నాదమును మేల్కొలిపి తనలోనికి ఆకర్షించెడివాడు. అట్టి సమయమున పశుపక్ష్యాదులతో సహా మొత్తము ప్రకృతి తన్మయత్వము చెందెడిది. ఇక మానవుల మాట చెప్పనేల?

శ్రీదేవిని నాదరూపగ ఉపాసించుట మహత్తరమగు యోగము. నాదోపాసనమున సర్వసిద్ధి కలుగును. అది శ్రీమాత అనుగ్రహముగ సాగవలెను.

300. 'నామరూప వివర్జితా'

నామ రూపములను విసర్జించునది శ్రీమాత అని అర్థము.

నామము (1). రూపము (2). ఈ రెండునూ జగత్తు రూపములు. అనగా మార్పుచెందు రూపములు. వీనియందు సత్యము నేతి బీరకాయలోని నేయి వంటిది. భౌతిక వ్యవహారమునకే నామము, రూపము అనుభవించు జీవుడు వీనికి భిన్నముగ నున్నాడు. అట్టి జీవునికన్న భిన్నముగ దైవముండును. జీవునికి స్వభావము మొదటి పొర. రూపము రెండవ పొర. నామము మూడవ పొర. రూప మున్నచోట నామ ముండును. రూపము లేనిచోట నామము లేదు. నామము లేక రూపము ఉండవచ్చును. పేరు పెట్టకముందు కూడ శిశువునకు రూపమున్నది కదా! ముందు రూపము, తరువాత నామము సృష్టి క్రమమున ఏర్పడినవి. రూపము, నామము లేకున్ననూ స్వభావ రూపమున జీవుడుండ గలడు. ఈ స్వభావము దైవీ ఆసురీ మానవ స్వభావములుగ కూడ నుండవచ్చును. స్వభావమును దాటుట మూడు పొరలను దాటుట. అపుడుండునది 1) ఉండుట, 2) దాని వెలుగు, 3) దాని ఆనందము. ఈ మూడింటిని సత్ చిత్ ఆనంద అందురు (సచ్చిదానంద). సచ్చిదానందస్థితి సృష్టి యందు శ్రీమాత సహజ స్థితి. రూపమును దాల్చుట, నామమును ధరించుట ఆమె ఆవశ్యకతను బట్టి నిర్వర్తించు చుండును. ఇట్లు శ్రీదేవికి ఐదు రూపము

లున్నట్లు పెద్దలు తెలుపుదురు. 1) అస్థిత్వము లేక ఉండుట 2) వెలుగు 3) ఆనందము 4) రూపము 5) నామము.

శ్రీదేవి కేది సహజ స్థితియో జీవులకా స్థితి జేరుట సిద్ధి. వారు సామాన్యముగ నామమునందు, రూపమునందు, స్వభావము నందు బద్ధులై యుందురు. శ్రీదేవి నుపాసించుటలో తన్మయత్వము చెందగలిగినచో భ్రమర కీటక న్యాయమున వారును సచ్చిదానంద స్థితిని పొందగలరు. నిజమునకు స్వభావ ప్రభావము వీడినచో జీవుడు కూడ సచ్చిదానంద రూపుడే.

"శ్రీమాత సచ్చిదానంద స్వరూపిణి. ఆమె నామరూపములను విసర్జించి వెలుగై ఆనందముగ నున్నది. నేనునూ సచ్చిదానంద స్వరూపుడనే. నా నామ రూపములు తాత్కాలికములు. నా స్వభావము నే నేర్పరచుకొన్నది. వీరిని విసర్జించి దేవి పద సాన్నిధ్యమున చేరి సచ్చిదానంద రూపుడుగనే ఆమెను ఆరాధింతునుగాక!" అని సంకల్పించుకొని శ్రీమాత నారాధింపుడు. సర్వము శుభంకరము కాగలదు.

జై సచ్చిదానంద!

శ్రీలలితా సహస్రనామ మందలి మూడవ సంపుటము

సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీ బాలా త్రిపురసుందర్యై నమః ।

శ్రీ లలితా సహస్రనామ స్తోత్రరత్నము

ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః ।

సర్వశక్తిమయీ సర్వమంగళా సద్గతిప్రదా ।
సర్వేశ్వరీ సర్వమయీ సర్వమంత్ర స్వరూపిణీ ॥ 52

సర్వయంత్రాత్మికా సర్వతంత్రరూపా మనోన్మనీ ।
మాహేశ్వరీ మహాదేవీ మహాలక్ష్మీ ర్మృడప్రియా ॥ 53

మహారూపా మహాపూజ్యా మహాపాతకనాశినీ ।
మహామాయా మహాసత్త్వా మహాశక్తి ర్మహారతిః ॥ 54

మహాభోగా మహైశ్వర్యా మహావీర్యా మహాబలా ।
మహాబుద్ధి ర్మహాసిద్ధి ర్మహాయోగేశ్వరేశ్వరీ ॥ 55

మహాతంత్రా మహామంత్రా మహాయంత్రా మహాసనా ।
మహాయాగ క్రమారాధ్యా మహాభైరవ పూజితా ॥ 56

మహేశ్వర మహాకల్ప మహాతాండవ సాక్షిణీ ।
మహాకామేశమహిషీ మహాత్రిపురసుందరీ ॥ 57

చతుష్షష్ట్యుపచారాఢ్యా చతుష్షష్టి కళామయీ ।
మహాచతుష్షష్టి కోటి యోగినీ గణసేవితా ॥ 58

మనువిద్యా చంద్రవిద్యా చంద్రమండల మధ్యగా ।
చారురూపా చారుహాసా చారుచంద్ర కళాధరా ॥ 59

చరాచర జగన్నాథా చక్రరాజనికేతనా ।
పార్వతీ పద్మనయనా పద్మరాగ సమప్రభా ॥ 60

పంచప్రేతాసనాసీనా పంచబ్రహ్మ స్వరూపిణీ ।
చిన్మయీ పరమానందా విజ్ఞానఘనరూపిణీ ॥ 61

ధ్యాన ధ్యాతృ ధ్యేయరూపా ధర్మాధర్మ వివర్జితా ।
విశ్వరూపా జాగరిణీ స్వపంతీ తైజసాత్మికా ॥ 62

సుప్తా ప్రాజ్ఞాత్మికా తుర్యా సర్వావస్థా వివర్జితా ।
సృష్టికర్త్రీ బ్రహ్మరూపా గోప్త్రీ గోవిందరూపిణీ ॥ 63

సంహారిణీ రుద్రరూపా తిరోధానకరీశ్వరీ ।
సదాశివాఽనుగ్రహదా పంచకృత్య పరాయణా ॥ 64

భానుమండల మధ్యస్థా భైరవీ భగమాలినీ ।
పద్మాసనా భగవతీ పద్మనాభ సహోదరీ ॥ 65

ఉన్మేషనిమిషోత్పన్న విపన్న భువనావళిః ।
సహస్రశీర్షవదనా సహస్రాక్షీ సహస్రపాత్ ॥ 66

ఆబ్రహ్మకీటజననీ వర్ణాశ్రమవిధాయినీ ।
నిజాజ్ఞారూపనిగమా పుణ్యాపుణ్య ఫలప్రదా ॥ 67

శ్రుతిసీమంత సిందూరీకృత పాదాబ్జధూళికా ।
సకలాగమ సందోహ శుక్తిసంపుట మౌక్తికా ॥ 68

పురుషార్థ ప్రదాపూర్ణా భోగినీ భువనేశ్వరీ ।
అంబికాఽనాదినిధనా హరిబ్రహ్మేంద్రసేవితా ॥ 69

నారాయణీ నాదరూపా నామరూప వివర్జితా ।

Dhanista Publications

OTHER BOOKS THROUGH
MASTER K. PARVATHI KUMAR

The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.

BOOKS :

1.	MITHILA –A New Age Syllabus	E/G/S
2.	THE AQUARIAN MASTER	E/G/S
3.	SOUND –The Key & its Application	E/G/S
4.	ASHRAM LEAVES	E/G/S
5.	SANKHYA –The Sacred Doctrine	E/G/S
6.	VENUS –The Path to Immortality	E/G/S
7.	THEOSOPHICAL MOVEMENT	E/G/S
8.	SHIRDI SAI SAYINGS	E/G/S
9.	SPIRITUALITY IN DAILY LIFE	S
10.	THE MASTERS OF WISDOM	S
11.	MEDITATION & GAYATRI	S
12.	WISDOM TEACHINGS OF VIDURA	E/G/S
13.	ON HEALING	E/G/S
14.	SPIRITUAL FUSION OF EAST & WEST	E
15.	SRI SASTRY GARU	E/G/S/F/T
16.	THE AQUARIAN CROSS	E/G/S
17.	HERCULES –The Man & the Symbol	E/G/S
18.	MANTRAMS –Their Significance & Practice	E/G/S
19.	SRI DATTATREYA	E/G/S/T/HI

20.	SATURN –The Path to Systematised Growth	E/S
21.	JUPITER –The Path of Expansion	E/S
22.	MASTER E.K. –The New Age Teacher	E/G/S
23.	AMANASAKUDU	T/K
24.	ANVESHAKUDU	T
25.	ASANGUDU	T
26.	VRUTRASURA RAHASYAM	T
27.	THE DOCTRINE OF ETHICS	E
28.	DHANAKAMUNI KATHA	T
29.	ANTARDARSANA DHYANAMULU	T
30.	THE SPLENDOR OF SEVEN HILLS	E/T/Hi
31.	DOCTRINE OF ETERNAL PRESENCE	E
32.	SARASWATHI - THE WORD	E
33.	MANA MASTARU GARU	T
34.	GEETOPANISHAD (Sankhya Yogamu)	T
35.	GEETOPANISHAD (Karma Yogamu)	T
36.	GEETOPANISHAD (Jnana Yogamu)	T
37.	GEETOPANISHAD (Karmasanyasa Yogamu)	T
38.	‘OM’KARAM	T
39.	JYOTIRLINGA YATRA	T
40.	SRI LALITHA - 1	T
41.	SRI LALITHA - 2	T
42.	KATHA DEEPIKA	T
43.	MASTER C.V.V. (Birthday Message)	T
44.	MAITREYA MAHARSHI BODHALU	T / HI

45. MARUVU MAHARSHI BODHALU T
46. DEVAPI MAHARSHI BODHALU T
47. HIMALAYA GURU PARAMPARA T
48. OCCULT MEDITATIONS E
49. RUDRA E
50. Master C.V.V. - The Initiator - Master E.K. The Inspirer E
51. SAI SUKTHULU T
52. साई की अमृतवाणी Hi
53. SRI KRISHNA NAMAMRUTAM T
54. On LOVE E
55. On SILENCE E
56. On CHANGE E
57. On SERVICE E
58. Sri GURUPADUKASTAVAM T

BOOKLETS :

1. LORD MAITREYA -The World Teacher E/G/S/F
2. THE WHITE LOTUS E/G/S
3. WISDOM BUDS E/G/S
4. SPIRITUALISM, BUSINESS & MANAGEMENT E/G/S
5. THE PATH OF SYNTHESIS E
6. THE ETHERIC BODY E/G/S
7. MARIA MAGDALENA E/G/S
8. TIME, THE KEY E/G/S

9. LISTENING TO THE INVISIBLE MASTER E/G/S/F/H
10. GOOD FRIDAY E/G/S/F/H
11. BHRIKTA RAHITA TARAKA RAJAYOGAMU T/K
12. MARRIAGE - A SACRAMENT E
13. MASTER C.V.V. YOGAMU-KARMARAHITYAMU T
14. POOJA VIDHANA PRASASTYAMU T
15. GAYATRI MANTRA PRASASTYAMU T
16. BHARATEEYA SAMPRADAYAMU T/Hi
17. SRI DATTATREYA T

ధనిష్ఠ ఇతర ప్రచురణలు :

1. శ్రీ వినాయక వ్రతకల్పము
2. శ్రీ శరన్నవరాత్ర పూజావిధానము
3. శ్రీ హనుమాన్ చాలీసా
4. శ్రీ సూర్య పూజావిధానము
5. శ్రీ శివ హృదయము
6. శ్రీ మహాలక్ష్మి పూజావిధానము
7. శ్రీ వేంకటేశ్వర పూజావిధానము
8. శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రము
9. పురాణపురుషుని పూజా విధానము
10. శ్రీ దత్తాత్రేయ పూజా విధానము
11. శ్రీ శివ పూజా విధానము